# ది క్రైమ్ న్యూస్

Crime News

తెలుగు దినపత్రిక

శుక్రవారం, అక్టోబర్ 24, 2025 | సంపుటి - 20 | సంచిక 42 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


### రష్యా-ఉక్రెయిన్‌యుద్ధానికి
## చరమగీతం పడేనా



- రష్యాపై ఒత్తిడి పెంచే యత్నంలో ట్రంప్
- చమురు సంస్థలపై నిషేధంతో చర్యలు

వాషింగ్టన్ : రష్యా అధ్యక్షుడు పుతిన్, ట్రంప్‌ల భేటీ వాయిదా పడిన నేపథ్యంలో అనేక వార్తలు ప్రచారంలోకి వస్తున్నాయి. అలాగే రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగించే విషయంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

తరువాయి 2లో



### తెలంగాణ కేబినెట్
# కీలక నిర్ణయం

## ఇద్దరు పిల్లల నిబంధన' ఎత్తివేత

### రిజిస్ట్రేషన్ శాఖలో కొత్తగా 14 మంది సబ్ రిజిస్ట్రార్ల నియామకం

### గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఆర్డినెన్స్ బిల్లు

తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉన్న 'ఇద్దరు పిల్లల నిబంధన' ఎత్తివేతకు కేబినెట్ ఆమోదం తెలిపింది. పంచాయతీరాజ్ చట్టం 2018లోని సెక్షన్ 21(3) తొలగించాలని కేబినెట్ నిర్ణయించింది. ఇప్పటికే పంచాయతీ రాజ్ చట్టం 2018లోని సెక్షన్ 21(3)ని సవరించే ఆర్డినెన్స్‌పై ఆ శాఖ మంత్రి సీతక్క, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతకం చేశారు.

హైదరాబాద్ : రిజిస్ట్రేషన్ శాఖలో కొత్తగా 14 మంది సబ్ రిజిస్ట్రార్లని రేవంత్‌రెడ్డి సర్కార్ నియమించింది. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇందుకు సంబంధించిన విషయాలను మీడియాకు వెల్లడించారు. స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖలో కొత్తగా నియమించిన అధికారులు బాధ్యతలు స్వీకరించారని తెలిపారు. కాంగ్రెస్ హయాంలోనే యువతకు ఉద్యోగాలు వచ్చాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉద్ఘాటించారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని ప్రకటించారు.



### రేవంత్ పాలనలో
## దర్జాగా సెటిల్‌మెంట్లు

- ఎవరికీ వచ్చినట్టు వారు దోచుకుంటున్నారు
- కాంగ్రెస్ అవినీతిలో అధికారులు భాగస్వామ్యం కావొద్దు
- సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ ఆగ్రహం

2



### ప్రభుత్వ వైఫల్యాలను
## ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### ఉప ఎన్నికలో గెలుపే లక్ష్యం

- కాంగ్రెస్ బాకీ కార్డులను ప్రతి ఇంటికి పంచాలి
- రౌడీ షీటర్‌కు కాంగ్రెస్ టికెట్ ఇచ్చింది
- పార్టీ నేతలకు కెసిఆర్ దిశానిర్దేశం

**జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో గెలుపే లక్ష్యంగా భారత రాష్ట్ర సమితి నాయకులకు పార్టీ అధినేత కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో దాదాపు రెండున్నర గంటలకుపైగా పార్టీ సీనియర్ నేతలతో కేసీఆర్ సమావేశ మయ్యారు. ఉప ఎన్నిక ప్రచారంలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు.**

హైదరాబాద్ : "కాంగ్రెస్ బాకీ కార్డులను జూబ్లీహిల్స్ నియోజక వర్గంలో ప్రతి ఇంటికి పంచాలి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తెలంగాణ ఆగమైంది.. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఆగమవుతున్న తెలంగాణను కాపాడుకోవాల్సిన అవసరముంది. ప్రజల్లో కాంగ్రెస్ వైఫల్యాలపై విస్తృతంగా చర్చ జరగాలి" అని కేసీఆర్ అన్నారు.

తరువాయి 2లో



### గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా
## తెలంగాణ

- తెలంగాణ ఐటి శాఖమంత్రి శ్రీధర్‌బాబు

మెల్‌బోర్న్ : తెలంగాణను గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ఐటి శాఖమంత్రి శ్రీధర్‌బాబు అన్నారు.

తరువాయి 2లో

### మత్స్యకారులను
## క్షేమంగా తీసుకువస్తాం



### బాధిత కుటుంబాలకు పూర్తి భరోసా
### కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

విజయనగరం : బంగ్లాదేశ్ నేవీ సిబ్బందికి పట్టుబడిన ఎనిమిది మంది జిల్లా మత్స్యకారుల ఘటనపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు గురువారం ప్రకటన విడుదల చేశారు. బాధిత కుటుంబాలకు పూర్తి భరోసా కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

తరువాయి 2లో



## రీయింబర్స్‌మెంట్ బకాయిలపై బిజెపి పోరు

- నవంబర్ తొలివారంలో 'చలో హైదరాబాద్'
- బండి సంజయ్‌తో కాలేజీ యాజమాన్యాల భేటీ

2

## సీఎం అభ్యర్థిగా తేజస్వీయాదవ్



న్యూఢిల్లీ : బిహార్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సమయం సమీపిస్తుంది. అలాంటి వేళలో సైతం విపక్ష కూటమి మహాగఠ్ బంధన్‌లో సీట్ల సర్దుబాటు ఒక్క కొలిక్కి రావడం లేదు. అయితే ఈ కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిపై మాత్రం ఏకాభిప్రాయానికి వచ్చినట్లు మీడియా కథనాల ద్వారా వెల్లడి అవుతోంది. సీఎం అభ్యర్థిగా ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ తనయుడు తేజస్వీ యాదవ్‌ను ఎంపిక చేసినట్లు ఆ కథనాల సారాంశం.

తరువాయి 2లో

### మహాకూటమి పోస్టర్‌నుంచి
## రాహుల్ ఫొటో అవుట్



న్యూఢిల్లీ : కూటమి తరపున సీఎం అభ్యర్థి ప్రకటన కోసం ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ పోస్టర్ల నుంచి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఫొటో మాయమవడం రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశమవుతోంది. వచ్చే నెల బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా నేడు ప్రతిపక్ష కూటమి పార్టీలు

తరువాయి 2లో



### ప్రజలు కోరుకుంటే
## రాజకీయ పార్టీగా మారొచ్చు

### ప్రజల సమస్యలపై గళమెత్తుతూనే ఉంటాం
### తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

యాదగిరిగుట్ట : రాష్ట్రంలో 19 ఏళ్ల క్రితం ఎన్జీవోగా పుట్టిన తెలంగాణ జాగృతి సంస్థ ప్రజలు కోరుకుంటే రాజకీయ పార్టీగా మారొచ్చని ఆ సంస్థ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ జాగృతి కార్యకర్తలతో కలిసి యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వైకుంఠ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ జాగృతి సివిల్ సొసైటీ ఆర్గనైజేషన్ గా ఉన్నా ప్రజల సమస్యలపై గళ మెత్తిందన్నారు. ఇకపైనా అదే వైఖరిని కంటిన్యూ చేస్తామని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ప్రజల తరపున మాట్లాడామని, ఏం చేస్తే ప్రజలకు మంచి జరుగుతుందో

2లో

### వచ్చే మూడ్రోజుల్లో
## భారీ వర్షాలు

- హెచ్చరించిన వాతావరణశాఖ

హైదరాబాద్ : తెలంగాణలో రాగల మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

2



### అధికారులపై ఒత్తిడితోనే
## వీఆర్‌ఎస్‌లు

- బీజేపీ రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్

హైదరాబాద్ : రేవంత్‌రెడ్డి పాలనలో ఐఏఎస్ అధికారులు భయపడుతూ ఉద్యోగాలు చేస్తున్నారని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కే లక్ష్మణ్ ఆరోపించారు. వారి స్వార్థం కోసం అధికారులపై ఒత్తిడి తేస్తున్నారని మండిపడ్డారు.

2



### పోచారం కాల్పుల కేసును
## 12 గంటల్లోనే ఛేదించాం

### రాచకొండ సీపీ సుధీర్‌బాబు



హైదరాబాద్ : పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన కాల్పుల కేసును 12 గంటల్లోనే ఛేదించామని రాచకొండ సీపీ సుధీర్ బాబు తెలిపారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. యమ్నంపేట్ వద్ద అక్టోబర్ 22న సాయంత్రం కాల్పుల్లో గో రక్షక్ కార్యకర్త బిద్ల ప్రసాంత్ అలియాస్ సోను సింగ్ తీవ్రంగా గాయపడ్డారన్నారు. గో రక్షక్ దళ్ కార్యకర్త ప్రశాంత్‌పై కాల్పులు జరిపిన నిందితులను అరెస్ట్ చేశామని తెలిపారు.


తరువాయి 2లో

## భారీ వర్షాలపై సీఎం టెలికాన్ఫరెన్స్

- ప్రత్యేక నిధుల విడుదలకు ఆదేశాలు జారీ

అమరావతి : రాష్ట్రంలో వర్ష ప్రభావ పరిస్థితులపై సీఎం నారా చంద్రబాబునాయుడు ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. తాజాగా రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై దుబాయ్ నుంచి అధికారులతో మరోమారు సీఎం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. తీసుకోవాల్సిన చర్యలపై మంత్రులు, సీఎస్, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో మాట్లాడారు. వర్ష ప్రభావిత నెల్లూరు, ప్రకాశం, కడప, తిరుపతి, అన్నమయ్య జిల్లాల పరిస్థితిపై ఆయా జిల్లాల కలెక్టర్లు, ఆర్టీజీఎస్ అధికారులతో ముఖ్యమంత్రి చర్చించారు. నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాలకు రూ. 2 కోట్ల చొప్పున, మిగతా వర్ష ప్రభావిత జిల్లాలకు రూ. 1 కోటి చొప్పున అత్యవసర నిధుల మంజూరుకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను పంపాలని సూచనలు చేశారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. రెవెన్యూ, డిజాస్టర్, పోలీస్, ఇరిగేషన్, మున్సిపల్, ఆర్ అండ్ బి విద్యుత్ శాఖలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు సీఎం.

2లో






తిరువనంతపురం : మాజీ రాష్ట్రపతి కేఆర్ నారాయణన్‌కు చెందిన విగ్రహాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆవిష్కరించారు. కేరళ రాజ్‌భవన్‌లో నారాయణన్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దళిత కమ్యూనిటీకి చెందిన నారాయణన్.. 1997 నుంచి 2002 వరకు రాష్ట్రపతిగా

### మాజీరాష్ట్రపతి విగ్రహాన్ని
## ఆవిష్కరించిన రాష్ట్రపతి

విధులు నిర్వర్తించారు. ఆయన సేవలు స్మరించేందుకు ఛాతి భాగం వరకు ఉన్న నారాయణన్ ప్రతిమను ఏర్పాటు చేశారు.

# ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

సమావేశంలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు, జూబ్లీహిల్స్ అభ్యర్థి సునీత, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, సీనియర్ నేతలు పాల్గొన్నారు.జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో రౌడీ షీటర్‌కు కాంగ్రెస్ టికెట్ ఇచ్చిందని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి హయాంలో తెలంగాణ గుల్ల అయిందని ఆక్షేపించారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై పార్టీ శ్రేణులకు గులాబీ బాస్ దిశానిర్దేశం చేశారు. రెండు గంటలకు పైగా ఈ సమావేశం కొనసాగింది. ఈ క్రమంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అనుసరించాల్సిన వ్యూహంపై మార్గనిర్దేశం చేశారు కేసీఆర్.జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో డివిజన్ల వారీగా ఇప్పటివరకు జరిగిన ప్రచార సరళిని అడిగి తెలుసుకున్నారు కేసీఆర్. మాగంటి గోపీనాథ్ చనిపోయారని.. ఈ క్రమంలో ఉపఎన్నిక అనివార్యమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బాధను దిగమింగుకుని ధైర్యంగా ఎన్నికలను ఎదుర్కోవాలని బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, పార్టీ కేడర్‌కి సూచించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ వ్యతిరేకత ఉపయోగించుకుని ముందుకెళ్లాలని నేతలకు సూచించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ప్రజల్లో వ్యతిరేకత ఉందని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ నేతలు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ భారీ మెజారిటీతో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు కేసీఆర్.కాంగ్రెస్ ఇచ్చిన హామీల బాకీ కార్డులను జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ పంచాలని ఆజ్ఞాపించారు. రేవంత్‌రెడ్డి సర్కార్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలంగాణ ఆగమైందని విమర్శించారు. ఆగమవుతున్న తెలంగాణని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కేసీఆర్ అభిప్రాయం వ్యక్తం చేశారు. హైడ్రా పేరుతో పేదలను వేధిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజల్లో విస్తృతంగా కాంగ్రెస్ వైఫల్యాలపై చర్చ జరగాలని ఆదేశించారు కేసీఆర్.జూబ్లీహిల్స్ బైపోల్‌లో బీఆర్ఎస్ విజయం ఖాయమైందని ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్‌లో మెజారిటీపై ఫోకస్ పెట్టాలని బీఆర్ఎస్ నేతలకు కేసీఆర్ సూచించారు. హైదరాబాద్‌లో శాంతిభద్రతలను కాపాడుకోవడానికి జూబ్లీహిల్స్ ప్రజలు బీఆర్ఎస్‌ని గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తెలంగాణలో ఆర్థిక వ్యవస్థ దిగజారిందని ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో అమలైన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మాయమయ్యాయని విమర్శించారు. కాంగ్రెస్ దుష్టపాలనపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని బీఆర్ఎస్ నేతలకి సూచించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం ప్రభావం.. జీహెచ్ఎంసీ ఎన్నికలపైనా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ గెలిస్తే.. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ప్రజలు తమ వైపే ఉంటారని కేసీఆర్ జోస్యం చెప్పారు.

### రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి
## చరమగీతం పడేనా

ఇందులో భాగంగా తాజాగా రష్యాకు చెందిన రెండు అతిపెద్ద చమురు సంస్థలపై ఆయన ఆంక్షలు విధించారు. రష్యాపై ఒత్తిడి పెంచడమే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. యూఎస్ ట్రెజరీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫారెన్ అసెట్స్ కంట్రోల్ ఆఫీస్ ఓ ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది.ఉక్రెయిన్‌తో యుద్ధం ముగించడమే కాకుండా శాంతి ప్రక్రియపై రష్యాకు నిబద్ధత లేకపోవడం వల్లే ఈ ఆంక్షలు విధించినట్లు తెలిపింది. తమ నిర్ణయం ఆ దేశ చమురు రంగాన్ని ఒత్తిడి పెంచుతుందని, దీనివల్ల రష్యా ఆర్థికవ్యవస్థపై కూడా ప్రభావం పడుతుందని వ్యాఖ్యానించింది. శాశ్వత శాంతి పూర్తిగా రష్యా చర్చలు జరపడానికి రావడంపై ఆధారపడి ఉందని వెల్లడించింది. ట్రంప్ మాట్లాడుతూ.. ఇవి అపారమైన ఆంక్షలన్నారు. అయితే, ఇవి ఎక్కువకాలం ఉండవని, ఈలోపు యుద్ధ సమస్య పరిష్కారమవుతుందని వ్యాఖ్యానించారు. ఈ చర్యకు ఇదే సరైన సమయం అని తాను భావిస్తున్నట్లు కూడా తెలిపారు. ఈ ఆంక్షలతో యుద్ధం కారణంగా జరుగుతున్న హత్యలను ఆపడంతో పాటు తక్షణ కాల్పుల విరమణకు సమయం ఆసన్నమైందని ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ పేర్కొన్నారు. అమెరికా మిత్ర దేశాలు తమతో కలవాలని, ఆంక్షలకు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. ట్రెజరీ ప్రకారం.. ఈ చర్య రష్యా తన సైనిక కార్యకలాపాలకు నిధులు సమకూర్చే సామర్థ్యం తగ్గుతుంది. దీంతో పాటు దాని చమురు ఆధారిత ఆర్థిక వ్యవస్థ బలహీన పడుతుంది. ఇక, ఈయూ కూడా రష్యాపై ఒత్తిడి తెచ్చేందుకు గాను 19 ఆంక్షల ప్యాకేజీకి ఆమోదం తెలిపింది. రష్యా ఎల్ఎన్‌జీపై నిషేధం విధించడం కూడా ఇందులో ఉంది. ఇదిలాఉండగా.. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేసే విషయంపై ట్రంప్ మరోసారి మాట్లాడారు. ఈ ఏడాది చివరి నాటికి భారత్ రష్యా నుంచి చమురు దిగుమతులను భారీగా తగ్గిస్తుందన్నారు. తగ్గింపు క్రమంగా ఉంటుందని, ఇది మంచి చర్య అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ మేరకు భారత్ నుంచి తనకు హామీ వచ్చిందని కూడా తెలిపారు. ఈ విషయంపై ట్రంప్ గత కొన్ని రోజులుగా సొంత ప్రకటనలు చేస్తూ వస్తుండగా.. భారత్ వాటిని ఖండిస్తుంది. అయినా, అగ్రరాజ్యం అధ్యక్షుడు మళ్లీ మళ్లీ ఇలాంటి ప్రకటనలే చేయడం గమనార్హం. అయితే ట్రంప్ ఎత్తుగడలు ఇతరదేశాలకు కంటగింపుగా మారాయి. ఎప్పుడు ఎలా వ్యవహరిస్తారో తెలియని దుస్తితి నెలకొంది.

### పోచారం కాల్పుల కేసును
## 12 గంటల్లోనే ఛేదించాం

ప్రధాన నిందితుడు ఏ1 మొహమ్మద్ ఇబ్రాహీం ఖురేషీని అరెస్టు చేశామని... అలాగే సహ నిందితులు ఏ3 కురువ శ్రీనివాస్, ఏ4 హసన్ బిన్ మోసిన్‌లను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. మరో నిందితుడు ఏ2 హనీఫ్ ఖురేషీ పరారీలో ఉన్నాడన్నారు. ఇబ్రాహీం.. పశువుల రవాణా వ్యాపారం చేస్తున్నాడని.. గోవుల అక్రమ రవాణా బయటపెట్టాడని ప్రశాంత్‌పై నిందితులు కక్ష పెట్టుకున్నారన్నారు. నిందితుడు ఇబ్రాహీం, బాధితుడు సోను సింగ్‌కు గతంలో పరిచయం ఉందని చెప్పారు. దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని అన్నారు. ఇబ్రాహీం 12 సంవత్సరాలుగా పశువుల రవాణా వ్యాపారం చేస్తున్నాడని.. ప్రశాంత్ గతంలో 6 సార్లు పశువుల అక్రమ రవాణా అడ్డుకున్నాడని తెలిపారు. దాంతో ఇబ్రాహీంకు 1 కోటి రూపాయల నష్టం వచ్చిందన్నారు. ఈ క్రమంలో సోనూ సింగ్ అలియాస్ ప్రశాంత్‌పై ఇబ్రాహీం కక్ష పెంచుకున్నాడన్నారు సీపీ. పశువులను రవాణా చేసుకోవాలంటే 5 లక్షలు ఇవ్వాలని ప్రశాంత్ డిమాండ్ చేశాడని నిందితులు చెబుతున్నారని.. దీనిపై అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నామని రాచకొండ సీపీ తెలిపారు. నిందితుడు శ్రీనివాస్.. సెటిల్ చేసుకుందాం, మాట్లాడుకుందామని చెప్పి ప్రశాంత్‌ను స్పాట్‌కు రప్పించాడని... మాట్లాడుకుందామని పిలిచి ఫైరింగ్ చేసి పారిపోయారన్నారు. పిస్టల్‌ను ఛత్తీస్‌గఢ్‌లో కొనుగోలు చేసినట్టు తమ దర్యాప్తులో తేలిందన్నారు. నిందితులు వాడిన వెహికల్ సీజ్ చేశామని... ఒక పిస్టల్, మూడు సెల్ ఫోన్స్ సీజ్ చేశామని తెలిపారు. ప్రస్తుతం ప్రశాంత్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. ఈ ఏడాది రాచకొండ కమిషనరేట్ పరిధిలో 5110 పశువుల్ని ఇప్పటి వరకు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సంవత్సరం పశువుల అక్రమ రవాణాకు సంబంధించి ఇప్పటి వరకు 288 కేసులు నమోదు చేసినట్లు రాచకొండ సీపీ సుధీర్ బాబు పేర్కొన్నారు.

## ప్రజలు కోరుకుంటే రాజకీయ పార్టీగా మారొచ్చు

తెలంగాణ జాగృతి తన గళాన్ని వినిపించిందని అన్నారు. ప్రజల తరఫున పోరాడాలంటే రాజకీయ పార్టీ కానవసరం లేదన్న ఆమె.. కానీ ప్రజలు కోరుకుంటే మాత్రం తెలంగాణ జాగృతి రాజకీయ పార్టీగా మారవచ్చని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళలో అనేక ప్రాంతీయ పార్టీలు ఉన్నాయన్నారు. తెలంగాణ జాగృతి కూడా రాజకీయపార్టీగా మారడం కూడా పెద్ద విషయం కాదన్నారు. కానీ సమయం, సందర్భంగా వచ్చిన పుడు జాగృతి సంస్థ కూడా రాజకీయ పార్టీగా ఆవిర్భవించవచ్చని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల వల్ల ప్రజలకు మంచి జరగాలనేది తమ సంకల్పమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకోవడం కోసమే ఈ నెల 25న నిజామాబాద్ లో తెలంగాణ జాగృతి జనం బాట యాత్రను ప్రారంభించి నాలుగు నెలల పాటు నిర్విరామంగా కొనసాగించనున్నట్లు వెల్లడించారు. అందరి సలహాలు, సూచనలతో యాత్రను నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

## సీఎం అభ్యర్థిగా తేజస్వీయాదవ్

దీనిపై ఈ రోజు అంటే.. గురువారం సాయంత్రం మహాగఠ్‌బంధన్‌లోని పార్టీలన్నీ కలిసి ప్రకటిస్తాయని సమాచారం. 243 స్థానాలున్న బిహార్ అసెంబ్లీకి రెండు దశల్లో.. అంటే నవంబర్ 6, 11 తేదీల్లో ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో ఆర్జేడీ 143 మంది అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. ఇక కాంగ్రెస్ పార్టీ 61 స్థానాల్లో అభ్యర్థులను నిలిపింది. సీపీఐ 9, సీపీఐ (ఎం) 4 స్థానాల్లో అభ్యర్థులను రంగంలోకి దింపింది. మరో ఎనిమిది స్థానాల్లో మాత్రం ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్ష పార్టీలు.. ఎవరికి వారు తమ అభ్యర్థులను రంగంలోకి దింపాయి. అంటే మహాగఠ్‌బంధన్‌లోని పార్టీల అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ నెలకొందని దీనిని బట్ట అర్థమవుతుంది. అయితే ఈ కూటమిలో చీలక ఏర్పడిందంటూ ఇప్పటికే పుకార్లు షికారు చేస్తున్నాయి. ఈ ఎన్నికల ఫలితాలు నవంబర్ 14వ తేదీన వెలువడనున్నాయి. దీంతో ఏ పార్టీకి ఓటరు పట్టం కట్టాడనేది ఆ రోజు సుస్పష్టం కానుంది.

## మహాకూటమి పోస్టర్ నుంచి రాహుల్ ఫొటో అవుట్

పాట్నాలోని ఓ హోటల్‌లో ప్రెస్‌మీట్ ఏర్పాటు చేశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పోస్టర్లలో ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ ఫొటోను మాత్రమే ప్రముఖంగా ప్రదర్శించారు. మిగతా భాగస్వామ్య పార్టీల నేతల చిన్న ఫొటోలను పోస్టర్లలో ఏర్పాటు చేశారు. అయితే, అందులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ ఫొటో మాత్రం ఎక్కడా కనిపించలేదు. ఈ వ్యవహారం ప్రస్తుతం రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ఇందుకు సంబంధించిన పోస్టర్లు కూడా నెట్టింట వైరల్‌గా




మారాయి. దీనిపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. ఈ మేరకు విమర్శలకు ఎక్కుపెట్టింది. తేజస్వి యాదవ్, ఆయన మద్దతుదారులు.. రాహుల్ నాయకత్వాన్ని అవమానించారంటూ వ్యాఖ్యానించింది. తాజా పరిణామాలపై బీజేపీ నేత షెహజాద్ పూనవాలా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. 'నిన్నటి వరకూ రాహుల్ గాంధీయే కూటమి ముఖచిత్రంగా చెప్పుకున్నారు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి ఏ మాత్రం గౌరవం లేదని స్పష్టమవుతోంది. ఈ కూటమికి గందరగోళం, విభజన, పదవుల కోసం ఆశ తప్ప.. ఒక లక్ష్యం గానీ, దార్శనికత గానీ లేవు' అంటూ ఎద్దేవా చేశారు.

## వచ్చే మూడ్రోజుల్లో భారీ వర్షాలు

ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రాబోయే 12గంటల్లో ఉత్తర తమిళనాడు, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాలను ఆనుకొని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని వాతావరణశాఖ పేర్కొంది. ఆ తర్వాత 12గంటల్లో ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాల మీదుగా కదిలే అవకాశం ఉందని చెప్పింది. గురువారం ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నా గర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయని తెలిపింది. శుక్రవారం ఖమ్మం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని పే ర్కొంది. కొత్తగూడెం, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడే సూచనలున్నాయని తెలిపింది. శనివారం వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు.. భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నా రాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు కురిసే ఛాన్స్ ఉందని వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

## రేవంత్ పాలనలో దర్జాగా సెటిల్‌మెంట్లు

హైదరాబాద్ : సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో కేవలం సెటిల్‌మెంట్లు తప్ప ఏమీ నడవడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. ఒక మంత్రి ఇంటికి టాస్క్ ఫోర్స్ పోలీసులను ముఖ్యమంత్రి పంపడం, నిందితుని స్వయంగా మంత్రి తన కారులో తీసుకొని మాయమైపోవడం ఎప్పుడూ చూడలేదు. స్వయంగా ముఖ్యమంత్రి అనుచరుడు, ఆప్తుడు రోహిన్ రెడ్డి బెదిరించారని, తుపాకీ రేవంత్ రెడ్డే ఇచ్చిండని మంత్రి కుమార్తె చెప్పారన్నారు. ముఖ్యమంత్రే తుపాకీ ఇచ్చి పంపించాడని ఆరోపణ చేసినప్పుడు, సీఎం సిగ్గు లేకుండా మౌనంగా ఉన్నాడని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డికి సిగ్గు ఉంటే కనీసం ఈ అంశంపైన స్పందించాలని డిమాండ్‌చేశారు. రేవంత్ రెడ్డి వంటి బలహీన ముఖ్యమంత్రిని ప్రపంచంలో ఎప్పుడూ చూడలేదని, స్వయంగా నీపైన మంత్రి బిడ్డే ఆరోపణలు చేస్తే ఆ మంత్రినీ పక్కకు జరపలేవు. స్వయంగా నీ మంత్రులు మీపై ఆరోపణలు చేస్తున్నా కనీసం వారిని ముట్టుకోలేని బలహీన ముఖ్యమంత్రివి అని ధ్వజమెత్తారు. తన పరిపాలన పైన, మంత్రుల పైన ఎలాంటి పట్టు లేదని తేలిపోయిందన్నారు. దావూద్ ఇబ్రహీం లాంటి ముఖ్యమంత్రిని తరిమేసుకుంటేనే తెలంగాణకు పట్టిన శనిపోతుందన్నారు. కాంగ్రెస్ అవినీతికి ప్రభుత్వ అధికారులు కూడా భయపడుతున్నారని అన్నారు. వీరి వాటాల పంచాయతీలో మాకు భాగస్వామ్యం వద్దు, మాకు సంబంధం లేదంటూ అధికారులు పారిపోతున్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను తప్పుడు పనులు చేయమని వేధించడం వల్లనే వారు వాలంటరీ తీసుకుంటున్నారని ఆరోపించారు. మంచి అధికారులు కూడా పారిపోయేలా చేసే దండుపాళ్యం ముఠా రాష్ట్రంలో ఉందని హెచ్చరించారు. తను చెప్పిన పని చేయలేదని చెప్పి సీనియర్ ఐఏఎస్ రిజ్వీ వీఆర్ఎస్ తీసుకుంటే కూడా, ఆయన రాజీనామా ఆమోదించవద్దని జూపల్లి కృష్ణారావు కోరారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అరాచకాలకు, అక్రమాలకు భాగస్వాములు అయితే, అధికారులు వత్తాసు పలికితే గతంలో మాదిరి జైలుకు వెళ్లవలసి వస్తుందని హెచ్చరించారు. గతంలో మాదిరి అధికారులకు శిక్ష కూడా పడుతుందని పేర్కొన్నారు. కాబట్టి జాగ్రత్తగా ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో అవినీతి విలయతాండవం చేస్తున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి వేల కోట్లు సంపాదిస్తుంటే, మేము వందల కోట్లయినా సంపాదించవద్దా అని మంత్రులు పోటీ పడుతున్నారన్నారు. గన్నులు పెట్టి బెదిరించడంతో ఇందిరమ్మ రాజ్యంలో వ్యాపారవేత్తలు తమ వ్యాపారాలు చేసుకోలేకపోతున్నారని తెలిపారు. పారిశ్రామికవేత్త నెత్తిన గన్ను పెట్టి బెదిరించారు అని పోలీసులు వెతుకుతున్న నిందితుడిని అరెస్టు చేయొద్దంటూ మంత్రిగారి కుమార్తె ఆపితే.. స్వయంగా మంత్రి తన కారులో తీసుకొని వెళ్ళిపోయినా ఇప్పటిదాకా ఎలాంటి చర్యలు ఎందుకు లేవని నిలదీశారు. రెండు మూడు రోజులపాటు తిట్టుకొని సిగ్గు లేకుండా ముఖ్యమంత్రి, మంత్రి ఇద్దరు కలిసి శాలువాలు కప్పుకుని స్వీట్లు పంచుకున్నారని మండిపడ్డారు. వాటాల పంచాయితీ, అవినీతి సొమ్ముల పంపకాలు, టెండర్ల రిగ్గింగ్ ఇవన్నీ కూడా కాంగ్రెస్ ఇంటి పంచాయతీ లెక్క మారిపోయాయన్నారు. రాష్ట్రంలో మాఫియా రాజ్యమేలుతుంటే, మంత్రులు, ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ఇంత రాచకం కొనసాగుతుంటే పోలీసులు ఏం చేస్తున్నారు?. పరిశ్రమల యజమానులకు తుపాకీలు పెట్టినప్పుడు, వాటాల పంచాయతీతోనే మంత్రులు బజారుకెక్కినప్పుడు, సీనియర్ అధికారులు పారిపోతుంటే.. రాష్ట్రంలోని పోలీసు యంత్రాంగం ఏం చేస్తున్నది? అని ప్రశ్నించారు. పోలీసులు మాత్రం గన్ ఇచ్చింది కొండా మురళి, బెదిరించింది కొండా సురేఖ, ఓఎస్‌డీ సుమంత్ అని చెప్తున్నారని, రెండు అంశాల్లో కూడా బెదిరింపులు గన్నుతో జరిగాయనేది వాస్తవం. కానీ ఇప్పటివరకు పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో రాష్ట్ర డీజీపీ ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. మా కార్యకర్తలను జైల్లో పెట్టిన పోలీసులు, కాంగ్రెస్ కార్యకర్తలకు ప్రయోజనం చేకూర్చేలా పనిచేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని కొంతమంది పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల కన్నా దారుణంగా పనిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. నిజంగా డీజీపీకి నిజాయితీగల పేరు ఉంటే గన్నుల బెదిరింపు వ్యవహారంలో చర్యలు తీసుకుని తన చిత్తశుద్ధి నిరూపించుకోవాలని డిమాండ్‌చేశారు. ఈ అంశంలో ఉత్తమ్ కుమార్ రెడ్డిని విచారణ చేసి ఆయన అభిప్రాయాన్ని రికార్డు చేయాలని కోరారు. సుమంత్‌ను విచారించి నిజానిజాలు బయటపెట్టాలన్నారు. ఈ మొత్తం గన్నుతో గురిపెట్టిన సంఘటనలో కచ్చితంగా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి సోదరుడు 15 ఎకరాలు, కొండా సురేఖ 15 ఎకరాలు తీసుకొని మొత్తం 30 ఎకరాల భూమి పంచాయితీ పెట్టుకున్నారు మంచిరేవులలో. ఈ భూమి మొత్తం నాకు కావాలంటే, నాకు కావాలి అని మంత్రి, రేవంత్ రెడ్డి, కొండా సురేఖ కొట్లాడుతున్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల సందర్భంగా మొత్తం బయటపెట్టుకొని తిరిగి రాష్ట్రానికి ఏం సందేశం ఇస్తుంది కాంగ్రెస్ పార్టీ?. గతంలోనే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కుక్కలు చింపిన విస్తరులా చేస్తారు అని. మంత్రులు కాంట్రాక్టులు, కమిషన్ల వ్యవహారాన్ని ఇంటి పంచాయితీగా మార్చారు. పొంగులేటి నా టెండర్లలో తలదూర్చారని మంత్రి కూతురు స్వయంగా చెప్పింది. బెదిరింపులు, టెండర్ల రిగ్గింగు ఇంత బహిరంగంగా దేశ చరిత్రలో ఏనాడు జరగలేదు. ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఫోన్ చేశాను అనే మంత్రి కూతురు చెప్పినప్పుడు, ఉత్తమ్ కుమార్ రెడ్డిని పిలిచి పోలీసులు విచారించరా?. ఉత్తమ్ కుమార్ రెడ్డి నియోజకవర్గంలోని దక్కన్ సిమెంట్ కంపెనీ యజమానిపైన గన్ను గురిపెట్టినప్పుడు కనీసం ఉత్తమ్ కుమార్ రెడ్డిని, రోహిన్ రెడ్డిని, సుమంత్‌ను ఎవర్ని కూడా పోలీసులు విచారించలేదు. ఇంత దారుణంగా బహిరంగంగా అవినీతి అంశంపైకి వచ్చినా, బెదిరింపులు బయటపడినా బీజేపీ నేతలు స్పందించడం లేదు. తెలంగాణలో బీజేపీ-కాంగ్రెస్ జాయింట్ వెంచర్ పరిపాలన నడుస్తున్నది. బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు, అమిత్ షా వంటి వాళ్ళు ఎవరు కూడా మాట్లాడడం లేదు. కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు కూడా మౌనంగా ఉన్నాయి. అందుకే తెలంగాణ రాష్ట్రాన్ని బీజేపీ ఏమాత్రం కాపాడలేదని మేము చెప్తున్నాం. కాంగ్రెస్ పరిపాలనలో పరిపాలన లేదు, ప్రజా పాలన లేదు. కేవలం అరాచకాలు, అవినీతి, బెదిరింపులు, కమీషన్లు, టెండర్ల రిగ్గింగ్ అన్నీ నడుస్తున్నాయి.

## తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం

కేబినెట్ ఆమోదం పొందిన నేపథ్యంలో ఆర్డినెన్స్ బిల్లు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దగ్గరకు వెళ్లనుంది. గవర్నర్ ఈ బిల్లును ఆమోదిస్తే వచ్చే గ్రామీణ స్థానిక ఎన్నికల్లో ఇద్దరికి మించి పిల్లలు ఉన్నవారు కూడా పోటీ చేసేందుకు వీలు కలుగుతుంది. కాగా, 1994లో అప్పటి ప్రభుత్వం కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించడానికి ఇద్దరు పిల్లల నిబంధనను అమల్లోకి తెచ్చింది. 1994 తర్వాత మూడో సంతానం కలిగిన వారు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా మారారు.1994లో అప్పటి ప్రభుత్వం కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించడంలో భాగంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధనను అమల్లోకి తెచ్చింది. ఈ చట్టం ప్రకారం 1994 తర్వాత మూడో సంతానం కలిగితే వారు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులు. ఏపీ నుంచి తెలంగాణ విడిపోయాక 2018లో తెలంగాణ పంచాయతీరాజ్ చట్టాన్ని రూపొందించిన కేసీఆర్ ప్రభుత్వం.. ఇద్దరు పిల్లల నిబంధనను టచ్ చేయలేదు. పంచాయతీరాజ్ చట్టం 2018 సెక్షన్ 21(3) ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలున్న వారు అనర్హులు. అయితే.. ప్రస్తుతం కుటుంబ నియంత్రణపై అవగాహన పెరిగినందున పాత నిబంధనను మార్చి ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉన్న వారికి సైతం పోటీ చేసే అవకాశం ఇవ్వాలని పలు రాజకీయ పార్టీలు కోరాయి. 2024 డిసెంబర్ 20న జరిగిన రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో ఈ ప్రతిపాదన రాగా మంత్రి వర్గం ఆమోదించలేదు. తాజాగా ఇవాళ జరిగిన కేబినెట్..పంచాయతీ ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధనను ఎత్తివేతకు ఆమోదం తెలిపింది.

## రీయింబర్స్‌మెంట్ బకాయిలపై బిజెపి పోరు

హైదరాబాద్,అక్టోబరు 23 : ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితోపాటు విజిలెన్స్ దాడుల పేరుతో బెదిరించడాన్ని తెలంగాణ భారతీయ జనతా పార్టీ తీవ్రంగా పరిగణిస్తోందని ఆ పార్టీ నేతలు వ్యాఖ్యానించారు. ఇప్పటికే ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చిన నేపథ్యంలో లక్షలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, సిబ్బందితో నవంబర్ తొలివారంలో 'చలో హైదరాబాద్' నిర్వహించేదుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పూర్తిగా చెల్లించేదాకా ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. గత రెండురోజులుగా ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావులను కలిసి మద్దతు కోరుతున్నాయని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని బండి సంజయ్ నివాసంలో పలువురు ఇంజనీరింగ్, బీఈడీ, ఇతర ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు సమావేశం అయ్యాయని తెలిపారు. కేంద్రమంత్రి బండి సంజయ్‌తోపాటు బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్, రాష్ట్ర నాయకులు గంగిడి మనోహర్ రెడ్డి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు తమ గోడును వెళ్లబోసుకున్నాయి. 'తెలంగాణలో సుమారు 2500 ప్రైవేట్ విద్యా సంస్థలు ఉన్నాయి. ఇంజనీరింగ్, మెడిసిన్, బీఈడీ, డిగ్రీతో సహా 15 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి ప్రైవేట్ కాలేజీల్లో చదువుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగేళ్లుగా బకాయిలు ఇవ్వడంలేదు. దాదాపు రూ.10 వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. కాలేజీల్లో చదువు చెప్పే అధ్యాపకులతోపాటు బోధనేతర సిబ్బందికి జీతభత్యాలు ఇవ్వలేకపోతున్నాం.

### అధికారులపై ఒత్తిడితోనే
## వీఆర్ఎస్‌లు

ఇదివరకు ఎప్పుడూ ఇలాంటి పరిస్థితులు లేవని పేర్కొన్నారు. సీనియర్ ఐఏఎస్ అధికారి సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీ వీఆర్ఎస్ తీసుకోవడం రాష్ట్ర ప్రభుత్వ వ్యవహార శైలిపై అనుమానాలకు తావిస్తోందని అన్నారు. రిజ్వీ ఎందుకు వీఆర్ఎస్ తీసుకోవాల్సి వచ్చిందో రాష్ట్ర ప్రభుత్వం జవాబు చెప్పాలని డాక్టర్ లక్ష్మణ్ ప్రశ్నించారు. 'మంత్రులు ఒత్తిడికి లొంగకపోతే వాళ్లని బలి చేస్తారా..?' అని ఆయన దుయ్యబట్టారు. 'మీ స్వార్థం కోసం అధికారులని వేధిస్తారా..?' అని లక్ష్మణ్ ఘాటుగా విమర్శించారు. ఇంకా విచారణ పేరుతో సీనియర్ ఐఏఎస్ అధికారిని వేధించడం తగదని ఆయన హితవు పలికారు. ఒకవేళ తప్పుచేసి ఉంటే ఇన్నిరోజులు ఎందుకు మాట్లాడలేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని, మంత్రులను ఆయన నిలదీశారు.

### భారీ వర్షాలపై
## సీఎం టెలికాన్ఫరెన్స్

లోతట్టు ప్రాంతాల్లోని వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. రిలీఫ్ కేంద్రాల్లో బాధితులకు నాణ్యమైన ఆహారం, పిల్లలకు పాలు అందించాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాలలో ఇప్పటికే కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్టు సీఎంకు కలెక్టర్లు వివరించారు. కాలువ, చెరువు గట్లకు గండ్లు పడకుండా బలహీనంగా ఉన్న చోట్ల పటిష్ట పరచాలని.. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా చూడాలని సీఎం ఆదేశించారు. పంట నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు.

### మాజీ రాష్ట్రపతి విగ్రహాన్ని
## ఆవిష్కరించిన రాష్ట్రపతి

మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, బీహార్ గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్, కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్, సీఎం విజయన్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విగ్రహావిష్కరణ తర్వాత ముర్మ మాట్లాడారు. కేఆర్ నారాయణన్ జీవితం ధైర్యం, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో నిండి ఉందన్నారు.

## గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా తెలంగాణ

మెల్‌బోర్న్‌లో ఆస్ట్రేలియా లైఫ్ సైన్సెస్ అత్యున్నత నిర్ణాయక సంస్థ 'ఆస్ బయోటెక్' నిర్వహించిన సదస్సులో శ్రీధర్‌బాబు కీలకోపన్యాసం చేశారు. తెలంగాణ లైఫ్ సైన్సెస్ సాధించిన పురోగతి, భవిష్యత్ ప్రణాళిక, పెట్టుబడులకు ఉన్న అనుకూలతలను వివరించారు.జీడీపీలో తెలంగాణ వాటా 5శాతం, గత ఆర్థిక సంవత్సరంలో జాతీయ సగటు కంటే రాష్ట్ర జీఎస్‌డీపీ ఎక్కువ. ఏడాదిన్నరలో రూ.3.2లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చాం. లైఫ్ సైన్సెస్ రంగాన్ని రాబోయే ఐదేళ్లలో 250 మిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యం. దీనికి సంబంధించి త్వరలో నూతన పాలసీ తీసుకు రాబోతున్నాం. గ్లోబల్ లైఫ్ సైన్సెస్ అట్లాస్‌లో భారత్ నుంచి హైదరాబాద్‌కు మాత్రమే స్థానం దక్కింది. బయో డిజిటల్ యుగానికి కావాల్సిన అత్యుత్తమ వనరులు అందించేలా యువతను తీర్చిదిద్దుతున్నాం" అని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.

## మత్స్యకారులను క్షేమంగా తీసుకువస్తాం

జిల్లాకు చెందిన మత్స్యకారులను క్షేమంగా తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే విదేశాంగ శాఖ మంత్రితో సంప్రదింపులు జరిపామని పేర్కొన్నారు. బంగ్లాదేశ్ ఎంబసీతో నిరంతర సంప్రదింపులు, నిశిత పరిశీలన చేస్తున్నామని తెలిపారు. సముద్ర భద్రత, చట్టం, రక్షణ వ్యవహారాలు చూసే కోస్ట్ గార్డ్ వ్యవస్థతో ఈ సమస్యపై మాట్లాడామని రామ్మోహన్ నాయుడు లేఖలో వివరించారు. బంగ్లాదేశ్ కోస్టు గార్డుల చెరలో విజయనగరం జిల్లాకు చెందిన 8 మంది మత్స్యకారులు చిక్కుకున్నారు. పూసపాటిరేగ మండలం తిప్పలవలస, భోగాపురం మండలంలోని కొండ్రాజుపాలెం గ్రామాలకు చెందిన వీరు బ్రతుకుదెరువు కోసం వైజాగ్ కు వలస వెళ్లారు. సముద్రంలో చేపల వేట కొనసాగిస్తూ అక్కడే జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 13న విశాఖ చేపలరేవు నుంచి మరబోటుపై సముద్రంలోకి వేటకు వెళ్లారు. ఈ నెల 14న అర్ధరాత్రి 2 గంటల సమయంలో వారు దారితప్పి బంగ్లాదేశ్ కోస్టు గార్డ్ పరిధిలోకి ప్రవేశించారు.



# హైదరాబాద్‌లో భారీగా గంజాయి పట్టివేత



హైదరాబాద్,అక్టోబర్23 : నగరంలోని బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో భారీగా గంజాయి పట్టుబడింది. గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.2.7 కోట్ల విలువైన 908 కిలోల డ్రై గంజాయిని స్వాధీనం చేశారు. ఈ వ్యవహారంపై సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్య కుమార్ మీడియాతో మాట్లాడుతూ వివరాలను వెల్లడించారు. గంజాయి సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను అరెస్టు చేశామన్నారు. బండ్లగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్న నిందితుల్ని అరెస్టు చేశామని.. సుమారు 908 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామని.. బహిరంగ మార్కెట్లో దీని ధర రెండు కోట్ల 70 లక్షల రూపాయలు ఉంటుందని తెలిపారు. ఒడిశాలోని మల్కన్‌గిరి ప్రాంతం నుంచి హైదరాబాద్ మీదుగా మహారాష్ట్ర నాసిక్ వైపు రవాణా చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఏ1 మొహమ్మద్ కలీం ఉద్దీన్ డ్రైవర్ / గంజాయి ట్రాన్స్‌పోర్టర్, ఏ2 షేక్ సోహైల్, ఏ3 మొహమ్మద్ అఫ్జల్ ఏ అబ్బులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన రహమాన్, ఒడిస్సాకు చెందిన జిథు , శ్రీకాకుళానికి చెందిన సురేష్, మహారాష్ట్రకు చెందిన మహేష్ ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు చెప్పారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు కొనసాగుతోందన్నారు. మహారాష్ట్రకు చెందిన మహేష్ గంజాయిని కొనుగోలు చేస్తున్నాడని తెలిపారు. ఒడిశా రాష్ట్రంలోని మల్కనగిరిలో మారుమూల అటవీ ప్రాంతంలో సురేష్ , జిథు గంజాయిని కొనుగోలు చేసి మహారాష్ట్రలో వివిధ ప్రాంతాలకు సరఫరా చేయడానికి ప్లాన్ చేశారని.. గంజాయి సరఫరాలో రెహమాన్ ప్రధాన రవాణాదారుడుగా వ్యవహరిస్తున్నాడని చెప్పారు. రిసీవర్ మహేష్ ఒడిశాలోని జిథు, సురేష్ వద్ద గంజాయి సేకరించారన్నారు. ఐషర్ డీసీఎం ట్రాన్స్‌పోర్ట్ వాహనం, నాలుగు మొబైల్ ఫోన్లను సీజ్ చేశామని చెప్పారు. గంజాయిని (28) హెచ్‌డీపీఈ సంచుల్లో నింపి, వాటిని జీడిపప్పు కింద దాచిపెట్టి టార్పాలిన్‌తో కప్పి రవాణా చేస్తున్నారని వివరించారు. హైదరాబాద్ మీదుగా నాసిక్, మహారాష్ట్ర వైపు రవాణా చేస్తున్నారన్నారు. పక్కా సమాచారంతో బండ్లగూడ వద్ద సోదాలు చేయగా గంజాయి పట్టుబడిందన్నారు. ప్రధాన నిందితుడు సురేష్ ఒక్క ట్రిప్‌కు రూ. 3 నుంచి 5 లక్షల పారితోషికం ఇస్తానని రెహమాన్‌కు ఆఫర్ చేశాడని.. అందుకే గంజాయి సరఫరాకి దాంతో రెహమాన్ అంగీకరించాడన్నారు. నిందితులంతా చిన్ననాటి స్నేహితులుగా దర్యాప్తులో తేలిందని సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్య కుమార్ పేర్కొన్నారు.

# దీపావళి వారి వెలుగులు తీసేసింది

### వేడుకల్లో పేలుడు వల్ల 125మంది కంటికి గాయాలు

న్యూఢిల్లీ : జీవితాల్లో వెలుగులు నింపే దీపావళి పండుగ మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ నగరంలోని కొన్ని కుటుంబాల్లో చీకటిని నింపింది. నేటి రోజుల్లో దీపావళి రోజు బాణాసంచా కాల్చడం పతాక స్థాయికి చేరింది. కొత్త కొత్త బాణాసంచా వీధుల్లో అందుబాటులోకి రావడంతో పిల్లలతో సహా పెద్దలు కూడా వాటిని కొనుగోలు చేసి కాల్చుతున్నారు. తాజాగా బాణాసంచా కాలుస్తుండగా అనుకోని ఘటన జరిగింది. తుపాకీ ఆకారంలోనే ఉండే బాణాసంచాను పిల్లలు పేలుస్తుండగా.. అందులోని విషపు రసాయనాలు పిల్లల కంటిపై పడి తీవ్ర ప్రభావం చూపింది. గన్ కాల్చేటప్పుడు.. గొట్టంలో పెట్టి గురి చూసి కాల్చుతారు. అలాగే చిన్నపిల్లలు కూడా కాల్చుతుండగా రసాయనాలు పేలి కళ్లపై పడ్డాయి . కేవలం రూ. 150-200 ఖర్చుతో తయారయ్యే కాల్షియం కార్బైడ్ తుపాకీ, పిల్లల జీవితాల్లో అంధకారం సృష్టించింది. కళ్ళకు గాయాలు కావడంతో పిల్లలందరిని ఆసుపత్రులకు తరలించారు. అయితే కొందరు పెద్దలు కూడా ఈ తుపాకిని పేల్చి తమ ప్రాణాల మీదికి తెచ్చుకున్నారు. ఆసుపత్రులు తెలిపిన వివరాల ప్రకారం ఇప్పటివరకు 125 మందికి పైగా ఈ పేలుడు బారిన పడ్డారు. ఈ గ్యాస్ లైటర్, ప్లాస్టిక్ పైపు, సులభంగా దొరికే కాల్షియం కార్బైడ్‌తో ఈ బొమ్మ తుపాకిని తయారు చేస్తారు. పైపులో ఉన్న కార్బైడ్ నీటితో కలిసినప్పుడు ఆసిటైలిన్ వాయువు ఉత్పత్తి అవుతుంది. ఆ సమయంలో చిన్న చిమ్మటి చిమ్మరుతో భారీ పేలుడు సంభవిస్తుంది. పైపు పగిలిపోతే ప్లాస్టిక్ ముక్కలు కళ్లలోకి, ముఖంపైకి దూసుకెళ్లి తీవ్రమైన గాయాలు కలిగిస్తాయి. చాలా సార్లు పిల్లలు ఆసక్తిగా పైపులోకి చూడగానే పేలుడు జరిగి కళ్లకు, ముఖానికి, కార్నియాకు గాయాలయ్యాయి. భోపాల్ ఆసుపత్రుల నివేదికల ప్రకారం, వందకు పైగా బాధితుల్లో 20-30 శాతం మందికి తీవ్రమైన డ్యామేజ్ అయిందని పేర్కొంది. కొందరికి వెంటనే శస్త్రచికిత్స చేయాల్సి వచ్చిందని.. కొంతమందికి కార్నియా ట్రాన్స్‌ప్లాంట్ చేయాల్సి వచ్చిందని వైద్యులు తెలిపారు.

# రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను చేయాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని

హైదరాబాద్ : పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలను విడుదల చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ్ రాశారు. రాష్ట్రంలో మార్చి 2024 నుండి పదవీ విరమణ పొంది ఇప్పిటికీ 18 నెలలు గడిస్తున్నాయని, నాటి నుండి నేటి వరకు పదవీ విరమణ పొందిన వారు సుమారు 12 వేల మంది ఉన్నారని, వారికి ఇప్పటి వరకు ఎటువంటి పదవీ విరమణ బకాయిలు అందలేదని ఆయన సిఎంకు రాసిన లేఖలో పేర్కొన్నారు. దీని వల్ల ఆయా కుటుంబాల ఆర్థిక పరిస్థితి చాలా దయనీయంగా ఉందని, వారు కుటుంబ బాధ్యతలు తీర్చలేని పరిస్థితిలోకి నెట్టబడ్డారన్నారు. బకాయిలు విడుదల చేయకపోవడంతో మానసిక ఆందోళనలు తట్టుకోలేక రాష్ట్రంలో కొన్ని మరణాలు కూడా సంభవించాయని తెలిపారు. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన మండల పంచాయితి అధికారి, పి. సీతారామ రాజు అశ్వరావుపేటలో పదవీ విరమణ పొంది మానసిక వేదనతో గత నెలలో మరణించారని, రాష్ట్ర వ్యాపితంగా చాలా మంది తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, వృద్ధాప్యంలో వారికి రావాల్సిన బకాయిల కోసం ఎదురుచూస్తున్నారని తన లేఖలో పేర్కొన్నారు. కావున పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు వెంటనే విడుదల చేసి ఆదుకోవాలని కూనంనేని సిఎంకు విజ్ఞప్తి చేశారు.

# పెంటగాన్‌పై కలాల ధిక్కారం

ఇక్కడ కాదు లెండి, అమెరికాలో. అమెరికా రక్షణ కార్యాలయ కేంద్రం పెంటగాన్‌లో ఇది సంభవించింది. స్వేచ్ఛకు ప్రతీకగా పేరొందిన అమెరికాలో ఇలాంటి బహిష్కరణలు జరగడంలో వింత ఏమీ లేదు. జర్నలిజం వృత్తి ఆ నేలపై అత్యంత గొప్ప వృత్తిగా పేరొందింది. జర్నలిజం అంతా వ్యాపారంగా మారిపోయిన తరువాత కూడా ప్రపంచంపై అమెరికా పెత్తనానికి గుండెకాయ లాంటి పెంటగాన్ విలేకరుల సమావేశం బహిష్కరించడం సాధారణ పరిణామం కాదు. ఈ కారణంగా బహిష్కరణ అనేది అంతర్జాతీయంగా అత్యంత కీలకమైన పరిణామం అనే చెప్పాలి. అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో కంటే అమెరికాలో జర్నలిజం స్వతంత్రంగానే కొనసాగుతున్నది. కార్పొరేట్ యాజమాన్యాల గుప్పిట్లో మీడియా చిక్కుకొని సంపూర్ణ వ్యాపారంగా మారిపోయినా అమెరికాలో జర్నలిస్టులు తమ వృత్తి పట్ల ఇంకా నిబద్ధతతోనే పని చేయగలుగుతున్నారని ఈ పరిణామం చెబుతున్నది. అయితే ఇదేమీ సాధారణ బహిష్కరణ కాదు.ఒక పత్రికా సమావేశానికి మాత్రమే పరిమితమైనది కూడా కాదు. %ూశ్రీంశీ =ఝుం% - ఏటా దీపావళి వస్తే ఇంతేనా! %ూంజవతీఅంవఎవత్% అమెరికా రక్షణశాఖ పెంటగాన్ కార్యాలయంనుంచి నిత్యం పనిచేసే జర్నలిస్టులపై విధించిన ఆంక్షల ఫలితం ఇది. తాము చెప్పిన విషయాలను మాత్రమే రాయాలని, ఇతర విషయాలను రాయడానికి, ప్రసారం చేయడానికి ఎంతమాత్రం వీలు లేదని ప్రకటించింది అమెరికా రక్షణశాఖ పెంటగాన్. జర్నలిస్టులు స్వతంత్రించి పెంటగాన్ కార్యాలయంలో ఏ అధికారినైనా కలవడానికి వీలు లేదని, అందుకు గాను తమ అనుమతి తప్పనిసరి అని పేర్కొంటూ ట్రంప్ నేతృత్వంలోని రక్షణశాఖ జర్నలిస్టులపై చాంతాడంత పొడవైన పెద్ద ఆంక్షల జాబితానే ప్రకటించింది. అంతేకాదు, తాము విధించిన ఆంక్షలను అంగీకరిస్తూ ఒక పత్రం (అఫిడవిట్) పై జర్నలిస్టులు అందరూ సంతకాలుచేసి తీరాలని పెంటగాన్ కార్యాలయం బీట్ జర్నలిస్టులను ఆదేశించింది. పెంటగాన్ జర్నలిస్టులు దీనిని వ్యతిరేకించారు. అభ్యంతరం తెలిపారు. పెంటగాన్ యంత్రాంగం దీనినేమీ పట్టించుకోలేదు. సంతకాలుచేసిన తరువాతనే విలేకరుల సమావేశానికి అనుమతిస్తామని ప్రకటించింది. దీంతో ఆ బీట్ జర్నలిస్టులు అందరూ మూకుమ్మడిగా అమెరికా రక్షణ మంత్రి సమావేశాన్ని బహిష్కరించారు. పెంటగాన్ కార్యాలయంలో వార్తల కవరేజీకోసం తమకు జారీ చేసిన అక్రిడిటేషన్ కార్డులను జర్నలిస్టులు అందరూ మూకుమ్మడిగా ఆ యంత్రాంగానికి అప్పగించి వేశారు. %ూశ్రీంశీ =ఝుం% - 'జనరల్ జెడ్' నిరసనలు వార్తల కవరేజి కోసం అక్కడ తాము స్థిరంగా ఏర్పాటు చేసుకున్న కంప్యూటర్ లాంటి ఎలక్ట్రానిక్ వస్తు పరికరాలు అన్నిటిని సమావేశ బహిష్కరణ సందర్భంగా కార్యాలయం నుంచి తీసుకొని వెళ్లిపోయారు. ఇకపై తాము పెంటగాన్‌కు రాబోవడం లేదని సంకేతాత్మకంగా, స్పష్టంగా నిరసన తెలిపారు అమెరికా జర్నలిస్టులు. కానీ పెంటగాన్ సమాచారాన్ని వార్తలు నివేదించే తమ వృత్తిగత కర్తవ్యాన్ని నిలిపివేయబోమని, దానికి అవసరమైన సమాచారాన్ని తాము స్వతంత్రంగా తమ స్వంత పద్ధతుల్లో సేకరిస్తామని వాళ్లు ప్రకటించారు. గత మంగళవారం నాడు ఈ పరిణామం సంభవించింది. సుమారు 250 యేళ్లక్రితం అమెరికా బ్రిటిష్ పరిపాలననుంచి స్వతంత్ర దేశం గా అవతరించింది. నాటి నుంచి నేటి వరకు అమెరికా సమాజానికి వార్తలు సమాచారాన్ని అందించడంలో ఏనాడూ రాజీపడలేదు. సర్కారుకు లొంగి పోలేదు. అమెరికా సమాజ ప్రయోజనాల పరిరక్షణకు విశేష స్థాయిలో కృషిచేసింది. ఒక్క అమెరికా మాత్రమే కాదు యూరప్‌లోని చాలా దేశాల్లో కూడా ఇండియాతో పోల్చితే జర్నలిజం స్వతంత్రంగానే పని చేస్తున్నది. అలాంటిది ఇండియాలో సంభవించి ఉంటే నిజంగా చాలా పెద్ద ఆశ్చర్యమే. %ూశ్రీంశీ =ఝుం% - జోడేఘాట్ సాయుధ యోధుడు %ూంజవతీఅంవఎవత్% కానీ ఈ నేలపై అలాంటివి సంభవించే అవకాశాలు దాదాపుగా కనుమరుగైపోయాయి. ఇండియా కూడా 75 యేళ్లక్రితం బ్రిటిష్ వలసపాలన నుంచే స్వాతంత్ర్యం పొందింది. వలస పాలనలో భారత జాతి ప్రయోజనాల కోసం భారతీయ జర్నలిజం పోషించిన పాత్ర అత్యంత ఘనమైనదే. వృత్తి నిబద్ధతలో అమెరికా, ఇండియా జర్నలిస్టుల శీలం శంకించేదేమీ కాదు. దేశంలో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించేవరకు చాలా భారతీయ పత్రికలు, జర్నలిస్టులు చాలా వరకు స్వతంత్రంగానే పని చేశాయని చెప్పాలి. ఇందిర నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడి జాతిని జాగృతంచేశాయి. పత్రికా స్వతంత్ర రక్షణకోసం నాడు హిందూ, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికలు పోషించిన పాత్ర జర్నలిజం చరిత్రలో గర్వించదగినది. అలా పత్రికలు, జర్నలిస్టులు తమ వృత్తి నిబద్ధతను గట్టిగా చాటుకొని అసలైన పత్రికా స్వేచ్ఛను నాడు నిలబెట్టుకున్నాయి. కానీ నేడు ఆ స్థితి లేదు. స్వతంత్ర ఉద్యమం, ఎమర్జెన్సీ వరకు ఒక లెక్క, ఎమర్జెన్సీ తదనంతరం జర్నలిజంలో భారతీయ జర్నలిజంలో వ్యాపార పోకడలు ప్రవేశించాయి. అయినా కూడా జర్నలిస్టులు స్వతంత్రంగానే వ్యవహరించి పౌరుల భావస్వేచ్ఛను కాపాడే కృషిని విశేష స్థాయిలో నిర్వహించారు. నాటివరకు వాస్తవాలను సమాజానికి అందిస్తూ సాగిన కలం సాగు జర్నలిజం పూర్తిగా వ్యాపారుల చేతుల్లోకి వెళ్లడం మొదలైంది. %ూశ్రీంశీ =ఝుం% - పాలమూరులో కోరలు చాస్తున్న గంజాయి 90లలో దేశంలో ఆర్థిక సరళీకరణ మొదలవడంతో దేశంలోని మీడియాలోకి అంతర్జాతీయ వ్యాపారుల పెట్టుబడుల ప్రవేశం పెరిగిపోయింది. మీడియాలోకి విదేశీ పెట్టుబడులను అనుమతించే నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకోవడంతో మొత్తం భారతీయ జర్నలిజం తీరుతెన్ను సంపూర్ణంగా వ్యతిరేక దిశ మళ్లింది. క్రమంగా పత్రికలు, టెలివిజన్ రంగంలోకి విదేశీ పెట్టుబడుల వాటా పెరిగిపోయింది. దీంతో పత్రికల ఎడిటోరియల్ విధానం పూర్తిగా భిన్నరూపం సంతరించుకుంది. దీంతో యథాతథంగా వార్తలు, సమాచారం అందించడంలో మీడియా ఎడిటోరియల్ విధానం జోక్యం పెరిగింది.ఫలితంగా జర్నలిస్టు కలం స్వేచ్ఛకు పరిమితులు, ఆంక్షలు మొదలయ్యాయి. విదేశీ పెట్టుబడులు ప్రవేశించకముందు అనేకమంది జర్నలిస్టులే పత్రికలను సామాజిక సేవ లక్ష్యంతో నిర్వహించేవారు. భారతీయ కార్పొరేట్లు, విదేశీ పెట్టుబడుల ప్రవేశంతో పత్రికలను జర్నలిస్టులు నడిపించగల పరిస్థితులు దాదాపుగా అంతరించిపోయాయి. అలాంటి ఒకటీ, అర పత్రికలు అక్కడక్కడా ఉన్నప్పటికీ జర్నలిజం వ్యాపారుల ఆర్థిక శక్తియుక్తుల ముందు అవి మనుగడ సాగించగల స్థితి లేదిప్పుడు. ఇంటర్నెట్ అందుబాటులోకి రావడం అది సామాన్యులకు కూడా చవకగా లభిస్తూ ఉండడంతో మాస్, సోషల్ మీడియా విస్తృతి విపరీతంగా వ్యాపించింది. ప్రపంచంలోని ఏ మూలన జరిగిన పరిణామమైనా క్షణాల్లో అందరికీ తెలిసే వెసులుబాటు కలిగింది. దీంతో సోషల్ విస్తృతి విపరీతంగా పెరిగిపోయింది. ఫలితంగా సమాచారంకోసం మీడియాపై ఆధారపడడం తగ్గిపోయింది. ఫలితంగా మీడియా ప్రభావం, ప్రాధాన్యత సమాజంపై కొంత తగ్గింది. పదేళ్లుగా దేశంలో మీడియా స్వేచ్ఛ బలహీనపడడం మొదలైంది. జర్నలిస్టుల వృత్తి నిర్వహణకు అనేక రకాల ఒత్తిళ్లు మొదలయ్యాయి. ఫలితంగా భారతీయ జర్నలిజం విశ్వసనీయత క్షీణ దశ మొదలైంది. ఈ క్రమంలో పత్రికాస్వేచ్ఛ, పౌరుల భావస్వేచ్ఛ ప్రమాదంలో పడిపోయాయి. ఈ ఒత్తిళ్లు ఇలాగే కొనసాగితే భావస్వేచ్ఛ అనేది ఈ నేలపై ఒక చరిత్రగా మాత్రమే మిగిలి పోయే ప్రమాదం కనిపిస్తున్నది. ఇక్కడ పత్రికలు, వార్తా చానెళ్లు, డిజిటల్ మీడియా సంస్థలు, వార్తా సంస్థలకు కొదవ ఏమీ లేదు. రాశిలో వాటి సంఖ్య ఘనమైనదే. కానీ వాస్తవాలను వెలుగులోకి తేవడంలో జర్నలిస్టులకు అడుగడుగునా అనేక ఇబ్బందులు, ఒత్తిళ్లున్నాయి, భయాలున్నాయి. ఇటీవలి కాలంలో వృత్తి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన జర్నలిస్టులు జాబితాకూడా పెద్దదే. ఈ సంఖ్య జర్నలిజం ఎదుర్కొంటున్న ప్రమాద పరిస్థితులకు ఒక నిదర్శనంగా చూడాలి. ఇలాంటి అనేక సవాళ్ల మధ్య కూడా భారతీయ జర్నలిస్టులు కత్తిమీద సాములాగా తమ వృత్తిని కొనసాగిస్తున్నారు.

# అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆంధ్రప్రదేశ్

### పూర్వోదయ పథకం ద్వారా తీరప్రాంతంలో మరింత అభివృద్ధి

### నీతి ఆయోగ్ సిఇఓ బివిఆర్ సుబ్రహ్మణ్యం

అమరావతి,23అక్టోబరు : దేశ తూర్పు తీరంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ముందుందని పూర్వోదయ పథకం ద్వారా తీరప్రాంతంలో మరింత అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయని నీతి ఆయోగ్ సిఇఓ బివిఆర్ సుబ్రహ్మణ్యం తెలిపారు.పూర్వోదయ పథకం మరియు విశాఖపట్నం గ్రోత్ హబ్ పై గురువారం ఏపి సచివాలయంలో నీతి ఆయోగ్ సిఇఓ బివిఆర్ సుబ్రహ్మణ్యం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తో సమావేశమై చర్చించారు.ఈసందర్భంగా నీతి ఆయోగ్ సిఇఓ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ లో పలు ఓడరేవులు ఉన్నప్పటికీ ప్రత్యేకంగా ఒక కంటైనర్ మెగాపోర్టు ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆదిశగా తగిన ప్రయత్నాలు చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వానికి సూచించారు.అదే విధంగా రానున్న చీఫ్ సెక్రటరీల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి తీసుకుంటున్న వినూత్న పథకాలపై ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చేందుకు వీలుగా తగిన నివేదికను సిద్ధం చేసుకోవాలని సిఎస్ విజయానంద్ కు ఆయన సూచించారు.అనంతరం విశాఖపట్నం,అమరావతి,తిరుపతి గ్రోత్ కారిడార్ల ఏర్పాటు తద్వారా జరిగే అభివృద్ధి ప్రయోజనాలపై ఆయన చర్చించారు. అనంతరం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మాట్లాడుతూ విశాఖపట్నం గ్రోత్ హబ్ పనులు వేగవంతం చేసేందుకు ప్రత్యేకంగా ఒక అధికారిని ఇన్చార్జిగా నియమించడం జరుగుతుందని చెప్పారు.రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టులను వేగవతంగా ముందుకు తీసుకువెళ్ళడం తోపాటు అనేక నూతన ప్రాజెక్టులు,పరిశ్రమలు ఏర్పాటు అయ్యేలా ప్రభుత్వం పెద్దఎత్తున ప్రయత్నాలు చేస్తోందని వివరించారు.కేంద్రం నుండి వివిధ ప్రాజెక్టులు,పథకాలకు సకాలంలో తగిన నిధులు మంజూరు అయ్యేలా కృషి చేయడం జరుగుతోందని కేంద్రం నుండి తగిన నిధులు మంజూరు అయ్యేలా నీతి ఆయోగ్ సిఫార్సు చేయాలని సిఎస్ విజయానంద్ నీతి ఆయోగ్ సిఇఓ సుబ్రహ్మణ్యంకు విజ్ఞప్తి చేశారు. కాగా పూర్వోదయ అనేది దేశ తూర్పుతీరంలోని ఆంధ్రప్రదేశ్,ఒడిస్సా,పశ్చిమ బెంగాల్, ఝార్ఖండ్,బీహార్ ఐదు రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఒక వినూత్న పథకం.ఇది సాంస్కృతిక వారసత్వం మరియు సహజ వనరులను ఉపయోగించుకోవడం,కొత్త మౌలిక సదుపాయాలను సృష్టించడం,ఉపాధిని సృష్టించడం మరియు స్థిరమైన ఆర్థికవృద్ధిని ప్రోత్సహించడం ద్వారా తూర్పు భారతదేశాన్ని జాతీయ పురోగతికి కీలకమైన చోదకంగా మార్చాలనే లక్ష్యంతో పూర్వోదయ పథకాన్ని చేపట్టడం జరిగింది.దీనిద్వారా ెఎద్దఎత్తున రహదారులు వంతెనలు,విమానాశ్రయాలు,విద్యుత్ ప్లాంట్లు వంటి ముఖ్యమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టడం జరుగుతుంది.ఈ ప్రాజెక్టులు ప్రాంతీయ కనెక్టివిటీని మెరుగుపరచడానికి,పారిశ్రామికాభివృద్ధికి మరింత దోహద చేస్తాయి.అంతేగాక పూర్వోదయ విద్యా మరియు నైపుణ్య-అభివృద్ధి సంస్థలను బలోపేతం చేయడానికి ప్రాధాన్యత ఇస్తుంది.అర్హత కలిగిన శ్రామిక శక్తిని సిద్ధం చేయడానికి ఐఐటి ఇతర నైపుణ్య-శిక్షణా కేంద్రాల్లో సామర్థ్య విస్తరణ కూడా దోహదపడుతుంది. పూర్వోదయ పథకం వ్యవసాయం మరియు అనుబంధ రంగాల్లో మెరుగైన మౌలికసదుపాయాలు,ఉద్యోగ అవకాశాలు,నైపుణ్యాభివృద్ధిని పెంపొందిస్తుంది.అంతేగాక పారిశ్రామిక కారిడార్ల ఏర్పాటుకు మద్దతు ఇవ్వడం తోపాటు పెట్టుబడులను ప్రోత్సహిస్తూ వ్యవసాయం, మత్స్య సంపద వంటి రంగాల్లో విలువ జోడింపును ప్రోత్సహిస్తుంది.సమతుల్య ప్రాంతీయ అభివృద్ధి సమ్మిళిత వృద్ధిని ప్రోత్సహిస్తుంది మరియు భారతదేశం అంతటా ఆర్థిక అసమానతలను తగ్గిస్తుంది.మెరుగైన కనెక్టివిటీ మరియు పారిశ్రామిక సామర్థ్యం తూర్పు రాష్ట్రాలను ఎగుమతులు మరియు స్థిరమైన ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రాలుగా ఉంచుతాయి. అదే విధంగా తూర్పు భారతదేశంలో స్థిరమైన అభివృద్ధి వైపు పూర్వోదయ ఒక ముఖ్యమైన ముందడుగా చెప్పవచ్చును.సమానమైన వృద్ధిని సృష్టించడం మరియు తూర్పు భారత దేశాన్ని శక్తివంతమైన ఆర్థిక శక్తి కేంద్రంగా మార్చడంలో కీలకపాత్ర పోషిస్తుంది.మౌలిక సదుపాయాలు,విద్య మరియు ఆర్థిక సాధికారతలో కొనసాగుతున్న పెట్టుబడులతో 2047 నాటికి వికసిత్ భారత్ అనగా అభివృద్ధి చెందిన భారతదేశంగా మారే ప్రయాణంలో పూర్వోదయ పథకం తూర్పు తీర ప్రాంతంలో ఒక కీలక పాత్ర పోషించనుంది. ఈసమావేశంలో నీతి ఆయోగ్ అదనపు సిఇఓ పార్థసారధి రెడ్డి,రాష్ట్ర ఆర్థిక,ప్రణాళికల శాఖల ముఖ్య కార్యదర్శి పియూష్ కుమార్,విద్యాశాఖ కార్యదర్శి కె.శశిధర్,ఆర్థికశాఖ కార్యదర్శి వినయ్ చంద్,ప్రణాళికాశాఖ జెఎస్ అనంత శంకర్,నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండి జి.గణేశ్ కుమార్ పాల్గొన్నారు.

## ముంబైలో అగ్ని ప్రమాదం

న్యూఢిల్లీ, అక్టోబర్23 : దేశ ఆర్థిక రాజధాని ముంబైలోని ఓ వాణిజ్య భవనంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. జోగేశ్వరి వెస్ట్ ఏరియాలోగల జేఎంఎస్ బిజినెస్ సెంటర్‌లో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. దాంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. ఫైరింజన్‌ల సాయంతో మంటలను ఆర్పుతున్నారు. భవనం పై అంతస్తులో పలువురు చిక్కుకున్నారు. వారిని కిందకు దించేందుకు రెస్క్యూ టీమ్స్ ప్రయత్నిస్తున్నాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికిగల కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

## గోసంరక్షకుడు సోనూ సింగ్‌పై కాల్పులు బాధాకరం

హైదరాబాద్,అక్టోబర్23 : గోసంరక్షణ చేస్తున్న సోనూ సింగ్ అలియాస్ ప్రశాంత్ సింగ్‌పై కాల్పులు జరగడం బాధాకరమని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. పోచారం కాల్పుల ఘటనలో గాయపడిన ఆయన్ను బండి సంజయ్ పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఓట్లు, డబ్బుల కోసమో ప్రశాంత్ సింగ్ ఇలా చేశారని చెప్పడం సరికాదని పేర్కొన్నారు. చేసిన వ్యాఖ్యలను పోలీసులు, సీఎం వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలోనూ గోవులు, గో రక్షకులకు రక్షణ లేదని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తీరు కూడా గోరక్షకుల పట్ల సరిగా లేదని చెప్పారు. ఈ ప్రభుత్వంలో మంత్రులే కొట్లాడుకుంటున్న పరిస్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు. సర్కార్ నిలబడుతుందా.. కుప్పకూలుతుందా తెలియని పరిస్థితి నెలకొందని చెప్పారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు.

## కెటిఆర్ పెడబొబ్బలు పెట్టి ఏం లాభం

### పిచ్చి పిచ్చిగా వాగినంత మాత్రాన మొగోడివి కాదు

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

హైదరాబాద్,అక్టోబర్23 : సిరిసిల్ల ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. హైదరాబాదులో మీడియాతో మాట్లాడిన ఆది శ్రీనివాస్ 'కేటీఆర్.. నువ్వెన్ని పెడబొబ్బలు పెట్టినా ఏం ఉపయోగం లేదు. మా ముఖ్యమంత్రి పైన పిచ్చి పిచ్చిగా వాగినంత మాత్రాన నువ్వు పెద్ద మొగోడివి కావు' అని ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్నంత కాలం కేటీఆర్, కేసీఆర్ ఇద్దరు కలిసి తెలంగాణను దోచుకున్నారని ఆరోపించారు. 'మీ బతుకు, నీ అయ్య బతుకు ఏమిటో తెలంగాణ ప్రజలు తేల్చేశారు. అధికారంలో ఉన్న రోజుల్లో సువర్ణపురం దొంగల్లా పాలన చేశారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ ప్రగతిభవన్ గడీ కట్టుకున్నారు. మీ పాలనలో మంత్రులు, ఎమ్మెల్యేలు కరివేపాకులా వాడి పారేశారు. మా ముఖ్యమంత్రి అందరినీ గౌరవంగా చూస్తారు. మీలా గేటు దగ్గర అవమానించి పంపించడం లేదు. వేదికలపై మంత్రులను ఈసడించుకోలేదు, ఈకముక్కలా తీసిపారేయలేదు. దళిత డిప్యూటీ సీఎంను కారణం చెప్పకుండా బర్తరఫ్ చేసిన చరిత్ర కూడా కేసీఆర్‌దే' అని ఆది శ్రీనివాస్ మండిపడ్డారు.'అవినీతి సొమ్ములో వాటా అడిగిన సొంత బిడ్డను పార్టీ నుంచి గెంటివేసింది మీ చరిత్ర. పదేళ్ల అధికారంలో నిజాయితీగల ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను పక్కన పెట్టి రిటైర్డ్ అధికారులతో రాజ్యం నడిపారు. తెలంగాణ పోలీసులు ఏం పీకుతున్నారంటూ వాగుతున్నారు. వెయిట్ చేయి.. అన్ని చూస్తున్నాం. సొంత ఇళ్లు చక్కబెట్టుకోలేని నువ్వు మా ముఖ్యమంత్రి గురించి మాట్లాడుతావా?. నీ చెల్లెలు అడిగిన ఒక్క ప్రశ్నకైనా ఇప్పటివరకు సమాధానం చెప్పావా?. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల నేపథ్యంలో కేటీఆర్ చేస్తున్న రాజకీయ ప్రదర్శనలను ఆపు. నువ్వెంత ఎగిరిపెడ్డా ఉపయోగం లేదు.. నీ మూతి పళ్లే రాలుతాయి చూసుకో' అంటూ కేటీఆర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## తెలంగాణ గ్రూప్-1 నియామకాల్లో అక్రమాలు

### సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి కవిత లేఖ

హైదరాబాద్, అక్టోబర్ 23: తెలంగాణ గ్రూప్-1 నియామకాల్లో అక్రమాలు జరిగాయని, వాటిపై విచారణ జరిపించాలని కోరుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత లేఖ రాశారు. ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించి చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రూపు-1 నియామకాల్లో రాష్ట్రపతి ఉత్తర్వులను ఉల్లంఘించారని పేర్కొన్నారు. ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌కు విరుద్ధంగా నియామకాలు చేపట్టినట్టు తనకు నిరుద్యోగులు ఫిర్యాదులు చేశారని పేర్కొన్నారు. నిరుద్యోగులు లేవనెత్తుతున్న అంశాలపై విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. గ్రూప్-1 పరీక్షల్లో ప్రిలిమ్స్‌కు ఒక హాల్ టికెట్ నంబర్, మెయిన్స్‌కి మరొక హాల్ టికెట్ నంబర్ ఇవ్వడం వల్ల విద్యార్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని లేఖలో రాసుకొచ్చారు. గ్రూపు-1 పేపర్ల మూల్యాంకనంలో తమకు అన్యాయం జరిగిందని తెలుగు మీడియం అభ్యర్థులు తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో ఇటీవలే గ్రూప్-1 ఉద్యోగాలకు ఎంపికైన 562 అభ్యర్థులకు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేసిన సంగతి తెలిసిందే.



# సంపాదకీయం

## డబుల్ ఇంజిన్‌తో పెరిగిన కాలుష్యం !

దీపావళితో దేశరాజధాని ఢిల్లీ కాలుష్యం మరోమారో చర్చకు వస్తుంది. నిజానికి కాలుష్యానికి మూలం కనుక్కుని పనిచేయాలన్న పట్టుదల ప్రభుత్వంలో లేదు. ఆప్ ఉన్నప్పుడు, ఇప్పుడు బిజెపి అధికారంలోకి వచ్చినా పరిస్థితి మారడం లేదు. డబుల్ ఇంజన్ సర్కార్ వచ్చినా ఢిల్లీ కాలుష్యంపై కదలిక లేదు. ఇంత కాలం ఆప్‌ను తిట్టి పోసిన బిజెపి ఏం చేయబోతున్నదో చెప్పడం లేదు. అసలు కాలుష్యం ఎక్కడి నుంచి ఎలా వస్తున్నదన్న దానిపై అధ్యయనాలు ఉన్నాయి. యమునా కాలుష్యం కూడా ఉంది. వరదలు వస్తే ఢిల్లీని ముంచెతుతున్నాయి. ఇవి మానవ తప్పిదాల వల్ల జరుగుతున్న అనర్థాలు. వీటిని కఠిన నిర్ణయాలతో అరికట్టవచ్చు. కానీ రాజకీయాల కారణంగా పనులు చేయడం లేదు. బిజెపి చిత్తశుద్ధిని చాటుకుని ఢిల్లీ ఔన్నత్యాన్ని నిలబెట్టాలి. ప్రధానంగా కాలుష్యం నిలువరించడంతో పాటు, యమునా కాలుష్యాన్ని కూడా నిలువరించాలి. అలాగే ట్రాఫిక్ సమస్య కూడా తీవ్రంగా మారింది. ఢిల్లీకి వలసలు పెరగడమే ఇందుకు కారణం. ఈ సమస్యలపై డబుల్ ఇంజన్ సర్కార్ గట్టిగా కృషిచేయకపోతే ప్రజలు ఇకముందు బిజెపిని నమ్మరు. పలుమార్లు సుప్రీంకోర్టు హెచ్చరికలు చేసినా పట్టించుకోవడం లేదు. ఇది దారుణం కాక మరోటి కాదు. పంజాబ్, హర్యానాల్లో పంటలను తగులబెట్టే ప్రక్రియను సత్వరం నిలుపుదల చేయాలి. దీపావళి పటాకుల మోత తరవాత దేశ రాజధాని నగరం ఢిల్లీలో వాయు కాలుష్యం అత్యంత ప్రమాదకర స్థాయికి చేరడం తీవ్ర ఆందోళనకరంగా ఉంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పండగపూట టపాసులు కాల్చనీయకుండా ఆప్ ప్రభుత్వం హిందువులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందంటూ ఆరోపించిన బిజెపి నేతలు, అధికారంలోకి వచ్చిన తరువాత కూడా అదే విధంగా వ్యవహరించారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత కూడా దీపావళిని దీపాలతో సరిపెడితే ఎలా అని బాహాటంగానే ప్రశ్నించారు. కేంద్రంతో పాటు, ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన ఈ వైఖరితో గ్రీన్‌క్రాకర్స్ అమ్మకాలకు సుప్రీంకోర్టు అనుమతిని ఇచ్చింది. గత ఏడాది ఆప్ ప్రభుత్వం దీపావళికి కొద్దిరోజుల ముందు అన్ని రకాల బాణాసంచా విక్రయాల పై నిషేధం విధించినా, ఆ నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరిగిదంటూ సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. వాతావరణాన్ని కలుషితం చేయమని ఏ మతమూ చెప్పదని, ప్రాథమిక హక్కు అయిన ఆరోగ్యాన్ని ఎటువంటి పరిస్థితుల్లోనూ ప్రభుత్వాలు కాపాడి తీరాలని అప్పట్లో స్పష్టం చేసిన అత్యున్నత న్యాయస్థానం తాజాగా దానినుండి వైదొలగడం గమనార్హం. సుప్రీంకోర్టు గ్రీన్ క్రాకర్స్‌కే అనుమతి ఇచ్చినప్పటికీ ఆ పేరుతో అన్ని రకాల బాణాసంచా ఢిల్లీ నగరంలోకి ప్రవేశించింది. నిజానికి, దీపావళికి ముందే ఈ ఏడాది దేశ రాజధానిలో వాయు కాలుష్యం తీవ్రంగా నమోదైంది. అయినా, అత్యున్నత న్యాయస్థానం ముందు జరిగిన విచారణలో ఢిల్లీలోని బిజెపి ప్రభుత్వంతో పాటు, కేంద్ర ప్రభుత్వం కూడా ఢిల్లీలో టపాసుల అమ్మకాల మీద నిషేధాన్ని ఎత్తివేయించేందుకు శక్తివంచన లేకుండా పాటుపడ్డాయి. కొన్ని పరిమిత గంటల్లోనే బాణాసంచా కాల్చడానికి అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన అనుమతి సైతం ఆచరణలో అమలు కాలేదు. ఇప్పుడు పరిస్థితులు చేయిదాటే ప్రమాదం కనపడుతుండటంతో సాక్షాత్తు ఢిల్లీ పర్యావరణ శాఖ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సాతో పాటు ప్రభుత్వంలోని మరికొందరు పంజాబ్ రైతులను గడ్డి తగలపెట్టేలా ఆప్ నేతలు ఒత్తిడి చేశారని, దాని ఫలితంగానే ఢిల్లీలో ఈ పరిస్థితి ఏర్పడిందని వ్యాఖ్యానించారు. ఇది పూర్తిగా బాధ్యతారహిత ప్రకటనగానే చూడాలి. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అత్యంత సున్నితమైన అంశాలను కూడా ఇలా వాడుకోవడం దారుణం. ఢిల్లీ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా శాశ్వత ప్రాతిపదికన సమగ్ర చర్యలు చేపట్టాలి. ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయాలి. కాలుష్య నియంత్రణ చట్టాలను కఠినంగా అమలు చేయాలి. లేని పక్షంలో దేశ రాజధాని ఢిల్లీ కాలుష్య రాజధానిగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. ఇకపోతే కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి విడుదల చేసిన నివేదిక ప్రకారం కాలుష్య కారక సూక్ష్మ కణాల స్థాయి పిఎం 2.5 గడిచిన ఐదేళ్ల కాలంలోనే అత్యధికంగా నమోదైంది. దీపావళి తరువాత 24 గంటల్లో సగటు పిఎం2.5 సాంద్రత ఒక క్యూబిక్ మీటర్‌కు 488 మైక్రో గ్రాములకు చేరింది. ఇది ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన భద్రతా పరిమితికి దాదాపు 60 రెట్లు అధికం కావడం గమనార్హం. దీంతో ఢిల్లీ నగరమంతా ఒక రకమైన భయానక వాతావరణం నెలకొంది. విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. అనేక ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు మూతపడగా అత్యవసర మైన పనులుంటేనే ఇళ్ల నుండి బయటకు రావాలని ఢిల్లీ ప్రభుత్వం ప్రకటించడంతో పరిస్థితి తీవ్రత ఎంతగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అనివార్య పరిస్థితుల్లో జాతీయ రాజధాని పరిధిలోని ఢిల్లీ నగరమంతా గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ నిబంధనలను అమలులోకి తీసుకువచ్చి సెంట్రల్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ రంగంలోకి దింపాల్సి వచ్చింది. అదే సమయంలో పెద్ద సంఖ్యలో ఢిల్లీ ప్రజానీకం శ్వాసకోస సమస్యలతో ఆసుపత్రుల ముందు బారులు తీరుతున్నారు. వీరిలో వృద్ధులు, పసిపిల్లలు ఎక్కువగా ఉన్నారంటూ వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. సిపిసిబి తాజాగా చేసిన విశ్లేషణ ప్రకారం దీపావళి తరువాత సగటు పిఎం2.5 స్థాయి ప్రతి ఏడాది పెరుగుతూనే ఉంది. అయితే, గత ఐదేళ్ళ కాలంలో ఈ స్థాయిలో పెరుగుదల లేదు. రాజకీయాలను పక్కన ప ఎట్టి సమస్యలను అధిగమించే ప్రయత్నాలు ఇప్పటికైనా చేయాలి. దేశ రాజధాని కాలుష్యం నుంచి బయటపడేలా చేయాలి. రాజకీయాలకు ఇక కాలం చెల్లిందని పాలకులు, ప్రతిపక్షాలు గుర్తించి ఉమ్మడిగా కాలుష్య నివారణకు పాటుపడాలి.

# చిత్తశుద్ధితోనే గాజాలో శాంతి



### పరస్పర విశ్వాసం కూడా ముఖ్యం

గాజా : కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చి పది రోజులు గడిచినా తమ జీవితాల్లో చెప్పుకోదగ్గ మార్పులేమీ కనిపించడం లేదని అటు పాలస్తీనియన్లు, ఇటు ఇజ్రాయిల్స్ వాపోతున్నారు. ఇజ్రాయిల్ బలగాలు చెదురుమదురుగా కాల్పులు జరుపుతునే వున్నాయని, ఆహార ట్రక్కులు రాకుండా అడ్డుకుంటునే వున్నాయని, దాంతో తమకు పాట్లు తప్పడం లేదని వారు పేర్కొం టున్నారు. గాజాలోకి ప్రవేశించేందుకు ఆరు వేలకు పైగా ట్రక్కులు వేచి వున్నాయని యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ తెలిపింది. ఇదిలావుండగా, దాడుల సమయంలో శిధిలాల గుట్టల కింద చిక్కుకునిపోయి మరణించిన తమ వారి మృతదేహాలను వెలికి తీయడం రోజురోజుకు సవాలుగా మారుతోంది. ఇంకా వేలాది మృతదేహాలు అక్కడే వున్నాయని గాజా పౌర రక్షణ దళ సభ్యులు తెలిపారు. పరిమితమైన పరికరాలు వుండడంతో పని సాగడం లేదని చెప్పారు. హమాస్ తన వద్ద గల మరో ఇద్దరు బందీల మృతదేహాలను ఇజ్రాయిల్‌కు గత రాత్రి అప్పగించింది. వీరిలో ఒకరు సైనికుడు కాగా, మరొకరు సామాన్య పౌరుడు. మరోవైపు ఇజ్రాయిల్ కూడా మరో 30మంది పాలస్తీనియన్ల మృతదేహాలను అప్పగించింది. వారి శరీరాలపై వేధించిన, కొట్టిన గుర్తులు కనిపిస్తున్నాయని గాజా ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి. కళ్లకు గంతలు కట్టేసి, చేతులకు సంకెళ్లు వేసి కూడా వున్నాయని పేర్కొన్నారు. గాజాలో టుఫా ప్రాంతంలో ఇజ్రాయిల్ బలగాలు జరిపిన కాల్పుల్లో ఒకరు మరణించారు. ఇదిలావుంటే కాల్పుల విరమణ ఒప్పందాన్ని సజావుగా అమలు చేయడం అంత సులభం కాదని అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందాన్ని ఇజ్రాయిల్ నిలబెట్టుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హమాస్ ఆయుధాలన్నింటినీ అప్పగించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. ఇకపోతే ఇజ్రాయెల్‌పై హమాస్ చేసిన దాడి, నాజీ పాలన తర్వాత జరిగిన అతి పెద్ద మానవ ఊచకోతగా చూడాలి. ఈ దాడి ప్రధానంగా జరిగింది మిలిటరీ మీద కాదు. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం చనిపోయిన వారిలో సుమారు 850మంది పౌరులు ఉండగా 350మంది మిలిటరీ పోలీసులు ఉన్నారు. ఈ దాడిలో సేఫ్ హౌస్‌లో దాక్కోడానికి ప్రయత్నించిన సాధారణ పౌరులను, వారు పిల్లలా, వృద్ధులా అన్నదానితో సంబంధం లేకుండా మంటల్లో తగలబెట్టారని ఐక్యరాజ్యసమితి నిర్ధారించింది. లూటీలు జరిగాయని, తలలు నరికివేయడం కూడా జరిగిందని ఆ నివేదిక తేల్చిచెప్పింది. అంతేగాక సెక్సువల్ వయెలెన్స్ మీద ఐరాస సెక్రెటరీ జనరల్ జరిపిన ప్రత్యేక పరిశోధనలో కిబ్బుట్జ్ ప్రాంతంలో రేప్‌లు, గ్యాంగ్ రేప్‌లు జరిగాయని తేలింది. ఎన్నోచోట్ల స్త్రీల అర్ధనగ్న, నగ్న దేహాలు పడివున్నాయని, మర్మాంగాల ఛేదనం జరిగిందని ఆ ఐరాస బృందం కనుగొన్నది. ఈ బృందం సుమారు 5000 ఫోటోలు, 50 గంటల నిడివి ఉన్న ట్రాఫిక్ కెమెరాలతో సహా అన్ని రకాల ఆడియో, వీడియో ఫైళ్లనూ పరిశీలించి, ప్రత్యక్ష సాక్షులను విచారించి ఈ నివేదికను రూపొందించింది. మొత్తంగా ఇప్పుడు ట్రంప్ ఆదేశాలతో శాంతి ఒప్పందం కుదిరినా హమాస్ దీనికి ఎంతవరకు కట్టుబడి ఉంటుందన్నది అనుమానమే.

# కార్తీక మాసం ప్రారంభం

### విశేషంగా శివకేశవ పూజలు . వ్రతాలు నోములకు ప్రత్యేకం



తిరుమల,అక్టోబర్23 : హిందువులు ఎంతో పవిత్రంగా భావించే కార్తీకమాసం అక్టోబర్ 22 బుధవారం నుంచి ప్రారంభమైంది. ఈ మాసంలో వ్రతాలు, నోములకు ప్రత్యేక ప్రాధన్యం ఉంది. కార్తీక మాసం తదుపరి వచ్చే అమావాస్య వరకు అంటే నవంబర్ 20 వరకు కొనసాగుతుంది. శివకేశవులకు అత్యంత ప్రీతి పాత్రంగా ఈ మాసాన్ని చెబుతారు. ఎంతో పవిత్రమైన కార్తీకమాసంలో పండుగులకు కూడా విశేష స్థానం ఉంది. కార్తీకమాసంలో సూర్యోదయానికి ముందే నదీస్నానం చేసి శివకేశవ పూజలు చేస్తారు. ఈ మాసంలో శివుడికి దీపారాధన చేసి పూజలు చేసిన వారికి విశేషమైన పుణ్యం లభిస్తుందిని.. తద్వారా ఈతి బాధలు తొలగిపోతాయని విశ్వాసం. అందుకే చాలా మంది శివ భక్తులు సాయంత్రం వేళ గుడిలో దీపారాధన చేస్తారు. ఇలా చేయడం వల్ల జన్మజన్మల పాపాలు తొలగిపోతాయని పండితులు చెబుతున్నారు. కార్తీకమాసంలో పండుగల వివరాలు ఇలా ఉన్నాయి.

అక్టోబర్25 శుక్రవారం నాగుల చవితితో పాటు ..మాసిక వినాయక చతుర్థి వ్రతం ఆచరిస్తారు. మరుసటి రోజును లాభ పంచమిగా ఆచరిస్తారు. ఇకపోతే అక్టోబర్27 న తొలి కార్తీక సోమవార , స్కంద షష్ఠి, ఛత్ పూజ నిర్వహిస్తారు. 29న బుధ అష్టమి వ్రతం, 30న గోపాష్టమి, మాసిక్ దుర్గా అష్టమిగా భావిస్తారు. 31న అక్షయ నవమి, జగద్ధాత్రి పూజ చేపడతారు. నవంబర్ 1శనివారం ప్రబోధిని ఏకాదశి, కంస వధ, భీష్మ పంచకంగా ఆచరిస్తారు. నవంబర్ 2 ఆదివారం తులసీ వివాహం, వైష్ణవ దేవుత్థాన ఏకాదశి, యోగేశ్వర ద్వాదశిగాను 3న కార్తీక సోమ ప్రదోష వ్రతం, వైకుంఠ ,విశ్వేశ్వర వ్రతం,చతుర్దశి పూజలు నిర్వహిస్తారు. నవంబర్4న మణికర్ణిక స్నానం, నవంబర్5 కార్తీక పూర్ణిమ,దేవ్ దీపావళి, భీష్మపంచకం ముగింపు, గురునానక్ జయంతి,పుష్కర స్నానం ఆచరిస్తారు. నవంబర్ 8 : సంకష్టహర చతుర్థి, సౌభాగ్య సుందరి తీజ్? నవంబర్ 10: కార్తీక సోమవారం కానుంది. 17న కార్తీక సోమవారం ప్రదోష వ్రతం చేపడతారు. నవంబర్ 20తో కార్తీక మాసం ముగుస్తుంది.

# షిర్డీ వెళ్లాలనుకునే వారికి బంపర్ ఆఫర్

హైదరాబాద్, అక్టోబర్23 (: హైదరాబాద్ నుంచి షిర్డీ క్షేత్రానికి రోజూ వేలాది మంది సాయిబాబా భక్తులు వెళ్తుంటారు. సాయిబాబా దర్శనం కోసం వెళ్ళే భక్తులు బస్సులు, రైళ్లు, టూరిజం బస్సులు వంటి వాటిని ఎంచుకుంటారు. అయితే చాలా మందికి షిర్డీ వెళ్లాలని ఉన్నా.. ధర తమకు అందుబాటులో లేదు అంటూ భావిస్తారు.. అటువంటి వారి కోసం తాజాగా బంపర్ ఆఫర్ ప్రకటించింది. తక్కువ ధరకే సాయి సన్నిధి ఎక్స్ హైదరబాద్ అనే పేరుతో ప్రత్యేక షిర్డీ టూర్ ప్యాకేజీని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ నెలలో ప్రారంభం కానున్న ఈ టూర్ 2 రాత్రులు, 3 రోజులపాటు సాగనుంది. ప్రతి బుధవారం అందుబాటులో ఉండనున్నది. ఈ టూర్ ప్యాకేజీకి లో టికెట్స్ బుక్ చేసుకోవాలనుకునేవారు సూచించిన వెబ్‌సైట్‌ను సందర్శించాల్సి ఉంటుంది. ఈ నెల అక్టోబర్ 29 తేదిన కాచిగూడ రైల్వే స్టేషన్ నుంచి (రైలు నెంబర్ 17064) సాయంత్రం 6,40 గంటలకు జర్నీ స్టార్ అవుతుంది. సికింద్రాబాద్, కామారెడ్డి, నిజామాబాద్ వంటి స్టేషన్ల మీదుగా ఈ ప్రయాణం సాగుతుంది. బుధవారం రాత్రి అంతా ప్రయాణం చేసి మహారాష్ట్రలోని నాగర్ సోల్ రైల్వే స్టేషన్ కు చేరుకుంటారు. ఇక్కడ అనుంచి షిర్డీకి ప్రత్యేక వాహనం ద్వారా చేరుకుంటారు. రెండో రేజు ఉదయం శిర్డీలోని హోటల్‌లో చెక్-ఇన్ అవ్వాలి. అల్పాహారం తిని షిర్డీ సాయిబాబా దర్శనం కోసం ఆలయానికి చేరుకోవాలి. సాయంత్రం 5 గంటలకు హోటల్ చెక్ అవుట్ అయ్యి.. రాత్రి 7.30 గంటల నాగర్ సోల్ రైల్వే స్టేషన్ కు చేరుకోవాలి. రెండో రోజు రాత్రంతా ప్రయాణం చేసి మూడో రోజు ఉదయం 9:45కి కాచిగూడకు చేరుకోవాలి.




## కాకినాడ బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడి ఆత్మహత్య

అమరావతి : కాకినాడ జిల్లా తుని జగన్నాథగిరి గురుకుల పాఠశాలలో చదువుతున్న బాలికపై నిన్న నారాయణరావు అనే వ్యక్తి లైంగిక దాడికి ప్రయత్నించాడు. నిందితుడు తాను బాలికకు తాతయ్యనని చెప్పి పాఠశాల నుంచి తీసుకెళ్లాడు. తోటలోకి తీసుకెళ్లగా, స్థానికుడు నిలదీయడంతో ఈ విషయం బయటపడింది. బాధితురాలి బంధువుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. న్యాయమూర్తి ముందు హాజరు పరిచేందుకు రాత్రి తీసుకువెళు తుండగా టాయిలెట్ వస్తుందని చెప్పిన నారాయణరావు.. చెరువులో దూకాడు. రాత్రంతా వెతికినా డెడ్ బాడీ దొరకలేదు. ఉదయం ఫైర్ , పోలీస్ సిబ్బంది గజ ఇతగాళ్లతో వెతకగా బాడీ దొరికింది. నారాయణరావు చేసిన తప్పుకి పశ్చాత్తాపంతో సిగ్గుపడి ఆత్మహత్య ప్రయత్నం చేసి ఉండొచ్చు లేదా అనుకోకుండా చెరువులో పడిపోయి ఉండొచ్చు అని భావిస్తున్నాం అన్నారు పోలీసులు. స్కూల్ ఎదుట ఆందోళనకు దిగిన బాలిక బంధువులు తాతయ్యనని చెబితే ఎలా పంపించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు స్కూల్ ప్రిన్సిపాల్‌ను కూడా విచారించారు.



# కోపానికి మందు శాంతమే

‘కోపించువానిని కోపించరాదు. నిందించువానికి కుశలం పలకాలి’ అని పై ఉపనిషత్ వాక్యానికి భావం. కోపగ్రస్తుణ్ని కోపిస్తే%% అతని కోపం పెరుగుతుందే కానీ, తగ్గదు. అలాకాకుండా కోపానికి కోపమే సమాధానం అంటే చిక్కులు తప్పవు. ఈ కింది వృత్తాంతం చూడండి. ఒకసారి శ్రీకృష్ణుడు, బలరాముడు, సాత్యకి వనవిహారం వెళ్లారు. చీకటి పడింది. కీకారణ్యంలో ఎటూ పోలేరు. ఆ రాత్రి ఇద్దరు నిద్రిస్తే ఒకరు కాపలా ఉండాలనుకున్నారు. సాత్యకి గస్తీ తిరగసాగాడు. అంతలో ఒక రాక్షసుడు వేగంగా వచ్చి వారిపై పడబోయాడు. సాత్యకి గదాదండంతో ఎదుర్కొన్నాడు. రాక్షసుడి శరీరం రెట్టింపైంది. సాత్యకి కోపం పెరిగింది. రాక్షసుడి శరీరమూ విపరీతంగా పెరిగింది. సాత్యకిని పైకెత్తి, గిరగిరా తిప్పి పడేసి వెళ్లిపోయాడు. కాసేపటి తర్వాత బలరాముడు కాపలా కాస్తుండగా అదే రాక్షసుడు మళ్లీ అటుగా వచ్చాడు. బలరాముడు హలాయుధంతో దాడి చేశాడు. రాక్షసుడు వికటాట్టహాసంతో శరీరాన్ని పెంచాడు. బలరాముడికి కోపం అమాంతం పెరిగింది. రాక్షసుడి శరీరమూ భీకరంగా పెరిగింది. వాడు బలరాముడిని సైతం మట్టి కరిపించి, వెళ్లిపోయాడు. ఇంతలో శ్రీకృష్ణుడు మేలుకున్నాడు. కాపలా కాయసాగాడు. కాసేపటికి అదే రాక్షసుడు అటుగా వచ్చాడు. కసిగా కృష్ణుడిపై దూకాడు. తప్పించుకున్న కృష్ణుడు చిరునవ్వు చిందించాడు. రాక్షసుడు పట్టుకోబోతే.. ఒడుపుగా తప్పించుకొని మల్లయుద్ధానికి దిగాడు. రాక్షసుడి శరీరం సగం తగ్గిపోయింది. అతడు కవ్విస్తున్నా కృష్ణుడి మందహాసం చెదరలేదు. రాక్షసుడి శరీరం అంతకంతకూ తగ్గిపోసాగింది. గుప్పిట్లో పట్టేంత చిన్నవాడయ్యాడు. కృష్ణుడు వాణ్ని అరచేత్తో పట్టి ఉత్తరీయం కొసకు మూటలా కట్టేశాడు. తెల్లవారింది. సాత్యకి, బలరాముడు మేలుకున్నారు. మందహాస వదనుడైన కృష్ణుణ్ని చూశారు. ‘హమ్మయ్య! రాక్షసుడు కనిపించలేదా!’ అన్నారు. ‘వీడేనా రాక్షసుడు!’ అంటూ ఉత్తరీయం అంచున మూట విప్పాడు కృష్ణుడు. అందులోంచి ఊడిపడ్డాడు పిడికెడంత రాక్షసుడు. బలరాముడు, సాత్యకి ‘వీడే! అప్పుడేమో బాగా పెద్దగా ఉన్నాడు. కోపంగా పోరాడే కొద్దీ పెరిగిపోయాడు’ అన్నారు. ‘ఈ రాక్షసుడే క్రోధం. దానికి విరుగుడు శాంతం.



ఆధ్యాత్మికం

# తెలంగాణ అంటే భవిష్యత్తు... అవకాశాల ఖని

- లక్ష్యం రూ.లక్ష కోట్ల పెట్టుబడులు
- లైఫ్ సైన్సెస్ లో 5 లక్షల మందికి ఉపాధి
- 2030 నాటికి కల్పించేలా "రోడ్ మ్యాప్"
- త్వరలోనే అందుబాటులోకి "కాంప్రహెన్సివ్ లైఫ్ సైన్సెస్ పాలసీ
- బయో-డిజిటల్" యుగానికి అనుగుణంగా రెడీ టూ వర్క్ ఫోర్స్
- ఆస్‌బయోటెక్ 2025" సదస్సులో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు





**రామగిరి, అక్టోబర్ 23(ది క్రైమ్ న్యూస్):-** లైఫ్ సైన్సెస్ లో 2030 నాటికి కొత్తగా రూ.లక్ష కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొచ్చి... 5 లక్షల మందికి ఉపాధి కల్పించేలా రోడ్ మ్యాప్ ను సిద్ధం చేస్తున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చెప్పారులి. ఆస్ట్రేలియా లైఫ్ సైన్సెస్ అత్యున్నత నిర్ణాయక సంస్థ 'ఆస్‌బయోటెక్', విక్టోరియా రాష్ట్ర ప్రభుత్వం సంయుక్త నిర్వహణలో మెల్ బోర్న్ లో నిర్వహిస్తున్న 'ఆస్‌బయోటెక్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ 2025'లో ఆయన గురువారం కీలకోపన్యాసం చేశారు. రెండేళ్లలో తెలంగాణ లైఫ్ సైన్సెస్ రంగం సాధించిన పురోగతి, భవిష్యత్తు ప్రణాళికలు, అవకాశాలు, ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అనుకూలతలను ఈ సందర్భంగా ఆయన వివరించారు. తెలంగాణను "గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్ "గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున తీసుకుంటున్న చర్యలను వెల్లడించారు.

**250 బిలియన్ డాలర్లకు చేర్చేలా....**
భౌగోళికంగా 11వ స్థానం, జనాభాలో 12వ స్థానంలో ఉన్నప్పటికీ, దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో తెలంగాణ వాటా 5 శాతం కంటే ఎక్కువగా ఉందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. 2024-2025లో తెలంగాణ జీఎస్ డీపీ వృద్ధి రేటు 8.2 శాతం కాగా, జాతీయ సగటు కేవలం 7.6 శాతం మాత్రమే ఉందన్నారు. గత 20 నెలల కాలంలో కొత్తగా రూ.3.2 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రాగా, ఇందులో లైఫ్ సైన్సెస్ రంగం వాటా రూ.63వేల కోట్లు అని చెప్పారు. లైఫ్ సైన్సెస్ ఎగుమతులు గతేడాది ఏప్రిల్%-%డిసెంబర్ మధ్య కాలంలోనే రూ.26వేల కోట్ల మార్కును దాటాయన్నారు. తెలంగాణ లైఫ్ సైన్సెస్ రంగం ఆర్థిక వ్యవస్థ విలువను ప్రస్తుతం ఉన్న 80 బిలియన్ డాలర్ల నుంచి 2030 నాటికి 250 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇందుకోసం త్వరలోనే "కాంప్రహెన్సివ్ లైఫ్ సైన్సెస్ పాలసీ" ని అందుబాటులోకి తెస్తామన్నారు.

**భారత్ నుంచి హైదరాబాద్ మాత్రమే....**
ప్రముఖ కన్సల్టింగ్ సంస్థ సీబీఆర్ఈ రూపొందించిన 'గ్లోబల్ లైఫ్ సైన్సెస్ అట్లాస్ 2025'లో ప్రపంచంలోని అత్యుత్తమ లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో హైదరాబాద్ కు చోటు దక్కిందన్నారు. బోస్టన్, శాన్ ఫ్రాన్సిస్కో, కేంబ్రిడ్జ్, బీజింగ్, టోక్యో సరసన మన నగరం నిలిచిందన్నారు. ఈ జాబితాలో భారత్ నుంచి చోటు దక్కించుకున్న ఏకైక నగరం హైదరాబాద్ మాత్రమే అని అన్నారు. లైఫ్ సైన్సెస్ ఆఫీస్ లీజింగ్ 2022లో 0.6 మిలియన్ చదరపు అడుగులు ఉండగా...2024లో ఏకంగా నాలుగు రెట్లు పెరిగి 2.4 మిలియన్ చదరపు అడుగులకు చేరిందన్నారు. లైఫ్ సైన్సెస్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్, సెంటర్ ఫర్ ది ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్, ఇతర అంతర్జాతీయ దిగ్గజ సంస్థల భాగస్వామ్యంతో రాబోయే "బయో-డిజిటల్" యుగానికి కావాల్సిన అత్యుత్తమ నైపుణ్యమున్న మానవ వనరులను తయారు చేసే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుందన్నారు. **మా నినాదం "ఇన్వెంట్ ఇన్ తెలంగాణ"...** మా నినాదం మేడిన్ ఇండియా కాదు... ఇన్వెంట్ ఇన్ తెలంగాణ అని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. లైఫ్ సైన్సెస్ పరిశ్రమల ఏర్పాటుకు అనువైన "ఎకో సిస్టం" తెలంగాణ బ్రాండ్ ను విశ్వవ్యాప్తం చేస్తుందన్నారు. జీనోమ్ వ్యాలీ, మెడికల్ డివైసెస్ పార్క్, బీ హబ్, భారత్ ఫ్యూచర్ సిటీ, పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించే ప్రగతిశీల, ప్రోత్సాహకర విధానాలు, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, ప్లగ్-అండ్-ప్లే పారిశ్రామిక పార్కులు, అనుమతుల కోసం సింగిల్ విండో సిస్టమ్ , దేశంలోనే సాటి లేని స్టెమ్ టాలెంట్, స్థిరమైన ప్రభుత్వం, సమర్థవంతమైన నాయకత్వం, ఎక్కడైనా సులభంగా చేరుకునేలా రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

**ఈ రంగాల్లో పెట్టుబడులు పెట్టండి....** సెల్ అండ్ జీన్ థెరపీ, బయోలాజిక్స్ అండ్ బయోసిమిలర్స్, ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్లు, కాంట్రాక్ట్ రీసెర్చ్, డెవలప్మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్, డయాగ్నస్టిక్స్, మెడ్‌టెక్, ఏఐ ఆధారిత డిజిటల్ హెల్త్ , హెల్త్‌టెక్, ఏపీఐ బల్క్ డ్రగ్ ఉత్పత్తి, ఫార్మా ప్యాకేజింగ్, గ్లాస్ ట్యూబింగ్, ట్రాన్స్‌లేషనల్ బయోటెక్ రీసెర్చ్, ఏఐ ఆధారిత డ్రగ్ డిస్కవరీ, జీనోమిక్స్ , గ్రీన్ బయో మాన్యుఫ్యాక్చరింగ్, అగ్రి బయోటెక్, యానిమల్ హెల్త్ తదితర రంగాల్లో తెలంగాణ లో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. వీటిల్లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని ఆస్ట్రేలియా కంపెనీలను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సదస్సు "విక్టోరియా తెలంగాణ ఇన్నోవేషన్ కారిడార్" కు నాంది పలకాలని ఆకాంక్షించారు. రాబోయే ఫిబ్రవరిలో హైదరాబాద్ లో నిర్వహించనున్న బయో ఏషియా సదస్సుకు హాజరు కావాలని దిగ్గజ లైఫ్ సైన్సెస్ పరిశ్రమలను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో విక్టోరియా రాష్ట్ర మంత్రులు రోస్ స్పెన్స్, డానీ పియర్సన్ ఎంపీ, ఆస్ బయోటెక్ ఛైర్మన్ డా. జేమ్స్ క్యాంప్‌బెల్, తెలంగాణ ఇన్వెస్ట్మెంట్ సెల్ డైరెక్టర్ మధుసూదన్, తెలంగాణ లైఫ్ సైన్సెస్ ఫౌండేషన్ సీఈవో శక్తి నాగప్పన్ తదితరులు పాల్గొన్నారు.

# సిఐటియు జిల్లా 4వ మహాసభలను జయప్రదం చేయాలి

- సిఐటియు జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** సిఐటియు జిల్లా 4వ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎర్రవల్లి ముత్యంరావు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని శాంతినగర్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు వేల్పుల కుమారస్వామి అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ నవంబర్ 15,16 తేదీల్లో చారిత్రాత్మకమైన పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జిల్లా సిఐటియు 4వ మహాసభలు నిర్వహిస్తున్నామని, ఈ మహాసభల్లో కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి, వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని తెలిపారు. పారిశ్రామిక జిల్లా అయిన పెద్దపల్లి లో అనేక రంగాల ఉద్యోగుల, కార్మికుల సమస్యల పరిష్కారానికి రాజి లేని పోరాటాలు నిర్వహిస్తున్న సంస్థ సిఐటియు అని ఇలాంటి కార్మిక వర్గ సంస్థ అయిన సిఐటియు మహాసభల జయప్రదానికి అన్ని రంగాల కార్మి కులు, ఉద్యోగులు, ప్రజలు సహాయ సహకారాల అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ రెండు రోజుల మహాసభలకు జిల్లాలోని 32 రంఘాలు,14 మండలాల, 4 మున్సిపల్ పట్టణాల నుండి అనేక పోరాటాలకు నాయకత్వం వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు, ప్రతినిధులు వెయ్యి మంది హాజరవుతారని మొదటి రోజు వేలాది మందితో భారీ కార్మిక ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందని, ఇందులో సిఐటియు అఖిలభారత మరియు రాష్ట్ర నాయకులు పాల్గొంటారని అన్నారు, సిఐటియు స్వతంత్ర కార్యాచరణతో పాటు ఐక్య పోరాటాల వారిదిగా నిలుస్తూ అనేక ఉద్యమాలకు, పోరాటాలకు, సమ్మెలకు జిల్లాలో నాయకత్వం వహిస్తుందని, రాబోయే రోజుల్లో కార్మిక వర్గ శ్రేయస్సు కోసం మరింత పట్టుదలతో కృషి చేయడానికి ఈ మహాసభలు నిర్వహిస్తున్నామని అన్నారు. నిరంతరం కార్మికుల పక్షాన పోరాడే సిఐటియు మహాసభల జయప్రదానికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు వేల్పుల కుమారస్వామి, ఉపాధ్యక్షులు ఎన్, బిక్షపతి, డి, కొమరయ్య, ఎం, రామాచారి, జిల్లా సహాయ కార్యదర్శి జి, జ్యోతి, సిపెల్లి రవీందర్, తాండ్ర అంజయ్య, లక్మారెడ్డి, గణేష్, వెంకటస్వామి, ఎండి ఖాజా, లచ్చయ్య, మల్లేష్, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# కోల్ ఇండియా స్థాయిలో పోటీలలో రాణించాలి

## - డిజిఎం క్వాలిటీ బి.వి. సత్య నారాయణ



**రామగిరి,అక్టోబర్ 23(ది క్రైమ్ న్యూస్):-** కోల్ ఇండియా స్థాయిలో పోటీలలో రాణించాలని రామగుండం-త్రీ ఏరియా క్వాలిటీ విభాగాధిపతి బి.వి. సత్య నారాయణ అన్నారు.రామగుండం-త్రీ, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలోని వర్క్ పీపుల్ స్పోర్ట్స్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణం నందు ఆర్.జి-త్రీ, ఎ.పి.ఎ, భూపాలపల్లి ఏరియాల కళాకారుల మధ్య రీజినల్ స్థాయి సాంస్కృతిక (కల్చరల్) పోటీలను నిర్వహించారు. ఇట్టి పోటీలను రామగుండం-త్రీ ఏరియా క్వాలిటీ విభాగాధిపతి బి.వి.సత్య నారాయణ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఉద్యోగుల కోసం ప్రతి సంవత్సరం వివిధ కళలకు సంబంధించిన పోటీలను నిర్వహిస్తుందన్నారు. కావున నిత్యం ఉద్యోగులు సాధన చేస్తూ, నైపుణ్యం సాధిస్తూ ముందుకెళ్లాలన్నారు. అంతేకాకుండా కంపెనీ స్థాయి, కోల్ ఇండియా స్థాయిలలో నిర్వహించు పోటీలలో నైపుణ్యాన్ని ప్రదర్శించి మన రీజియన్ పేరు నిలబెట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు వై.వి.రావు, కోట రవీందర్ రెడ్డి, డివై పిఎం వి.సునీల్ ప్రసాద్, గౌరవ కార్యదర్శి సాయి స్వరూప్, స్పోర్ట్స్ సూపర్వైజర్ పర్సా శ్రీనివాస్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ జవ్వాజి అంజయ్య, ఇతర నిర్వాహకులు, కళాకారులు పాల్గొన్నారు.

# షిర్డీ వెళ్లాలనుకునే వారికి బంపర్ ఆఫర్

**హైదరాబాద్, అక్టోబర్23:** హైదరాబాద్ నుంచి షిర్డీ క్షేత్రానికి రోజూ వేలాది మంది సాయిబాబా భక్తులు వెళ్తుంటారు. సాయిబాబా దర్శనం కోసం వెళ్ళే భక్తులు బస్సులు, రైళ్లు, టూరిజం బస్సులు వంటి వాటిని ఎంచుకుంటారు. అయితే చాలా మందికి షిర్డీ వెళ్లాలని ఉన్నా.. ధర తమకు అందుబాటులో లేదు అంటూ భావిస్తారు.. అటువంటి వారి కోసం తాజాగా బంపర్ ఆఫర్ ప్రకటించింది. తక్కువ ధరకే సాయి సన్నిధి ఎక్స్ హైదరబాద్ అనే పేరుతో ప్రత్యేక షిర్డీ టూర్ ప్యాకేజీని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ నెలలో ప్రారంభం కానున్న ఈ టూర్ 2 రాత్రులు, 3 రోజులపాటు సాగనుంది. ప్రతి బుధవారం అందుబాటులో ఉండనున్నది. ఈ టూర్ ప్యాకేజీకి లో టికెట్స్ బుక్ చేసుకోవాలనుకునేవారు సూచించిన వెబ్‌సైట్‌ను సందర్శించాల్సి ఉంటుంది. ఈ నెల అక్టోబర్ 29 తేదిన కాచిగూడ రైల్వే స్టేషన్ నుంచి (రైలు నెంబర్ 17064) సాయంత్రం 6,40 గంటలకు జర్నీ స్టార్ అవుతుంది. సికింద్రాబాద్, కామారెడ్డి, నిజామాబాద్ వంటి స్టేషన్ల మీదుగా ఈ ప్రయాణం సాగుతుంది. బుధవారం రాత్రి అంతా ప్రయాణం చేసి మహారాష్ట్రలోని నాగర్ సోల్ రైల్వే స్టేషన్ కు చేరుకుంటారు. ఇక్కడ అనుంచి షిర్డీకి ప్రత్యేక వాహనం ద్వారా చేరుకుంటారు. రెండో రేజు ఉదయం శిర్డీలోని హెూటల్‌లో చెక్-ఇన్ అవ్వాలి. అల్పాహారం తిని షిర్డీ సాయిబాబా దర్శనం కోసం ఆలయానికి చేరుకోవాలి. సాయంత్రం 5 గంటలకు హెూటల్ చెక్ అవుట్ అయ్యి.. రాత్రి 7.30 గంటల నాగర్ సోల్ రైల్వే స్టేషన్ కు చేరుకోవాలి. రెండో రోజు రాత్రంతా ప్రయాణం చేసి మూడో రోజు ఉదయం 9:45కి కాచిగూడకు చేరుకోవాలి.

# బాలికపై అత్యాచారం కేసులో నిందితుల అరెస్టు

**అమరావతి, అక్టోబర్23 :** సాంఘిక సంక్షేమ వసతి గృహంలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితులు పాము అజయ్‌తోపాటు అతని స్నేహితుడు కె. సత్యస్వరూప్‌ను అరెస్ట్ చేసినట్లు రాజమండ్రి సౌత్ జోన్ డీఎస్పీ భవ్య కిషోర్ వెల్లడించారు. గురువారం విలేకర్లతో ఆమె మాట్లాడుతూ.. నిందితుడు అజేయ్ ఐటీఐ చదివాడని తెలిపారు. అతడు ఉత్సవాలు, ఊరేగింపుల్లో గారడీ డాన్సులు చేస్తుంటాడని వివరించారు. నిందితుడు అజయ్‌పై ఇప్పటికే ఆలమూరు పోలీసుస్టేషన్‌లో పలు కేసులు నమోదై ఉన్నాయన్నారు. నిందితుడికి సహకరించిన సత్య స్వరూప్ రావులపాలెంలో సెలూన్ నడుపుతున్నాడని చెప్పారు. అక్టోబర్ 20వ తేది సాయంత్రం 5 గంటలకు దీపావళి వేడుకల కోసం క్రాకర్స్ కొనుక్కోవటానికి బాలిక హాస్టల్ నుంచి బయటకు వచ్చిందన్నారు. ఆ బాలికను బైక్‌పై నిందితులు రైల్వే స్టేషన్ సమీపంలోని లాడ్జిలోకి తీసుకు వెళ్లారని పేర్కొన్నారు. అనంతరం ఆ బాలికపై అజయ్ అత్యాచారానికి పాల్పడ్డారన్నారు. ఆ తర్వాత ఆమెను హాస్టల్ వద్ద దింపి వెళ్లిపోయారని చెప్పారు. ఈ కేసులో నిందితులపై కిడ్నాప్, అత్యాచారం, పోక్సో కేసులు నమోదు చేసినట్లు డీఎస్పీ భవ్య కిషోర్ వివరించారు.

# బీసీ జేఏసీ చైర్మన్‌గా దాసరి ఉషకు అవకాశం కల్పించాలి




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** బహుజనుల హక్కుల కోసం నిస్వార్థంగా పనిచేసే దాసరి ఉషకు జిల్లా బీసీ జేఏసీ చైర్మన్ గా అవకాశం కల్పించాలని తెలంగాణ చేనేత ఐఖ్య వేధిక కార్యనిర్వాహక అధ్యక్షుడు కోమటిపల్లి సదానందం అన్నారు. గురువారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్బులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ చేపట్టిన దీక్ష విజయవంతం చేయడంలో పెద్దపల్లి నియోజకవర్గానికి చెందిన దాసరి ఉషా ప్రధాన పాత్ర పోషించిందన్న ఆయన బిసిలను ఏకంచేయడంలో ఆమె విశేషమైన కృషి చేసిందన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ఐఐటి పూర్తిచేసిన ఉషా రూ.లక్షల జీతం గల ఉద్యోగాన్ని వదిలిపెట్టి ప్రజాసేవలో తనవంతు పాత్ర పోషిస్తున్నదని వివరించారు. స్వంతంగా ఉపాధి పరిశ్రమలను నెలకొల్పి మహిళలకు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నదని సదానందం వివరించారు. బిసి జేఏసి చైర్మన్ గా దాసరి ఉషకు అవకాశం ఇచ్చినట్లయితే బిసిల పక్షాన ఫైర్ బ్రాండుగా ఉద్యమాలను చేపట్టగలిగే సత్తా ఉందన్నారు. ఈ సమావేశంలో నాయకులు మేరుగు లింగయ్య, బండ నిఖిల్ యాదవ్, దొడ్డ అశోక్, దాసరి రామస్వామి, కనుకుంట్ల మోహన్, సదయ్య గౌడ్, సాగర్, శఫి, పేరం రవి తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు: వంశీ రెడ్డి



**కూకట్ పల్లి అక్టోబర్ 23 (ది క్రైమ్ న్యూస్):** గోవధకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న ఉద్యమాన్ని అక్రమ అరెస్టులతో ఆపలేరని శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానందనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ వంశీరెడ్డీ అన్నారు. గోవుల రక్షణ కోసం ఉద్యమిస్తున్న హిందూ యువకుని పై కాల్పులు జరిపిన సంఘ వ్యతిరేక శక్తులను అడ్డుకోలేని ఈ రాష్ట్ర ప్రభుత్వానికి చేతనైందల్ల రాష్ట్రంలో గోవధకు వ్యతిరేకంగా ఉద్యమించే వారి పై అక్రమ కేసులు బనాయించి నిర్బంధించడం, వారిని అణచివేయడం, ఒక వర్గం వారిని ప్రసన్నం చేసుకోవడానికి ఇంతగా దిగజారాలా అని డాక్టర్ వంశీ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కళ్యాణి దుర్గాప్రసాద్, కృష్ణంరాజు, నర్సింగరావు, రేపన్ రాజు, లక్ష్మణ్, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఎండి పోలీస్ స్టేషన్లో విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం





**తిమ్మాపూర్, అక్టోబర్ 23(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలకేంద్రంలోని ఎల్ఎండి పోలీస్ స్టేషన్లో పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులకు గురువారం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీసుల విధులు, సాంకేతిక పరికరాల వాడకం, డయల్ 100, షీ టీమ్స్, భరోసా, సైబర్ నేరాలు, యాంటీ డ్రగ్, టెస్ట్ కాల్ ద్వారా డయల్ 100 పై అవగాహన, స్టేషన్ లోని కమాండ్ కంట్రోల్ గది, లాకప్, ఇతర విషయాలపై అవగాహన కల్పించారు. నేటి బాలలే రేపటి పౌరులుగా చదువుపై దృష్టిసారించిఉన్నత స్థాయికి చేరుకుని తల్లిదండ్రుల కలలు నెరవేరుస్తూ దేశాభివృద్ధికి తోడ్పడాలనిసిఐ.సదన్ కుమార్,ఎస్ఐ కదిరె శ్రీకాంత్ గౌడ్ విద్యార్థులకు సూచించారు. ఆదర్శ పాఠశాల విద్యార్థులు, పోలీస్ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఎల్ఓసీ అందజేత

**ముత్తారం.అక్టోబర్.23.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండల కేంద్రానికి చెందిన మండల లక్ష్మణ్ 1.25.000 ఎల్ఓసి మంజూరు అయింది. లక్ష్మణ్ అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వైద్య ఖర్చుల కొరకు మంత్రి శ్రీధర్ బాబును కోరగా సిఎంఆర్ఎఫ్ కు దరఖాస్తు చేసుకోగా వారికి 1.25.000 ఎల్ఓసి మంజూరు చేశారు. ఐటీ మంత్రి శ్రీధర్ బాబు సహాయకుడు గురువారం వారి కుటుంబ సభ్యులకు హైదరాబాద్లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చెక్కుని అందజేశాడు. ఎల్ఓసీ మంజూరుకు కృషి చేసిన మంత్రికి లక్ష్మణ్, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



# కాకినాడ బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడి ఆత్మహత్య

**అమరావతి, అక్టోబర్23 :** కాకినాడ జిల్లా తుని జగన్నాథగిరి గురుకుల పాఠశాలలో చదువుతున్న బాలికపై నిన్న నారాయణరావు అనే వ్యక్తి లైంగిక దాడికి ప్రయత్నించాడు. నిందితుడు తాను బాలికకు తాతయ్యనని చెప్పి పాఠశాల నుంచి తీసుకెళ్లాడు. తోటలోకి తీసుకెళ్లగా, స్థానికుడు నిలదీయడంతో ఈ విషయం బయటపడింది. బాధితురాలి బంధువుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. న్యాయమూర్తి ముందు హాజరు పరిచేందుకు రాత్రి తీసుకువెళుతుండగా టాయిలెట్ వస్తుందని చెప్పిన నారాయణరావు.. చెరువులో దూకాడు. రాత్రంతా వెతికినా డెడ్ బాడీ దొరకలేదు. ఉదయం ఫైర్ , పోలీస్ సిబ్బంది గజ ఇతగాళ్లతో వెతకగా బాడీ దొరికింది. నారాయణరావు చేసిన తప్పుకి పశ్చాత్తాపంతో సిగ్గుపడి ఆత్మహత్య ప్రయత్నం చేసి ఉండొచ్చు లేదా అనుకోకుండా చెరువులో పడిపోయి ఉండొచ్చు అని భావిస్తున్నాం అన్నారు పోలీసులు. స్కూల్ ఎదుట ఆందోళనకు దిగిన బాలిక బంధువులు తాతయ్యనని చెబితే ఎలా పంపించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు స్కూల్ ప్రిన్సిపాల్‌ను కూడా విచారించారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

◆ కొనుగోలు కేంద్రాలలో ధాన్యానికి కనీస మద్దతు ధర ◆ కొనుగోలు కేంద్రాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలి ◆ కాల్వ శ్రీరాంపూర్, ఓదెల మండలాలలో మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణ రావు







**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, కొనుగోలు కేంద్రాలలో కనీస మద్దతు ధర చెల్లించి ధాన్యం కొనుగోలు చేస్తామని,రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలో, ఓదెల మండలం పోత్కపల్లి గ్రామంలో గురువారం రోజున వ్యవసాయ మార్కెట్ లో డి.సి.ఏం.ఎస్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కేంద్రాలను, సుల్తానాబాద్ మార్కెట్ లో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్, స్థానిక నాయకులతో కలిసి పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ రమణా రావు మాట్లాడుతూ రైతులు దళారీల చేతుల్లో మోసపోకుండా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభించిందని అన్నారు. 14 శాతం తేమతో 2400 రూపాయలు మొక్కజొన్నలకు ప్రభుత్వ మద్దతు ధర ప్రకటించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని ఎప్పుడు రైతుల మేలు కోరుతుందని మొక్కజొన్నలు, పత్తి ,వరి, మిర్చి, పొద్దు తిరుగుడు రైతులు ఏ పంట పెట్టిన ఆ పంటకు ప్రభుత్వం మద్దతు ఇచ్చి రైతులను పంట నష్టపోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాపాడుతుందని అన్నారు. మాజీ మంత్రి హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వము ఈ రాష్ట్రంలో 22 నెలల కాలంలో చేస్తున్న అభివృద్ధి చూసి ఓర్వలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడన్నారు. బిఆర్ఎస్ నాయకులు ఎన్ని తప్పుడు ఆరోపణలు చేసిన ఈ తెలంగాణ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎన్నో సంక్షేమ పథకాలతో ముందుకు పోతుందని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు 24 గంటలు రైతులకు కరెంటు ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నారు. ఇప్పటికే 200 యూనిట్ల కరెంటు మాఫీ, రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు, రేషన్ కార్డులు, 10 లక్షల ఆరోగ్యశ్రీ, మహిళలకు జీరో వడ్డీకి రుణాలు, సన్న వడ్లకు బోనస్ ఎన్నో పథకాలతో ముందుకు పోతుంది అన్నారు. గత వేసంగి, ప్రస్తుత వర్షాకాలం పంటలకు ప్రభుత్వం సన్న వడ్లకు బోనస్ ఇవ్వబోతుందని అన్నారు. వ్యవసాయం చేయడంలో రైతును మించిన అనుభవజ్ఞుడు ఎవరు లేరన్నారు. భూమిలో ఏ పంట పెడితే పండుతుందో రైతు ఆ మట్టిని బట్టి చెప్పుతాడని అన్నారు. త్వరలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కూడా ప్రారంభించి గింజ కటింగ్ లేకుండా వారి ధాన్యం కొనుగోలు జరుగుతాయని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తో పాటు స్వయాన రైతు అయిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రతినిత్యం రైతుల కోసమే ఆలోచన చేస్తూ వారి సంక్షేమం కోసం ఎన్నో గొప్ప గొప్ప మార్పులు తీసుకొస్తున్నారని అన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో గత పాలకులు రైతుల దగ్గర క్వింటాలు వడ్లకు 10 కిలోల పైన తరుగు పెట్టీ వారి నడ్డివిరిచారని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాను శాసనసభ్యుడుగా ఎన్నికైన తర్వాత పెద్దపల్లి నియోజకవర్గంలో ఎలాంటి తరుగు లేకుండా చేసి రైతన్నలకు మేలు చేశామని ప్రజలకు గుర్తు చేశారు. అనంతరం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వరి పంటకు మద్దతు ధర పట్టిక పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణు, పెద్దపల్లి జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, డి సి ఓ శ్రీమలా, డి ఎం ఓ ప్రవీణ్, డి ఎస్ ఓ శ్రీకాంత్, తహసిల్దార్లు, మార్కెట్ చైర్మన్లు మినుపల ప్రకాష్ రావు, ఈర్ల స్వరూప, మాజీ ఎంపీపీ గోపగాని సరయ్య గౌడ్, మూల ప్రేమ సాగర్ రెడ్డి, అల్ల సుమన్ రెడ్డి, శ్రీగిరి శ్రీనివాస్, రాంచంద్రం రెడ్డి, సబ్బు రాయమలు, ఉస్టమ్ గణేష్, చిలుక సతీష్, గజావేనా సదయ్య, అబ్బయ్య గౌడ్, సైరి మహేందర్, సింగిల్ విండో, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మాజీ సర్పంచ్ లు, ఎంపీటీసీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భూ గర్భ జల సంరక్షణలో భాగంగా ఇంటింటా ఇంకుడు గుంతలు

◆ అదనపు కలెక్టర్ జె అరుణశ్రీ



**గోదావరి ఖని టౌన్ (ది క్రైమ్ న్యూస్):** భూగర్భ జల సంరక్షణ లో భాగంగా ఇంటింటా ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా ప్రజలను చైతన్య పరచాలని అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) , రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణశ్రీ అన్నారు. రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో వార్డు అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు . ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకం జల శక్తి అభియాన్ లో భాగంగా రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో డిసెంబర్ 31 నాటికి పది వేల ఇంకుడు గుంతలు నిర్మించడం లక్ష్యం గా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా వార్డు అధికారులు తమ సహాయకులు, ఆర్ పి ల సహకారంతో ఇంటింటా సర్వే చేసి ఇంకుడు గుంతలు ఉన్న ఇళ్ల వివరాలు , లేని వివరాలతో పాటు , ఆ ఇంట్లో నిర్మించడానికి అవకాశం ఉందా లేదా అనే సమాచారం ఈ నెలాఖరు లోగా సేకరించి ఇవ్వాలని ఆదేశించారు. అవకాశం ఉన్న చోట నగర పాలక సంస్థ ద్వారా ఇంకుడు గుంత నిర్మించడం జరుగుతుందని అన్నారు. ఇంకుడు గుంత స్వయంగా నిర్మించుకోవడానికి యజమాని ముందుకు వస్తే ఆస్తి పన్నులో పది శాతం రాయితీ కి కూడా అర్హులవుతారని ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. అలాగే నల్లా కనెక్షన్ వివరాలు అమృతం యాప్ లో నమోదు చేయాలని అన్నారు. పైలట్ ప్రాజెక్ట్ కింద ఎన్ టి పి సి హెలిపాడ్ ట్యాంక్ పరిధిలో త్వరలో 24 గంటల మంచి నీరు అందించడానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ మారుతి ప్రసాద్, నగర పాలక సంస్థ సూపరింటెండింగ్ ఇంజనీర్ గురువీర, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామన్, సెక్రెటరీ ఉమా మహేశ్వర్ రావు, అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎ సి పి శ్రీ హరి ఆర్ ఓ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల ద్వారానే మద్దతు ధర పొందండి

◆ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



**గన్నేరువరం, అక్టోబర్ 23(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం గుండ్లపల్లి, గునుకుల కొండాపూర్, చీమలకుంటపల్లి, జంగపల్లి, హన్మాజీపల్లె, గోపాల్ పూర్, మాదాపూర్, గన్నేరువరం గ్రామాల్లో జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం ప్రారంభించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియ చేపట్టి, కేంద్రాల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన సదుపాయాలు కల్పించాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. సీజన్ లో వరిధాన్యం దిగుబడులకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొంటామని, దళారులకు విక్రయించకుండా కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం మద్దతు ధరను పొందాలని ఎమ్మెల్యే రైతులను కోరారు. మండల వ్యవసాయ అధికారి జె.కిరణ్మయి, మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, కేడీసీసీ డైరెక్టర్ అలువాల కోటి, నాయకులు అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, కొమ్మెర రవీందర్ రెడ్డి, లింగాల మల్లారెడ్డి, చిట్టి ఆనంద్ రెడ్డి, మాతంగి అనిల్, రజాక్ తదితరులు ఎమ్మెల్యేతో పాటు ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

# సిబ్బంది జీతాలు వాడుకున్న కార్యదర్శి అరెస్ట్




**ఇల్లంతకుంట, అక్టోబర్ 23(ది క్రైమ్ న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం ఓగులాపూర్ గ్రామపంచాయతీ మాజీ కార్యదర్శి సయ్యద్ ముక్తార్ అహ్మద్ ను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సిరిసిల్ల అశోక్ తెలిపారు. ఒగులాపూర్ కార్యదర్శిగా 2025 జనవరి నుండి మే నెల వరకు తమకు జీతాలు ఇవ్వలేదంటూ మల్టీ పర్పస్ సిబ్బంది గతంలో కలెక్టర్ కు విజ్ఞప్తి చేసుకోగా సిబ్బంది జీతం మొత్తం1,42వేలను తన వ్యక్తిగత అవసరాల కోసం కార్యదర్శి వాడుకున్నట్లు పంచాయతీరాజ్ అధికారుల విచారణలో తేలింది. దీంతో ఎంపిఓ మాణిక్యరావు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కార్యదర్శి ముక్తార్ అహమ్మద్ పై కేసు నమోదు చేసి విచారణానంతరం గురువారం అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్ కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

# శ్రీకాకుళం జిల్లాల్లో డీఐజీ ఆకస్మిక తనిఖీలు

## వార్షిక తనిఖీల్లోనే భాగమేనని వెల్లడి

**అమరావతి, అక్టోబర్23 :** వార్షిక తనిఖీల్లో భాగంగా శ్రీకాకుళం జిల్లాలో పలు పోలీస్ స్టేషన్లను విశాఖ డీఐజీ గోపీనాథ్ జెట్టి తనిఖీలు చేశారు. పీఎస్ లలో కేసుల పురోగతి, సిబ్బంది పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్ లో ఇన్స్పెక్షన్ చేసామని చెప్పారు. ప్రాపర్టీ అఫెన్సస్ ఎక్కువగా ఉన్నాయని.. వాటిలో పురోగతి ఆశించిన మేర లేదని చెప్పారు. పోక్సో చట్టాలపై విద్యా సంస్థల్లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మిగతా శాఖలతో కలిసి మరింత అవగాహన కల్పిస్తామని చెప్పారు. సైబర్ క్రైం పై ప్రత్యేక దృష్టి సారిస్తామన్న ఆయన.. సోషల్ మీడియా పోస్టులపై నిఘా పెడతామని చెప్పారు. ఫేక్ ఐడీలతో ఇతరులకు ఇబ్బంది కలిగించే పోస్టులు పెడితే చర్యలు తప్పవన్నారు. గంజాయి రవాణాపై గట్టి నిఘా పెట్టామని.. వినియోగం పైనా దృష్టి సారిస్తున్నామని చెప్పారు. అధిక వడ్డీలకు ఆశపడి ఫేక్ వాట్సాప్ మెసేజ్ లు, మెయిల్స్ నమ్మవద్దన్నారు. ఉత్తరాంధ్రలో మావోయిస్టు ప్రాబల్యం లేదని తెలిపారు. ఈ ప్రాంతానికి చెందిన వారు మావోయిస్టు ఉద్యమంలో ఉంటే బేషరతుగా లొంగిపోవాలని ఇప్పటికే పిలుపునిచ్చామని వివరించారు.

# ఉద్యోగ విరమణ అనేది అనివార్యం

- ఉద్యోగ విరమణ పేరుతో ఒక మంచి కళాకారుడిని కోల్పోవడం బాధాకరం
- ఓ.సి.పి-వన్ కన్వేయర్ ఆపరేటర్ కొండ్ర రాధాకృష్ణకు ఘనంగా సన్మానం



**రామగిరి, అక్టోబర్ 23(ది క్రైమ్ న్యూస్):-** త్వరలో ఉద్యోగ విరమణ చేయబోతున్న సింగరేణి కళాకారుడు ఆర్.జి-త్రీ ఏరియా ఓ.సి.పి-వన్ కన్వేయర్ ఆపరేటర్ కొండ్ర రాధాకృష్ణ ను ఘనంగా సన్మానించారు. సెంటినరీ కాలనీ సి.ఈ.ఆర్ క్లబ్ లో నిర్వహిస్తున్న భూపాలపల్లి ,ఆర్.జి-త్రీ ఏరియా ల ప్రాంతీయ స్థాయి సాంస్కృతిక పోటీలలో నిరీక్షణ క్రియేషన్స్ అధినేత చంద్రపాల్ ఆధ్వర్యంలో రెండు ఏరియాల కళాకారులు రాధాకృష్ణ ను ఘనంగా సన్మానించారు.. ఈ సందర్భంగా ముఖ్య అతిధులు కవ్వంపల్లి స్వామి,పర్స శ్రీనివాస్ లు మాట్లాడుతూ రాధాకృష్ణ ఒక క్రమశిక్షణ కలిగిన క్రీడా, కళాకారుడని, 1992 లో సింగరేణి సంస్థలో ఉద్యోగంలో చేరినప్పటి నుండి కళలలో రాణిస్తూనే క్యారంబోర్డు,టేబుల్ టెన్నిస్, హాకీ క్రీడాకారుడిగా రాణించి కోల్ ఇండియా స్థాయి పోటీలలో పాల్గొని పలు పతకాలు సాదించడాని, కోల్ ఇండియా సాంస్కృతిక పోటీలలో జానపద గాయకుడిగా,గజల్ గాయకుడిగా పాల్గొని పతకాలు సాదించడాని కొనియాడుతూ ఉద్యోగ విరమణ పేరుతో ఒక మంచి కళాకారుడిని కోల్పోవడం బాధాకరమైన ఉద్యోగ విరమణ అనేది అనివార్యమని అన్నారు.కాగా ప్రాంతీయ స్థాయి సాంస్కృతిక పోటీలలో కళాకారుల ప్రదర్శనలు పలువురిని ఆకర్షించాయి.ఈ కార్యక్రమంలో కళాకారులు ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, స్పోర్ట్స్ సూపర్ వైజర్ పర్స శ్రీనివాస్, నిరీక్షణ క్రియేషన్స్ బాద్యులు చంద్రపాల్, మేజిక్ రాజా లతోపాటు అంజి, దేవయ్య, కే. ఎల్.ఎన్. ప్రసాద్, సదానందం, తాళ్లపల్లి నారాయణ, ఆడిచర్ల శ్రీనివాస్, మహేందర్, రాయమల్లు లతోపాటు రెండు ఏరియా ల కళాకారులు పాల్గొని రాధాకృష్ణ కు శుభాకాంక్షలు తెలియజేశారు.

# నాణ్యతలో అధికారుల సూచనలు తప్పనిసరి: ఎమ్మెల్యే కవ్వంపల్లి



**తిమ్మాపూర్, అక్టోబర్ 23(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రేణిగుంట, కొత్తపల్లి, మక్తపల్లి, పర్లపల్లి, మొగిలిపాలెం, పోలంపల్లి గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం ప్రారంభించారు. ధాన్యాన్ని ఎండలో ఆరబెట్టి తేమ లేకుండా చూసుకుని నాణ్యత విషయంలో అధికారుల సూచనలు తప్పకుండా పాటించాలని, రైతులకు మేలు చేకూర్చాలనే ఉద్దేశంతోనే ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2389, సాధారణ రకానికి రూ.2369 మద్దతు ధర కల్పిస్తూ సన్న రకానికి క్వింటాలుకు రూ. 500 అదనంగా బోనస్ అందిస్తామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నిర్వాహకులను కోరారు.మండల అధికారులు, ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్యే వెంట ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

# భారీ వర్షాలపై సీఎం టెలికాన్ఫరెన్స్

## ప్రత్యేక నిధుల విడుదలకు ఆదేశాలు జారీ

**అమరావతి, అక్టోబర్23 :** రాష్ట్రంలో వర్ష ప్రభావ పరిస్థితులపై సీఎం నారా చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. తాజాగా రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై దుబాయ్ నుంచి అధికారులతో మరోమారు సీఎం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. తీసుకోవాల్సిన చర్యలపై మంత్రులు, సీఎస్, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో మాట్లాడారు. వర్ష ప్రభావిత నెల్లూరు, ప్రకాశం, కడప, తిరుపతి, అన్నమయ్య జిల్లాల పరిస్థితిపై ఆయా జిల్లాల కలెక్టర్లు, ఆర్టీజీఎస్ అధికారులతో ముఖ్యమంత్రి చర్చించారు. నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాలకు రూ.2 కోట్ల చొప్పున, మిగతా వర్ష ప్రభావిత జిల్లాలకు రూ.1 కోటి చొప్పున అత్యవసర నిధుల మంజూరుకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను పంపాలని సూచనలు చేశారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. రెవెన్యూ, డిజాస్టర్, పోలీస్, ఇరిగేషన్, మున్సిపల్, ఆర్ అండ్ బి విద్యుత్ శాఖలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు సీఎం. లోతట్టు ప్రాంతాల్లోని వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. రిలీఫ్ కేంద్రాల్లో బాధితులకు నాణ్యమైన ఆహారం, పిల్లలకు పాలు అందించాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాలలో ఇప్పటికే కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్టు సీఎంకు కలెక్టర్లు వివరించారు. కాలువ, చెరువు గట్లకు గండ్లు పడకుండా బలహీనంగా ఉన్న చోట్ల పటిష్ట పరచాలని.. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా చూడాలని సీఎం ఆదేశించారు. పంట నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు.

# బిజీబిజీగా చంద్రబ్రాబు రెండోరోజు పర్యటన

## అబుదాబిలో పలువురు పారిశాపారిశ్రామికవేత్తలతో భేటీ

**అమరావతి, అక్టోబర్23:** రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడులే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విదేశీ పర్యటనను కొనసాగిస్తున్నారు. రెండో రోజు పర్యటనలో భాగంగా గురువారం అబుదాబీలో పర్యటించారు. అబుదాబీలోని పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ విభాగాల ప్రతినిధులతో సీఎం నారా చంద్రబాబు నాయుడు భేటీ అయ్యారు. మొత్తం తొమ్మిది కీలక మీటింగ్‌లు, విజిట్‌లలో సీఎం చంద్రబాబు బృందం పాల్గొనుంది. ముఖ్యంగా పెట్టుబడులపై స్థానిక పారిశ్రామికవేత్తలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు. అబుదాబీ నేషనల్ ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, అబుదాబీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ అహ్మద్ జైసిమ్ అల్ జాబీ, జీ 42 సీఈఓ మన్సూర్ అల్ మన్సూరీ, అబుదాబీ ఇన్వెస్ట్‌మెంట్ విభాగం చైర్మన్ ఖలీఫా ఖౌరీతో చంద్రబాబు భేటీ కానున్నారు. ఈ సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు, పారిశ్రామిక భాగస్వామ్యాలు, టెక్నాలజీ సహకారం వంటి అంశాలపై చర్చలు జరగనున్నాయి.అదే విధంగా లులూ గ్రూప్ సీఎండీ యూసఫ్ అలీ, అగితా గ్రూప్ సీఈఓ సల్మీన్ అల్ మెరీ, మస్దార్ సిటీ సీఈఓ మహ్మద్ జమీల్ అల్ రమాహిలతో సీఎం చంద్రబాబు ప్రత్యేక సమావేశాలు జరపనున్నారు. ఈ సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్‌లో రిటైల్, ఇంధనం, పర్యావరణ అనుకూల ప్రాజెక్టులలో పెట్టుబడులపై చర్చ జరగనుంది. అబుదాబీలోని యాస్ ఐల్యాండ్ పర్యాటక ప్రాజెక్టులను సందర్శించి, ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగ అభివృద్ధి దిశగా ఆలోచనలు పంచుకోనున్నారు. చివరిగా, భారత కౌన్సిల్ జనరల్ నివాసంలో ముఖ్యమంత్రి గౌరవార్థం ఏర్పాటు చేసిన విందుకు చంద్రబాబు హాజరుకానున్నారు.

# “అక్రమ అరెస్టుతో ఉద్యమాన్ని ఆపలేరు బీసీల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుంది!”

**హైదరాబాద్ (ది క్రైమ్ న్యూస్):** గురువారం తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్ గారి ఆధ్వర్యంలో, బీసీలకు 42% రిజర్వేషన్ల బిల్లును గవర్నర్ ఆమోదించాలనే డిమాండ్‌తో రాజ్ భవన్ ముట్టడి కార్యక్రమం నిర్వహించగా, సంఘం నాయకులను పోలీసులు అరెస్టు చేసి ఎస్‌ఆర్ నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బీసీల హక్కుల కోసం జరుగుతున్న ఈ ఉద్యమాన్ని అణచివేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మేకపోతుల నరేందర్ గౌడ్ గారు తీవ్రంగా ఖండించారు. ఆయన మాట్లాడుతూ గవర్నర్ వద్ద 42% బీసీ రిజర్వేషన్ బిల్లును నెలల తరబడి పెండింగ్‌లో ఉంచడం సర్వథా అన్యాయం. సుప్రీంకోర్టు స్పష్టంగా మూడు నెలలకు మించి బిల్లులను గవర్నర్ వద్ద నిలిపివేయొద్దని పేర్కొంది. అయినా కూడా తెలంగాణ బీసీలకు సంబంధించిన కీలక బిల్లును ఎందుకు ఆమోదించడంలేదు?” అని ప్రశ్నించారు. తెలంగాణలో బీసీలు జనాభాలో 42% పైగా ఉన్నప్పటికీ, అధికారంలో, ఉద్యోగాల్లో, విద్యలో తగిన ప్రాతినిధ్యం దక్కడం లేదని ఆయన తెలిపారు. అందుకే 42% రిజర్వేషన్ బిల్లును ఆమోదించడం న్యాయం మాత్రమే కాదు, సామాజిక సమతుల్యతకు అవసరమని అన్నారు. అరెస్టులు, అణచివేతలతో



ఉద్యమాన్ని ఆపలేరు. బీసీల న్యాయమైన హక్కుల కోసం మా పోరాటం రాష్ట్రవ్యాప్తంగా మరింత వేగంగా కొనసాగుతుంది,” అని మేకపోతుల నరేందర్ గౌడ్ గారు హెచ్చరించారు. తద్వారా గవర్నర్ గారు వెంటనే బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించి, తెలంగాణ బీసీలకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లం లింగమూర్తి పటేల్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం మహిళ అధ్యక్షురాలు సౌజన్య గౌడ్, తెలంగాణ బిసి సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు మట్టా రాజు యాదవ్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరి గాని బిక్షపతి గౌడ్, తెలంగాణ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్ర శ్రీహరి ఎర్ర శ్రీహరి గౌడ్, తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పెంట అజయ్ పటేల్, తెలంగాణ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర దేశ గాని నాగరాజు, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కాడబోయిన మల్లేష్ యాదవ్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన ఉపాధ్యక్షులుయువజన కొత్త వినయ్ బాబు, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సరిత, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు పొన్నం ఉపేందర్ నాయుడు, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జ్ కాల్వ మధుబాబు, తెలంగాణ బిసి సంక్షేమ సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షులు యాగండ్ల రమేష్ గౌడ్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు బత్తుల మహేందర్ యాదవ్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు అంబదాస్, తెలంగాణ బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పురెళ్ల శ్రవణ్ పటేల్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చర్లపల్లి సురేష్ గౌడ్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం వేములవాడ నియోజకవర్గ అధ్యక్షులు మొగిలి కరుణాకర్, మహేష్, మల్లేష్ యాదవ్, తెలంగాణ బీసీ మానకొండూరు మండల అధ్యక్షులు ముఖ్యర సతీష్, చత్రపతి సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షులు శివకుమార్, వెంకన్న, అయితే రాజు, తదితరులు పాల్గొన్నారు.

# కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన







**తొర్రూరు, (ది క్రైమ్ న్యూస్):** కుష్టు వ్యాధి నిర్మూలనకు అందరూ ఐక్యంగా కృషి చేయాలని హైదరాబాద్ లెప్రసీ క్లినిక్, ట్రైనింగ్ సెంటర్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ సుజాత తెలిపారు. కుష్టు వ్యాధి నిర్మూలనపై డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్ నల్లకుంటలోని ప్రభుత్వ హైదరాబాద్ లెప్రసీ క్లినిక్, ట్రైనింగ్ సెంటర్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ సుజాత, జూనియర్ మెడికల్ ఆఫీసర్ సుష్మ లు ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. **ఈ సందర్భంగా డాక్టర్ సుజాత మాట్లాడుతూ...** కుష్టు వ్యాధి ప్రాణాంతకం కాకపోయినా అంగవైకల్యానికి దారి తీస్తుందని, ముందుగానే గుర్తిస్తే అంగవైకల్యం రాకుండా అరికట్టడం సులువు అవుతుందన్నారు. కుష్టు వ్యాధి అరికట్టడం చాలా సులువుగా మారినా వ్యాధిగ్రస్తులపై ప్రజల్లో, కుటుంబ సభ్యుల్లో వారిపై చిన్నచూపు కనిపిస్తుందన్నారు. లెప్రసీ వ్యాధిని ఎండిటి ద్వారా నివారించవచ్చన్నారం వ్యాధిగ్రస్తులకు శరీరం పాలిపోయి రాగి రంగు మచ్చలు, స్పర్శ లేకపోవడం, పాదాలు, చేతివేళ్లు తిమ్మి ర్లు వంటి లక్షణాలుంటాయన్నారు. బహుళ ఔషధ చికిత్స ద్వారా వ్యాధిని అరికట్టువచ్చున్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నందనాదేవి, వైద్యులు డాక్టర్ మీరాజ్,డాక్టర్ మానస, సిహెచ్‌ఓ కుసుమ విద్యాసాగర్, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వనాకర్ రెడ్డి, పిడిఎంఓ, ఎంఎల్ హెచ్ పి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అందరమూ రక్తదాన కార్యక్రమంలో పాల్గొందాం, ఇతరులకు సాయంగా నిలుద్దాం

- మంథని పోలీస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం
- సమాజాభివృద్ధికి, నేర నియంత్రణకు యువత పోలీస్‌తో భాగస్వామ్యం కావాలి
- డీసీపీ కరుణాకర్, ఏసీపీ ఎం. రమేష్

**రామగిరి, అక్టోబర్ 23(ది క్రైమ్ న్యూస్):-** రక్తదానమనేది ప్రాణాలను కాపాడుతుందని రక్తదానంపై అవగాహన పెంచుదాం అవసరమైనవారికి సమయానికి రక్తం అందుబాటులో వుండేలా చూద్దామన డీసీపీ కరుణాకర్, ఏసీపీ ఎం. రమేష్‌లు పిలుపునిచ్చారు. అమరవీరుల వారోత్సవాల సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ ఆదేశాల మేరకు, మంథని ఇన్స్పెక్టర్ పి. రాజు ఆధ్వర్యంలో మంథని పోలీస్ స్టేషన్ ఆవరణలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి డీసీపీ కరుణాకర్, ఏసీపీ గోదావరిఖని ఎం. రమేష్ ముఖ్య అతిథులుగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. పెద్దపల్లి డీసీపీ కరుణాకర్, ఏసీపీ గోదావరిఖని ఎం. రమేష్ లు మాట్లాడుతూ “రక్తదానం అనేది ప్రాణాలను కాపాడే పవిత్ర కర్తవ్యం. పోలీస్ వారోత్సవాల సందర్భంలో ప్రజల భద్రత, సేవా భావం, ఫ్రెండ్లీ పోలీసింగ్‌కి ప్రతీకగా ఇలాంటి కార్యక్రమాలు ప్రజలతో అనుబంధాన్ని పెంపొందిస్తాయి,” అన్నారు. రక్తదాన కార్యక్రమాలు విరివిగా ఏర్పాటు చేయడంద్వారా, రక్తదాన విశిష్టతను ప్రజలకు వివరించడంద్వారా ప్రజల్లో చైతన్యం పెంచాలని స్వచ్ఛంద సంస్థలను డీసీపీ కరుణాకర్, ఏసీపీ ఎం. రమేష్ లు కోరారు. సుదీర్ఘకాలంపాటు వ్యాధిగ్రస్థులైనవారికి క్రమంతప్పకుండా రక్తం అవసరమవుతూ వుంటుంది. వారికి సమయానికి రక్తం ఎక్కించకపోతే ప్రాణాలు పోయే ప్రమాదముంటుంది. కాబట్టి బ్లడ్ బ్యాంకుల్లో తగిన నిల్వలు వుండేలా చూసే బాధ్యత అందరిమీదా వుందని డీసీపీ కరుణాకర్, ఏసీపీ ఎం. రమేష్ లు వివరించారు. మనందరమూ రక్తాన్ని దానం చేసి ప్రాణాలు కాపాడుదామని కోరారు. ఒక ఆరోగ్యమైన వ్యక్తి తనకు 65 సంవత్సరాల వయస్సు వచ్చేంతవరకూ రక్తాన్ని దానం చేయవచ్చని, ప్రతి మనిషి మూడు నెలలకు ఒకసారి అంటే సంవత్సరానికి నాలుగు సార్లు రక్తదానం



చేయవచ్చని వివరించారు. రక్తాన్ని దానం చేయడంవల్ల దానం చేసినవారికి అనేక ఆరోగ్యకరమైన ప్రయోజనాలుంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రామగిరి ఎస్సై పి. దివ్య, ఏఎస్ఐ వినోద్, రామగిరి పోలీస్ సిబ్బంది, పన్నూర్ తాజా మాజీ చందం మహేష్, పన్నూర్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొని రక్తదానం చేశారు.

# అర్హులకు డబుల్ బెడ్రూంలు వెంటనే మంజూరు చేయాలి: జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మంగళపల్లి హుస్సేన్






**తొర్రూరు, (ది క్రైమ్ న్యూస్):** తొర్రూర్ డివిజన్ కేంద్రంలోని చర్లపాలెం రోడ్డులో ఏర్పాటుచేసిన డబల్ బెడ్ రూమ్లో ను ఈరోజు సందర్శించిన హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మంగళపెల్లి హుస్సేన్ టీం సభ్యులతో కలిసి డబుల్ బెడ్ రూములను పరిశీలన చేసి వారు గత కొద్దిరోజుల నుంచి చేస్తున్న దీక్షను సంఘీభావం తెలిపి మాట్లాడుతూ. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి. రాష్ట్ర మంత్రి. స్పందించి స్థానిక శాసన సభ్యురాలు ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అర్హులకు నిరుపేద కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డు అర్హులకు ప్రభుత్వ ఉద్యోగం లేని కుటుంబాలకు మాత్రమే డబల్ బెడ్రూంలో మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కొద్దిరోజుల నుంచి నిరంతర ప్రక్రియగా రాత్రింపగలు కష్టపడుతూ మహిళలు చేస్తున్న పోరాటానికి నిస్వార్థంగా అర్హులకు గుర్తించి స్థానిక అధికారుల సమక్షంలో ఎలాంటి వివక్షత లేకుండా కులమత బేధం లేకుండా పార్టీలకతీతంగా కేటాయించాలని హ్యూమన్ రైట్స్ కమిటీ ద్వారా కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు వైస్ ప్రెసిడెంట్ మిట్టపల్లి రాజకుమార్. గంధం లాలయ్య. మహబూబాబాద్ జిల్లా కమిటీ సభ్యులు గార వీరస్వామి. వరంగల్ జిల్లావేణు. నెల్లికుదురు మండలం శ్రీను. కృష్ణ. బాధితులు తదితరులు పాల్గొన్నారు.

# వర్ష ప్రభావ పరిస్థితులపై చంద్రబాబునాయుడు ఆరా

## దుబాయ్ నుంచి మరోమారు సీఎం టెలికాన్ఫరెన్స్

## జిల్లాలకు రూ.1 కోటి చొప్పున అత్యవసర నిధుల మంజూరు

**అమరావతి, అక్టోబర్23:** దుబాయ్ పర్యటనలో బిజీబిజీగా ఉన్నప్పటికీ రాష్ట్రంలో వర్ష ప్రభావ పరిస్థితులపై ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆరా తీస్తున్నారు తాజాగా రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై దుబాయ్ నుంచి అధికారులతో మరోమారు సీఎం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. తీసుకోవాల్సిన చర్యలపై మంత్రులు, సీఎస్, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో మాట్లాడారు. వర్ష ప్రభావిత నెల్లూరు, ప్రకాశం, కడప, తిరుపతి, అన్నమయ్య జిల్లాల పరిస్థితిపై ఆయా జిల్లాల కలెక్టర్లు, ఆర్టీజీఎస్ అధికారులతో ముఖ్యమంత్రి చర్చించారు. నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాలకు రూ.2 కోట్ల చొప్పున, మిగతా వర్ష ప్రభావిత జిల్లాలకు రూ.1 కోటి చొప్పున అత్యవసర నిధుల మంజూరుకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను పంపాలని సూచనలు చేశారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. రెవెన్యూ, డిజాస్టర్, పోలీస్, ఇరిగేషన్, మున్సిపల్, ఆర్ అండ్ బి విద్యుత్ శాఖలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు సీఎం. లోతట్టు ప్రాంతాల్లోని వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. రిలీఫ్ కేంద్రాల్లో బాధితులకు నాణ్యమైన ఆహారం, పిల్లలకు పాలు అందించాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో ఇప్పటికే కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్టు సీఎంకు కలెక్టర్లు వివరించారు. కాలువ, చెరువు గట్లకు గండ్లు పడకుండా బలహీనంగా ఉన్న చోట్ల పటిష్ట పరచాలని.. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా చూడాలని సీఎం ఆదేశించారు. పంట నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు.

# తెలంగాణ పదో తరగతి ఫీజుల షెడ్యూల్ విడుదల

**హైదరాబాద్, అక్టోబర్23:** తెలంగాణలో పదో తరగతి ఫైనల్ పరీక్ష ఫీజు చెల్లింపు తేదీలను డైరెక్టర్ స్కూల్ ఎడ్యుకేషన్ ప్రకటించింది. అక్టోబరు 30వ తేదీ నుంచి నవంబర్ 13 లోపు పాఠశాల హెడ్‌మాస్టర్లకు విద్యార్థులు ఫీజు చెల్లించాలని తెలిపింది. హెచ్ఎంలు ఆన్‌లైన్ ద్వారా నవంబర్ 14 లోపు ఫీజు చెల్లింపు చేయాలని, విద్యార్థుల డేటాను నవంబర్ 18 లోపు డీఈవోలకు అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. రూ.50 ఆలస్య రుసుముతో నవంబర్ 29 వరకు, రూ.200 ఆలస్య రుసుముతో డిసెంబరు 2 నుంచి 11వ తేదీవరకు, రూ.500 ఆలస్య రుసుముతో డిసెంబరు 15 నుంచి 29 వరకు పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లించేందుకు విద్యార్థులకు అవకాశం కల్పించారు.

# పోచారం కాల్పుల కేసును 12 గంటల్లోనే ఛేదించాం : సీపీ సుధీర్‌బాబు

**హైదరాబాద్, అక్టోబర్23 :** పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన కాల్పుల కేసును 12 గంటల్లోనే ఛేదించామని రాచకొండ సీపీ సుధీర్ బాబు తెలిపారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. యమ్నంపేట్ వద్ద అక్టోబర్ 22న సాయంత్రం కాల్పుల్లో గో రక్షక్ కార్యకర్త బిడ్ల ప్రసాంత్ అలియాస్ సోను సింగ్ తీవ్రంగా గాయపడ్డారన్నారు. గో రక్షక్ దళ్ కార్యకర్త ప్రశాంత్‌పై కాల్పులు జరిపిన నిందితులను అరెస్ట్ చేశామని తెలిపారు. ప్రధాన నిందితుడు ఏ1 మొహమ్మద్ ఇబ్రాహీం ఖురేషీని అరెస్టు చేశామని... అలాగే సహ నిందితులు ఏ3 కురువ శ్రీనివాస్, ఏ4 హసన్ బిన్ మోసిన్‌లను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. మరో నిందితుడు ఏ2 హనీఫ్ ఖురేషీ పరారీలో ఉన్నాడన్నారు. ఇబ్రాహీం.. పశువుల రవాణా వ్యాపారం చేస్తున్నాడని.. గోవుల అక్రమ రవాణా బయటపెట్టాడని ప్రశాంత్‌పై నిందితులు కక్ష పెట్టుకున్నారన్నారు. నిందితుడు ఇబ్రాహీం, బాధితుడు సోను సింగ్‌కు గతంలో పరిచయం ఉందని చెప్పారు. దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని అన్నారు. ఇబ్రాహీం 12 సంవత్సరాలుగా పశువుల రవాణా వ్యాపారం చేస్తున్నాడని.. ప్రశాంత్ గతంలో 6 సార్లు పశువుల అక్రమ రవాణా అడ్డుకున్నాడని తెలిపారు. దాంతో ఇబ్రాహీంకు 1 కోటి రూపాయల నష్టం వచ్చిందన్నారు. ఈ క్రమంలో సోనూ సింగ్ అలియాస్ ప్రశాంత్‌పై ఇబ్రాహీం కక్ష పెంచుకున్నాడన్నారు సీపీ. పశువులను రవాణా చేసుకోవాలంటే 5 లక్షలు ఇవ్వాలని ప్రశాంత్ డిమాండ్ చేశాడని నిందితులు చెబుతున్నారని.. దీనిపై అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నామని రాచకొండ సీపీ తెలిపారు. నిందితుడు శ్రీనివాస్.. సెటిల్ చేసుకుందాం, మాట్లాడుకుందామని చెప్పి ప్రశాంత్‌ను స్పాట్‌కు రప్పించాడని... మాట్లాడుకుందామని పిలిచి ఫైరింగ్ చేసి పారిపోయారన్నారు. పిస్టల్‌ను ఛత్తీస్‌గఢ్‌లో కొనుగోలు చేసినట్టు తమ దర్యాప్తులో తేలిందన్నారు. నిందితులు వాడిన వెహికల్ సీజ్ చేశామని... ఒక పిస్టల్, మూడు సెల్ ఫోన్స్ సీజ్ చేశామని తెలిపారు. ప్రస్తుతం ప్రశాంత్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. ఈ ఏడాది రాచకొండ కమిషనరేట్ పరిధిలో 5110 పశువుల్ని ఇప్పటి వరకు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సంవత్సరం పశువుల అక్రమ రవాణాకు సంబంధించి ఇప్పటి వరకు 288 కేసులు నమోదు చేసినట్లు రాచకొండ సీపీ సుధీర్ బాబు పేర్కొన్నారు.

# ఓడేడులో చోరీ





**ముత్తారం.అక్టోబర్.23.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండలం ఓడేడు గ్రామంలో దొంగతనం కలకలం రేపింది. గ్రామానికి చెందిన గుజ్జ జగ్గారావు అనే సింగరేణి విశ్రాంత ఉద్యోగి దసరా పండుగ సమయంలో అక్టోబర్ 2న గోదావరిఖనిలో తన కుమారుని వద్దకు వెళ్లారు. గురువారం మధ్యాహ్నం తిరిగి గ్రామానికి వచ్చి చూడగా ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో అనుమానం కలిగి పరిశీలించగా, ఇంట్లో దొంగతనం జరిగిన విషయం బయటపడింది. దీర్ఘకాలంగా ఇల్లు ఖాళీగా ఉండటాన్ని గమనించిన దుండగులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని చోరీకి పాల్పడ్డారని పోలీసులు అనుమానిస్తున్నారు .ఇంట్లో ఉన్న సుమారు 6 తులాల బంగారం,రూ.2.80 లక్షల నగదు మాయం అయినట్లు బాధితుడు గుజ్జరావ్ తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే మంథని సీఐ బి.రాజుగౌడ్, ముత్తారం ఎస్సై రవికుమార్ బృందంతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని డాగ్ స్క్వాడ్, ఫింగర్‌ప్రింట్ నిపుణులతో ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనతో ఓడెడు గ్రామంలో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఇది తాగితే ఆ సమస్యలన్నీ మటాష్



రోజూ మన డైట్‌లో అల్లం భాగం చేసుకోవడం వల్ల ఎన్నో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. అల్లం మీ టీతో పాటు ఆహారం రుచిని పెంచుతుంది. అయితే మీరు ఎప్పుడైనా అల్లం నీళ్లు తాగారా? ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఆరోగ్య ప్రయోజనాలను పొందడానికి అల్లం నీరు తాగడం సులభమైన మార్గం. ఆయుర్వేదంలో అల్లం ఔషధ గుణాలకు ప్రసిద్ధి. పురాతన వైద్యంలో అల్లం అనేక వ్యాధులను నయం చేయడానికి ఒక మూలికగా ఉపయోగించారన్న విషయం తెలిసిందే కదా..! అల్లంలో శరీరానికి అవసరమైన విటమిన్ సి, కాల్షియం, ఫాస్పరస్, ఐరన్, జింక్, కాపర్, మాంగనీస్, క్రోమియం వంటి పోషకాలు ఉన్నాయి. ముఖ్యంగా



ఉదయాన్నే ఖాళీ కడుపుతో అల్లం నీటిని తాగితే అల్లం వల్ల కలిగే ప్రయోజనాలన్నీ శరీరానికి అందుతాయి. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం 1. బరువు తగ్గుతారు ఖాళీ కడుపుతో అల్లం నీటిని తాగడం వల్ల జీవక్రియ వేగవంతం అవుతుంది. ఇది కొవ్వును వేగంగా కరిగించడంలో సహాయపడుతుంది. మీ శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపడానికి ఉపయోగపడుతుంది 2. షుగర్ బాధితులకు ప్రయోజనకరం: ఖాళీ కడుపుతో అల్లం నీరు తాగితే రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. అలాగే, రక్తంలో చక్కెర స్థాయి పెరగకుండా ఉంటుంది. ఇది మధుమేహం వల్ల వచ్చే సమస్యల నుండి బయటపడటానికి సహాయపడుతుంది. 3. చర్మానికి మేలు చేస్తుంది: అల్లం నీరు శరీరంలో పేరుకుపోయిన మురికి, టాక్సిన్స్ ను తొలగించడంలో సహాయపడుతుంది. అలాగే ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులకు కారణమయ్యే ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతాయి. చర్మంపై దద్దుర్లు, మొటిమలు, ముడతలు వంటి వృద్ధాప్య సంకేతాలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది మీ రక్తాన్ని సహజంగా శుద్ధి చేయడంలో యూజ్ అవుతుంది 4. ఇన్‌ఫ్లమేటరీ సమస్యలు దూరం : అల్లం శరీరంలోని ఇన్‌ఫ్లమేటరీ సమస్యలను దూరం చేయడంలో సహాయపడుతుంది. అల్లం వాపును కలిగించే సూక్ష్మజీవులు, హానికరమైన బ్యాక్టీరియాతో పోరాడటానికి సహాయపడుతుంది. 5. పొట్టకు మేలు చేస్తుంది: ఖాళీ కడుపుతో అల్లం నీటిని తాగడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. దీని కారణంగా, అజీర్ణం, మలబద్ధకం, ఉబ్బరం, వాంతులు, విరేచనాలు, వికారం వంటి సమస్యలను తొలగించడంలో ఇది చాలా ప్రభావవంతంగా ఉంటుంది. అదనంగా, అల్లం చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. దీని వల్ల గుండెపోటు, పక్షవాతం వంటి వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించి గుండె ఆరోగ్యంగా ఉంచుతుంది.

## ఇదేం చేస్తుందిలే అని చీప్‌గా చూడకండి..

### ఆ సమస్యలకు పవర్‌ఫుల్ వెపన్.. డైలీ జ్యూస్ తాగితే..



ఉరుకులు పరుగుల జీవితంలో ఎన్నో అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. అందుకే ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు మంచి జీవనశైలిని అవలంభించాలని.. ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అయితే.. ఆరోగ్యానికి మేలు చేసే దుంపల్లో బీట్‌రూట్ ఒకటి.. బీట్‌రూట్ తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. వాస్తవానికి బీట్ రూట్‌ను సలాడ్‌గా తీసుకుంటారు. కొందరు బీట్ రూట్ మామూలుగా తింటే.. మరికొందరు జ్యూస్ చేసుకుని తాగుతారు. బీట్‌రూట్‌లో ఐరన్, సోడియం, సెలీనియం, మెగ్నీషియం వంటి అనేక పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి శరీరం అనేక వ్యాధులతో పోరాడటానికి సహాయపడుతుంది.. రోజూ బీట్‌రూట్ జ్యూస్ తాగడం వల్ల రక్తపోటు అదుపులో ఉండటమే కాకుండా కొవ్వు మొదలైన వాటిని తగ్గించడంలో సహాయపడుతుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అందుకే బీట్ రూట్ ను తప్పనిసరిగా తీసుకోవాలంటున్నారు. బీట్ రూట్ రెగ్యులర్‌గా తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలేంటో ఇప్పుడు తెలుసుకోండి.. బ్లడ్ ప్రెజర్ కంట్రోల్: బీట్‌రూట్ జ్యూస్ తాగడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. ఇందులో నైట్రేట్ ఉండటం వల్ల శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్ ఉత్పత్తికి సహాయపడుతుంది. బరువు నియంత్రణ: బీట్‌రూట్ రసంలో కొవ్వు, కేలరీలు తక్కువగా ఉంటాయి. ఇది బరువు తగ్గడానికి సహాయ పడుతుంది. ఉదయాన్నే దీన్ని తాగడం వల్ల రోజంతా శరీరానికి శక్తి లభిస్తుంది. కాలేయానికి మేలు చేస్తుంది: బీట్‌రూట్‌లోని బీటైన్ అనే యాంటీ ఆక్సిడెంట్ కాలేయంలో కొవ్వు ఆమ్లాలు పేరుకుపోకుండా చేస్తుంది. ఇది కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. నాడీ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది: బీట్‌రూట్‌లో పొటాషియం పుష్కలంగా లభిస్తుంది. ఇది శరీరంలోని కండరాలు, నాడీ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. గుండెకు మేలు చేస్తుంది: బీట్‌రూట్ రసం తాగడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. అలాగే శరీరంలో ప్లాస్మా నైట్రేట్ స్థాయిలను పెంచుతుంది. ఇది శరీరం స్టామినాను పెంచుతుంది. క్యాన్సర్ ప్రమాదం తగ్గుతుంది: బీట్‌రూట్ రసంలో యాంటీఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. ఇది క్యాన్సర్ ప్రమాదం నుండి శరీరాన్ని రక్షించడంలో సహాయపడుతుంది.



## వామ్మో.. రక్తహీనతతో బాధపడుతున్నారా..? డేంజర్ జోన్ నుంచి బయటపడాలంటే ఇలా చేయండి



ఉరుకులు పరుగుల జీవితంలో ఎన్నో అనారోగ్య సమస్యలను ఎదుర్కోవలసి వస్తోంది.. ముఖ్యంగా పేలవమైన జీవనశైలి, అనారోగ్యమైన ఆహారం.. పని ఒత్తిడి.. ఇవన్నీ రోగాల బారిన పడేలా చేస్తున్నాయి. శరీరానికి కావలసిన పోషకాలు, విటమిన్లు అందకపోతే.. ప్రమాదంలో పడినట్లే.. అందుకే.. తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలంటున్నారు వైద్య నిపుణులు.. అయితే, శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి, మీ శరీరంలో తగినంత ఐరన్ ఉండటం చాలా ముఖ్యం. ఇనుము లోపం మీ ఆరోగ్యాన్ని తీవ్రంగా పాడు చేస్తుంది. శరీరంలో విటమిన్లు పుష్కలంగా ఉండటానికి కొన్ని ఆహారాలను తీసుకోవాలి.. ఐరన్ లోపాన్ని నివారించేందుకు ఎలాంటి ఆహారం తీసుకోవాలో ఇప్పుడు తెలుసుకోండి.. ఐరన్ లోపాన్ని నివారించేందుకు ఇవి తినండి.. దానిమ్మ: శరీరంలో విటమిన్లు, ఖనిజాలు ఉండటం చాలా ముఖ్యం. వీటి లోపం వల్ల అనేక వ్యాధులను ఎదుర్కోవాల్సి వస్తుంది. శరీరంలో ఐరన్ లోపం వల్ల అనేక రకాల సమస్యలు వస్తాయి. శరీరంలో ఐరన్ తక్కువగా ఉన్నప్పుడు, చాలా బలహీనత ఉంటుంది. ఐరన్ లోపం ఉన్నవారు ఆహారంలో దానిమ్మను చేర్చుకుంటే చాలా మంచిది.. దీనివల్ల రక్తహీనత సమస్య నుంచి బయటపడొచ్చు.. గుడ్డు: ఐరన్ లోపం ఉన్నవారు ఉదయం అల్పాహారంగా కూడా గుడ్లు తీసుకోవాలి. గుడ్లలో మంచి మొత్తంలో ప్రొటీన్లు, విటమిన్లు, మినరల్స్, ఐరన్ ఉంటాయి. దీని వల్ల శరీరంలో ఐరన్ లోపం ఏర్పడదు.. గుడ్లలో విటమిన్ డి కూడా లభిస్తుంది. ఐరన్ లోపం ఉన్నవారు తప్పనిసరిగా గుడ్లు తినాలి. రెగ్యులర్ గా మీ ఆహారంలో ఒక గుడ్డును చేర్చుకోండి.. బీట్‌రూట్: రోజూ బీట్‌రూట్ తీసుకోవడం వల్ల మీ శరీరంలోని రక్తహీనత తొలగిపోతుంది. ఇనుము లోపం నయమైతే, అనేక వ్యాధులు కూడా నయమవుతాయి. రోజూ బీట్‌రూట్ జ్యూస్ తాగితే శరీరంలో ఐరన్ లోపాన్ని నివారించవచ్చు.. బీట్‌రూట్ తినడం వల్ల హిమోగ్లోబిన్ పెరుగుతుంది. ఇది మీ కడుపులో మంచి బ్యాక్టీరియాను పెంచడంలో కూడా చాలా సహాయపడుతుంది. పాలకూర: పాలకూరలో కూడా ఐరన్ పుష్కలంగా ఉంటుంది. దీన్ని ప్రతిరోజూ మీ ఆహారంలో చేర్చుకోవడం చాలా మంచిది. పాలకూరలో కాల్షియం, సోడియం, ఖనిజ లవణాలు, క్లోరిన్, ఫాస్పరస్, అనేక ఇతర ముఖ్యమైన పోషకాలు ఉన్నాయి. ఇవి మీ శరీరాన్ని ఇనుము లోపం నుంచి దూరంగా ఉంచుతాయి. ఇంకా ఒత్తిడిని తగ్గించడం ద్వారా మీ శరీరాన్ని రిలాక్స్ చేయడంలో కూడా ఇవి సహాయపడతాయి. పండ్లు కూరగాయలు: తాజా పండ్లు, కూరగాయలు మీ శరీరానికి చాలా ఉపయోగకరంగా ఉంటాయి. అనేక వ్యాధుల నుండి మిమ్మల్ని దూరంగా ఉంచడంలో సహాయపడతాయి. తాజా, పండ్లు కూరగాయల్లో ఐరన్ ఎక్కువ పరిమాణంలో ఉంటుంది. కావున వీటిని ప్రతిరోజూ తింటే ఈ సమస్య నుంచి బయటపడొచ్చు..

## గుడ్లలో కంటే ఎక్కువ ప్రోటీన్ కావాలా..? అయితే ఈ పప్పులను తినండి.. ఇక నో టెన్షన్..



శరీరాన్ని ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉంచుకోవడానికి విటమిన్లు, మినరల్స్‌తో పాటు ప్రొటీన్లు కూడా చాలా అవసరం. శరీరంలో రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి ప్రోటీన్ సహాయపడుతుంది. అయితే, శరీర అభివృద్ధి నుంచి రోగనిరోధక శక్తిని పెంచడానికి ప్రోటీన్ తోపాటు విటమిన్లు చాలా సహాయపడతాయి. ప్రోటీన్ మూలాలలో ఒకటి గుడ్లు.. చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ రోజుకు కనీసం 1 గుడ్డు తినాలని వైద్యులు సూచిస్తున్నారు. అయితే, తృణధాన్యాల్లో (పప్పులు) గుడ్ల కంటే ఎక్కువ ప్రొటీన్లు ఉంటాయి. అయితే, చాలామంది గుడ్లు తినరు లేదా మాంసాహారం తీసుకోరు.. అలాంటి వారికి ప్రొటిన్ లోపం ఉంటుంది.. అలాంటి వారు శరీరంలో ప్రొటీన్ స్థాయిలను నిర్వహించడానికి వారు పప్పులను తినవచ్చు. కొన్ని పప్పుల్లో గుడ్లు కంటే ఎక్కువ ప్రొటీన్లు ఉంటాయని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. పప్పులలో ప్రొటీన్లు ఎక్కువగా ఉంటాయి. దీనిని అన్నం లేదా రొట్టెలతో తినవచ్చు. పప్పు చాలా మందికి సులభంగా జీర్ణం కాదు. అలాంటప్పుడు పప్పు చారు తినడం వల్ల శరీరానికి ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయి. పప్పు ఆరోగ్యానికి చాలా మంచిది. కందిపప్పు, మసూర్ పప్పు, పెసర పప్పులో గుడ్ల కంటే ఎక్కువ ప్రొటీన్లు ఉంటాయని చెబుతున్నారు. కాబట్టి తల్లులు, అమ్మమ్మలు ఉపవాసం ఉన్నప్పుడు, శనగపప్పు ఉడకబెట్టి తింటారు. తద్వారా శరీరంలో ప్రోటీన్ లోపం ఉండదు. ముఖ్యంగా పెసర పప్పు కూడా బరువు తగ్గడంలో సహాయపడుతుంది. అంతే కాకుండా గుండె ఆరోగ్యాన్ని కూడా కాపాడుతుంది. కాబట్టి డైట్‌లో ఉన్నవారు కూడా పెసరపప్పు తింటే ప్రొటీన్ లెవెల్స్ అదుపులో ఉంటాయి జిమ్, యోగా లేదా ఇతర శారీరక శ్రమలలో పాల్గొనే వారికి పెసరపప్పు, కందిపప్పు, శనగల మొలకలు చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. ఎందుకంటే ఇందులో అధిక ప్రొటీన్‌తో పాటు క్యాల్షియం, ఐరన్ తగినంత మొత్తంలో ఉంటాయి. ఇంకా వీటిని కూరగా లేదా.. ఉడకబెట్టుకుని కూడా తినవచ్చు.. అందుకే డైలీ ఒక కప్పు పప్పును తింటే శరీరానికి ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

## రొమాన్స్ పండు.. ఉదయాన్నే పరగడుపున తింటే ఆ సమస్యలకు చెక్ పెట్టినట్లే.. ట్రై చేయండి..



ప్రస్తుత కాలంలో ఎన్నో సమస్యలు వెంటాడుతున్నాయి. కావున ఆరోగ్యంపై దృష్టిసారించడం మంచిది.. అందుకే ఆరోగ్యానికి మేలు చేసే పండ్లను తినాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అలాంటి పండ్లలో కర్బూజ ఒకటి.. దీనిలోని పోషకాలు శరీరాన్ని ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి. కర్బూజ పండులో నీటిశాతం ఎక్కువ.. కావున దీన్ని తినడం ద్వారా హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. అయితే, ప్రతి రోజూ ఉదయాన్నే కర్బూజ తినడం వల్ల చాలా వ్యాధులకు చెక్ పెట్టవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు.. ముఖ్యంగా వేసవి కాలంలో కర్బూజను తినడం వల్ల అనేక వ్యాధులు వచ్చే ప్రమాదం కూడా తగ్గుతుంది. శరీరంలో నీటి కొరతను, పోషకాల కొరతను నివారించాలంటే దీనిని తప్పనిసరిగా తినాలి.. ముఖ్యంగా పరగడుపున (ఖాళీ కడుపుతో) తింటే చాలా మేలు జరుగుతుంది. కర్బూజ ప్రయోజనాలేంటో తెలుసుకోండి.. కర్బూజను తినడం వల్ల కలిగే ప్రయోజనాలేంటో తెలుసుకోండి.. గుండె సంబంధిత వ్యాధుల నుంచి ఉపశమనం: కర్బూజను రోజూ తీసుకుంటే గుండె సంబంధిత వ్యాధుల నుంచి కూడా ఉపశమనం పొందవచ్చు. దీనిలో ఫోలిక్ యాసిడ్ ఉంటుంద. ఇది మీ రక్తాన్ని శుద్ధి చేయడంలో కూడా సహాయపడుతుంది. రక్త నాళాలలో రక్తం గడ్డకట్టడాన్ని నివారించడంలో ఇది మీకు చాలా సహాయపడుతుంది. దీన్ని ఉదయం ఖాళీ కడుపుతో తీసుకుంటే చాలా ప్రయోజనాలను పొందవచ్చు. కడుపు సమస్యలు దూరం: వేసవి కాలంలో ప్రజలకు కడుపు సంబంధిత సమస్యలు మొదలవుతాయి. అజీర్తి, మలబద్దకం, కడుపులో నొప్పి, జీర్ణ సమస్యలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతుంటారు. అయితే, ఈ సీజన్‌లో ఎక్కువ నూనె, మసాలాలు తీసుకోవడం చాలా ప్రమాదకరం. కావున, అలాంటివి తగ్గించి.. తేలికపాటి వస్తువులను అంటే సులభంగా జీర్ణమయ్యే వాటిని తీసుకోవడం చాలా ఉపయోగకరంగా ఉంటుంది. కావున కర్బూజను తినడం చాలా మంచిది. కంటి సంబంధిత సమస్యలు: కర్బూజ తినడం వల్ల కంటి సంబంధిత సమస్యలు కూడా నయమవుతాయి. విటమిన్ ఎ బీటా కెరోటిన్ కర్బూజలో లభిస్తుంది. ఇది మీ కంటి చూపును మెరుగుపర్చి ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇంకా కంటిశుక్లం ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా మీకు చాలా సహాయపడుతుంది. లైంగిక సమస్యల నుంచి ఉపశమనం: కర్బూజలోని విటమిన్ కె, ఇ కూడా పుష్కలంగా ఉంటాయి. దీని వలన ప్రత్యుత్పత్తి వ్యవస్థ బాగా పనిచేస్తుంది. దీనిని తినడం వల్ల లైంగిక సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. మూత్రపిండాల్లో రాళ్లు: కిడ్నీలో రాళ్ల సమస్యతో బాధపడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది.. వాటి నుంచి బయటపడేందుకు నిత్యం పలు రకాల మందులు వాడుతుంటారు. అలాంటి వారు రోజూ పుచ్చకాయను తీసుకుంటే.. కిడ్నీల్లో రాళ్ల సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు..

## ఒక్కటి.. ఒకే ఒక్కటి.. పడుకునే ముందు అరటిపండు తింటే ఏమవుతుందో తెలుసా..? అమేజింగ్ అంతే..

అరటిపండులో ఎన్నో పోషకాలు దాగున్నాయి. ఇవి శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. అందుకే.. ఎప్పటికీ అందుబాటులో ఉండే అరటిపండును తినాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అరటిపండులో పొటాషియం, విటమిన్ సి, విటమిన్ బి6, ఫైబర్, మాంగనీస్ వంటి అనేక ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. వాటిలో కేలరీలు, కొవ్వు తక్కువగా ఉంటాయి. అందుకే.. ఆరోగ్యానికి మేలు చేసే అరటిపండును తింటే.. శరీరానికి అనేక ప్రయోజనాలను కలుగుతాయని పేర్కొంటున్నారు.. అయితే, పడుకునే ముందు అరటిపండు తినడం వల్ల నిద్ర, జీర్ణక్రియతోపాటు మొత్తం ఆరోగ్యంపై మంచి ప్రభావం చూపుతుంది. నిద్రపోయే ముందు అరటిపండును తినడం వల్ల కలిగే ప్రయోజనాలేంటో తెలుసుకోండి.. మంచి నిద్రను ప్రోత్సహిస్తుంది: అరటిపండ్లలో ట్రిప్టోఫాన్ అనే అమినో యాసిడ్ ఉంటుంది. ఇది సెరోటోనిన్‌గా.. మెలటోనిన్‌గా మారుతుంది. ఇవి నిద్రను నియంత్రించడంలో సహాయపడే న్యూరోట్రాన్స్‌మిటర్‌లు. కండరాల సడలింపు: అరటిపండ్లలో మెగ్నీషియం, పొటాషియం కూడా ఉన్నాయి. ఇవి కండరాలను సడలించే లక్షణాలకు ప్రసిద్ధి చెందిన ఖనిజాలను కలిగి ఉంటాయి. పడుకునే ముందు వాటిని తీసుకోవడం వల్ల మీ కండరాలు విశ్రాంతి తీసుకోవడానికి, మరింత ప్రశాంతమైన నిద్రను ప్రోత్సహిస్తాయి. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది: అరటిపండ్లు మితమైన గ్లైసెమిక్ సూచికను కలిగి ఉంటాయి. అంటే అవి నెమ్మదిగా శక్తిని విడుదల చేస్తాయి. పడుకునే ముందు ఒకటి తినడం వల్ల రాత్రంతా రక్తంలో చక్కెర స్థాయిలలో వచ్చే అవాంతరాలను నివారించవచ్చు. ఆకలి బాధను నివారిస్తుంది:అరటిపండ్లు ఫైబర్ కు మంచి మూలం.పడుకునే ముందు అరటిపండు తినడం వల్ల రాత్రి సమయంలో ఆకలి బాధలను నివారిస్తుంది. నిరంతరాయంగా నిద్రపోయేలా చేస్తుంది. పోషకాలు సమృద్ధిగా ఉంటాయి.. అరటిపండ్లు విటమిన్లు సి, బి6, పొటాషియం, మాంగనీస్ వంటి అవసరమైన పోషకాలతో నిండి ఉన్నాయి.పడుకునే ముందు వాటిని తీసుకోవడం వల్ల మీ శరీరానికి ఈ పోషకాలు అందుతాయి. ఇది మొత్తం ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది.

# స్పోర్ట్స్

# భారత్‌పై ఆస్ట్రేలియా విజయం

### సిరీస్ కోల్పోయిన టీమ్ఇండియా
### సిరీస్ వశం చేసుకున్న ఆసీస్
### ఆదుకున్న రోహిత్, అయ్యర్!
### మరోసారి విఫలమైన కోహ్లి



ఆస్ట్రేలియా పర్యటనలో భారత్?కు వరుసగా రెండో ఓటమి ఎదురైంది. అడిలైడ్ వేదికగా జరిగిన రెండో వన్డేలోనూ టీమ్ఇండియా ఓటమి పాలైంది. ఈ మ్యాచ్?లో ఆసీస్ 2 వికెట్ల తేడాతో నెగ్గింది. 265 పరుగుల లక్ష్య టార్గెట్?ను ఆసీస్ 8 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కూపర్ కొనోలీ (61 పరుగులు), మ్యాథ్యూ షార్ట్ (74 పరుగులు) హాఫ్ సెంచరీలతో రాణించారు. చివర్లో మిచెల్ ఓవెన్ (36 పరుగులు) మెరుపులు మెరిపించాడు. దీంతో ఆసీస్ 46.3 ఓవర్లలోనే టార్గెట్ అందుకుంది. భారత్ బౌలర్లలో అర్షదీప్ సింగ్, హర్షిత్ రానా, వాషింగ్టన్ సుందర్ తలో 2 వికెట్లు దక్కించుకున్నారు. అక్షర్ పటేల్, సిరాజ్ చెరో? 1 వికెట్ పడగొట్టాడు. తాజా ఫలితంతో మూడు వన్డేల సిరీస్?ను ఆస్ట్రేలియా ఇంకో మ్యాచ్? మిగిలి ఉండగానే 2-0 తేడాతో దక్కించుకుంది. గత ఆదివారం పెర్త్ వేదికగా జరిగిన తొలి మ్యాచ్?లో 7 వికెట్ల తేడాతో నెగ్గిన ఆసీస్, తాజాగా అడిలైడ్ లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. దీంతో సిరీస్?లో వరుసగా రెండో విజయం నమోదు చేసింది. ఇక చివరిదైన నామమాత్రపు వన్డే అక్టోబర్ 25 (శనివారం) జరగనుంది. ఈ మ్యాచ్?కు సిడ్నీ క్రికెట్ గ్రౌండ్ వేదిక కానుంది. ఆసీస్ పర్యటనకు వెళ్లిన భారత్ కనీసం ఈ మ్యాచ్?లనైనా నెగ్గి పరువు కాపాడుకోవాలని అభిమానులు ఆశిస్తున్నారు. స్పెషలిస్ట్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను ఆడించాలని మాజీ క్రికెటర్లు చేసిన సూచనలు పట్టించుకోకుండా సేమ్ కాంబినేషన్‌తో బరిలోకి దిగిన గంభీర్ తగిన మూల్యం చెల్లించుకున్నాడు. ఆసీస్ స్పిన్నర్ ఆడమ్ జంపా 4 వికెట్లతో భారత్ పతనాన్ని శాసిస్తే.. భారత స్పిన్ ఆల్‌రౌండర్లు మూడు వికెట్లు మాత్రమే పడగొట్టారు. కుల్దీప్ యాదవ్ ఉండి ఉంటే మ్యాచ్ ఫలితం మరోలా ఉండేది. శుభ్‌మన్ గిల్ వరుసగా రెండో మ్యాచ్‌లోనూ టాస్ ఓడిపోయాడు. ఇది కూడా భారత ఓటమికి కారణమైంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లకు 264 పరుగులు చేసింది. రోహిత్ శర్మ(97 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 73), శ్రేయస్ అయ్యర్(77 బంతుల్లో 7 ఫోర్లతో 61) హాఫ్ సెంచరీలతో రాణించగా.. అక్షర్ పటేల్(41 బంతుల్లో 5 ఫోర్లతో 44), హర్షిత్ రాణా(18 బంతుల్లో 3 ఫోర్లతో 24 నాటౌట్) విలువైన పరుగులు చేశారు. విరాట్ కోహ్లి(0) మరోసారి తీవ్రంగా నిరాశపర్చాడు. ఆసీస్ బౌలర్లలో ఆడమ్ జంపా(4/60) నాలుగు వికెట్లు తీయగా.. గ్జేవియర్ బార్ట్‌లెట్(3/36) మూడు వికెట్లు పడగొట్టాడు. మిచెల్ స్టార్క్‌కు ఓ వికెట్ దక్కింది. అనంతరం ఆస్ట్రేలియా 46.2 ఓవర్లలో 8 వికెట్లకు 265 పరుగులు చేసి గెలుపొందింది. మాథ్యూ షార్ట్(78 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 74), కూపర్ కన్నోలీ(51 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 57 నాటౌట్) హాఫ్ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో అర్షదీప్ సింగ్, హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్ రెండేసి వికెట్లు తీయగా.. అక్షర్ పటేల్, మహమ్మద్ సిరాజ్ చెరో వికెట్ పడగొట్టారు. ఇరు జట్ల మధ్య మూడో వన్డే సిడ్నీ వేదికగా శనివారం జరగనుంది. కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ వరుసగా రెండు పరాజయాలు ఎదుర్కోవడంతో పాటు తొలి సిరీస్‌ను కోల్పోయాడు. ఆస్ట్రేలియాతో రెండో వన్డేలో టీమిండియా 265 పరుగుల లక్ష్యాన్ని నమోదు చేసింది. రోహిత్ శర్మ(97 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 73), శ్రేయస్ అయ్యర్(77 బంతుల్లో 7 ఫోర్లతో 61) హాఫ్ సెంచరీలతో రాణించడంతో నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లకు 264 పరుగులు చేసింది. అక్షర్ పటేల్(41 బంతుల్లో 5 ఫోర్లతో 44), హర్షిత్ రాణా(18 బంతుల్లో 3 ఫోర్లతో 24 నాటౌట్) విలువైన పరుగులు చేశారు. ఆసీస్ బౌలర్లలో ఆడమ్ జంపా(4/60) నాలుగు వికెట్లు తీయగా.. గ్జేవియర్ బార్ట్‌లెట్(3/36) మూడు వికెట్లు పడగొట్టాడు. మిచెల్ స్టార్క్‌కు ఓ వికెట్ దక్కింది.ఓవైపు వికెట్లు పడుతున్నా.. మరోవైపు అక్షర్ పటేల్ తనదైన బ్యాటింగ్‌తో చెలరేగాడు.



## కొత్త చరిత్ర క్రియేట్ చేసిన ప్రతీక రావల్

ఐసీసీ మహిళల ప్రపంచ కప్ 2025లో భారత క్రికెట్‌లో ఒక కొత్త చరిత్ర క్రియేట్ చేసింది. యువ ఓపెనర్ ప్రతీక రావల్ న్యూజిలాండ్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో అద్భుతమైన సెంచరీ సాధించింది. ఇది ఆమె వన్డే కెరీర్‌లో రెండో సెంచరీ కాగా, ఈ వరల్డ్ కప్‌లో తొలి సెంచరీ. అంతేకాకుండా ఈ మ్యాచ్‌లో సీనియర్ ఓపెనర్ స్మృతి మంధాన కూడా సెంచరీ చేయడంతో, మహిళల ప్రపంచ కప్ చరిత్రలో ఒకే మ్యాచ్‌లో ఇద్దరు భారత ఓపెనర్లు సెంచరీలు సాధించడం ఇదే తొలిసారిగా రికార్డు అయింది. తన సెంచరీతో పాటు, ప్రతీక అత్యంత వేగంగా 1000 వన్డే పరుగులు పూర్తి చేసిన ప్రపంచ రికార్డును కూడా సమం చేసింది. నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో న్యూజిలాండ్‌తో జరిగిన ప్రపంచ కప్ మ్యాచ్‌లో యువ ఓపెనర్ ప్రతీక రావల్ తన బ్యాటింగ్‌తో అదరగొట్టింది. ఢిల్లీకి చెందిన ఈ యంగ్ బ్యాటర్, తన 23వ వన్డే ఇన్నింగ్స్‌లో 120 బంతులు ఎదుర్కొని తన కెరీర్‌లో రెండో సెంచరీని నమోదు చేసింది. ఈ టోర్నమెంట్‌లో రెండవసారి 50 పరుగుల మార్కును దాటిన ప్రతీక, ఈసారి దాన్ని సెంచరీగా మలచడంలో సఫలమైంది. ఈ మ్యాచ్‌లో ప్రతీక, సీనియర్ ఓపెనర్ స్మృతి మంధానతో కలిసి డబుల్ సెంచరీ భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. మంధాన సెంచరీ తర్వాత అవుట్ అయినా, ప్రతీక తన సెంచరీని పూర్తి చేసుకుని జట్టుకు మంచి స్కోరు అందించడంలో కీలకమైంది. ప్రతీక సెంచరీ చేయడంతో భారత క్రికెట్‌లో ఒక అరుదైన రికార్డు నమోదైంది.మహిళల ప్రపంచ కప్ చరిత్రలో ఒకే మ్యాచ్‌లో ఇద్దరు సెంచరీలు చేయడం ఇది కేవలం మూడవసారి మాత్రమే. కానీ, భారత్ తరపున ఒకే మ్యాచ్‌లో ఇద్దరు ఓపెనర్లు సెంచరీలు సాధించడం ఇదే మొదటిసారి. మంధాన, ప్రతీక ఈ అరుదైన ఘనతను సాధించారు. సెంచరీతో పాటు, ప్రతీక తన వన్డే కెరీర్‌లో అత్యంత వేగంగా 1000 పరుగులు పూర్తి చేసి ప్రపంచ రికార్డును కూడా సమం చేసింది. ప్రతీక రావల్ కేవలం 23 ఇన్నింగ్స్‌లలోనే 1000 వన్డే పరుగులు పూర్తి చేసింది. ఆస్ట్రేలియా మాజీ బ్యాటర్ లిండ్సే రీలర్ పేరిట ఉన్న ఈ ప్రపంచ రికార్డును ప్రతీక సమం చేసింది. ఈ యువ బ్యాటర్ రాబోయే మ్యాచ్‌లలో కూడా ఇదే ఫామ్‌ను కొనసాగించాలని భారత అభిమానులు ఆశిస్తున్నారు.

## విరాట్ ఖాతాలోకి చెత్త రికార్డ్

ఆస్ట్రేలియా సిరీస్?లో భారీ అంచనాల నడుమ రీ ఎంట్రీ ఇచ్చిన టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మరోసారి విఫలమయ్యాడు. వరుసగా రెండో మ్యాచ్?లోనూ పరుగుల ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరాడు. దీంతో భారత్ 17 పరుగులకే 2 వికెట్లు కోల్పోయింది. ఈ క్రమంలో విరాట్ తన సుదీర్ఘ కెరీర్?లో అత్యంత చెత్త రికార్డును మూటగట్టుకున్నాడు. అదేంటంటే? ఈ సిరీస్?లో భారీ అంచనాలతో బరిలోకి దిగిన విరాట్ పెర్త్?లో జరిగిన తొలి వన్డేలో ఫెయిల్ అయ్యాడు. ఆ మ్యాచ్?లో 8 బంతులు ఆడి ఒక్క పరుగు చేయకుండానే ఔట్ అయ్యాడు. ఇక రెండో వన్డేలోనైనా ఆకట్టుకుంటాడని అందరూ ఆశించారు. కానీ అడిలైడ్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్?లో విరాట్ నిరాశ పర్చాడు. కెప్టెన్ శుభ్?మన్ గిల్ (9) స్వల్ప స్కోరుకే వెనుదిరగడంతో, జట్టు స్కోర్ 17 పరుగుల వద్ద బ్యాటింగ్?కు వచ్చాడు. ఆసీస్ బౌలర్ జేవియర్ బార్ట్‌లెట్ వేసిన ఆరో ఓవర్లోనే భారత్?కు రెండు షాక్?లు తగిలాయి. తొలి బంతికి గిల్ ఔట్ కాగా, ఆరో బాల్?కు విరాట్? పెవిలియన్?కు చేరాడు. బ్యాటింగ్‌కు వచ్చిన నిమిషాల్లోనే కోహ్లీ ఔట్ అయ్యాడు. జేవియర్ వేసిన ఆరో ఓవర్ ఐదో బంతికి విరాట్ పరుగులేమీ చేయకుండానే %ాదీఔ%గా విరాట్ ఔట్ అయ్యాడు. దీంతో అభిమానులు మరోసారి నిరాశ చెందారు. కాగా, విరాట్? 2008లో అరంగేట్రం చేశాడు. 17ఏళ్ల కెరీర్?లో ఇప్పటిదాకా 304 వన్డే మ్యాచ్?ల్లో టీమ్ఇండియాకు ప్రాతినిధ్యం వహించాడు. ఈ సుదీర్ఘ వన్డే కెరీర్?లో వరుసగా డకౌట్ అవ్వడం మాత్రం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఇంతకుముందు 2021లో అహ్మదాబాద్?లో జరిగిన టెస్టులో, %ు%20లో విరాట్ వరుసగా రెండుసార్లు డకౌట్?గా నిలిచాడు. అయితే ఆసీస్?తో వన్డే సిరీస్?లో డకౌట్ అవ్వడం ఇది విరాట్?కు రెండోసారి. ఓవరాల్?గా అంతర్జాతీయ క్రికెట్?లో విరాట్?కు ఇది 40వ డకౌట్. ఈ లిస్ట్?లో భారత మాజీ బౌలర్ జహీర్ ఖాన్ అగ్రస్థానంలో ఉన్నాడు. అతడు అన్ని ఫార్మాట్లలో కలిపి 43సార్లు డకౌట్ అయ్యాడు.ఆస్ట్రేలియాలో అడిలైడ్ మైదానం విరాట్?కు అచ్చొచ్చిన గ్రౌండ్. ఈ గ్రౌండ్?లో కోహ్లీ ఇప్పటిదాకా అత్యంత విజయవంతమైన విదేశీ బ్యాటర్?గా ఉన్నాడు. అన్ని ఫార్మాట్లలో కలిపి విరాట్ అడిలైడ్?లో 975 పరుగులు చేశాడు. ఇందులో 5 సెంచరీలు ఉండడం విశేషం. కానీ, ఈ మ్యాచ్?తో అడిలైడ్? గ్రౌండ్?లో తొలి డకౌట్ నమోదు చేశాడు.





## సర్ఫరాజ్ ఖాన్ వివాదంపై మౌనం వీడిన బీసీసీఐ..

దేశవాళీ క్రికెట్‌లో పరుగుల వరద పారిస్తున్న ముంబై బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ మరోసారి సెలెక్టర్ల నుంచి ఎదురుదెబ్బ తగలడంతో క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. సౌత్ ఆఫ్రికా 'ఏ' జట్టుతో జరగనున్న నాలుగు రోజుల మ్యాచ్‌ల కోసం ప్రకటించిన ఇండియా 'ఏ' జట్టులో సర్ఫరాజ్ పేరు లేకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. అద్భుతమైన ఫస్ట్-క్లాస్ రికార్డు ఉన్నప్పటికీ సర్ఫరాజ్‌ను పక్కన పెట్టడంపై విమర్శలు వెల్లువెత్తగా, ఈ విషయంలో బీసీసీఐ వర్గాలు మౌనం వీడినట్లు తెలుస్తోంది. బీసీసీఐ వర్గాల నుంచి అందిన సమాచారం ప్రకారం, సర్ఫరాజ్ ఖాన్‌ను ఇండియా 'ఏ' జట్టు నుంచి తప్పించడానికి అనేక కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది. అందులో ఒకటి లేదా రెండు మాత్రమే కావు. సర్ఫరాజ్ ఖాన్ ఇటీవలే క్వాడ్రిసెప్స్ గాయం నుంచి కోలుకున్నాడు. ఈ గాయం కారణంగా అతను దులీప్ ట్రోఫీ, ఇరానీ కప్‌లకు దూరమయ్యాడు. ఇండియా 'ఏ' జట్టులో అతన్ని ఎంపిక చేస్తే, అతను రంజీ ట్రోఫీలో ముంబై తరపున ఆడే కొన్ని ముఖ్యమైన రౌండ్‌లను మిస్ అయ్యే అవకాశం ఉంది. గాయం నుంచి పూర్తిగా కోలుకున్న తర్వాత అతను దేశవాళీ క్రికెట్‌లో వీలైనన్ని ఎక్కువ మ్యాచ్‌లు ఆడేలా చూడాలనేది సెలెక్టర్ల ముఖ్య ఉద్దేశమని బీసీసీఐ వర్గాలు చెబుతున్నాయి.భారత టెస్ట్ జట్టులో ప్రస్తుతం 5 లేదా 6వ స్థానాల్లో స్థిరమైన ఆటగాళ్లు ఉన్నారు (రిషబ్ పంత్, వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా వంటి క్రీడాకారులు). సర్ఫరాజ్ దేశవాళీలో ఎక్కువగా మిడిల్ ఆర్డర్‌లోనే బ్యాటింగ్ చేస్తుంటాడు. జాతీయ జట్టులో ఇప్పుడు నెం. 3 స్థానంలోనే కొంచెం అనిశ్చితి ఉంది. కాబట్టి, సర్ఫరాజ్ తన టెస్ట్ జట్టు ఎంపిక అవకాశాలను మెరుగుపరుచుకోవాలంటే, అతను ముంబై రంజీ జట్టులో నెం. 3 లేదా నెం. 4 స్థానంలో బ్యాటింగ్ చేయాలని, తద్వారా కొత్త బంతిని ఎదుర్కొనే సామర్థ్యాన్ని ప్రదర్శించాలని సెలెక్టర్లు భావిస్తున్నట్లు సమాచారం.గతంలో సర్ఫరాజ్‌ను టీమిండియా టెస్ట్ జట్టుకు ఎంపిక చేయకపోవడానికి అతని అంతర్జాతీయ ప్రమాణాలకు తగిన ఫిట్‌నెస్ లేకపోవడం ఒక ప్రధాన కారణంగా బీసీసీఐ వర్గాలు గతంలోనే వెల్లడించాయి. దీనిపై దృష్టి సారించిన సర్ఫరాజ్ ఇటీవల 17 కిలోల వరకు బరువు తగ్గి ఫిట్‌నెస్‌ను మెరుగుపరుచుకున్నప్పటికీ, గతంలో ఫీల్డ్‌లో, వెలుపల అతని ప్రవర్తన విషయంలో కొన్ని సంఘటనలను సెలెక్టర్లు పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.: రజత్ పాటిదార్, రుతురాజ్ గైక్వాడ్ వంటి ఆటగాళ్లు దేశవాళీలో నిలకడగా రాణించడంతో పాటు, ప్రస్తుతం టీమిండియాకు అందుబాటులో ఉన్న కేఎల్ రాహుల్ వంటి సీనియర్ ఆటగాళ్లు కూడా సౌతాఫ్రికా టెస్ట్ సిరీస్‌కు ముందు మ్యాచ్ ప్రాక్టీస్ కోసం 'ఏ' జట్టులో ఆడటానికి ఆసక్తి చూపడం కూడా సర్ఫరాజ్‌కు ఈసారి చోటు దక్కకపోవడానికి మరో కారణంగా నిలుస్తోంది. మొత్తం మీద, సర్ఫరాజ్ ఖాన్ భారత టెస్ట్ జట్టు ప్రణాళికల్లో లేడని చెప్పడం సరికాదని, అతను ప్రతిభావంతుడైన ఆటగాడని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నప్పటికీ, అతన్ని ఎంపిక చేయకపోవడం వెనుక కేవలం ఫామ్ మాత్రమే కాకుండా, జట్టు అవసరాలు, గాయం నుంచి కోలుకునే ప్రక్రియ, బ్యాటింగ్ స్థానం వంటి అంశాలు ఉన్నాయని స్పష్టమవుతోంది. సర్ఫరాజ్ తన బ్యాటింగ్‌తో పాటు మిగిలిన అంశాలపై కూడా దృష్టి సారిస్తే జాతీయ జట్టు తలుపులు త్వరలోనే తెరుచుకుంటాయని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.


## చరిత్ర సృష్టించిన రోహిత్ శర్మ!

టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ చరిత్ర సృష్టించాడు. వన్డేల్లో ఆస్ట్రేలియా గడ్డపై ఆ జట్టుపై 1000లి పరుగులు చేసిన తొలి భారత బ్యాటర్‌గా నిలిచాడు. ఆస్ట్రేలియాతో అడిలైడ్ వేదికగా జరుగుతున్న రెండో వన్డేలో హాఫ్ సెంచరీ చేయడం ద్వారా రోహిత్ ఈ ఫీట్ సాధించాడు. ఈ జాబితాలో రోహిత్ శర్మ తర్వాత విరాట్ కోహ్లీ(802), సచిన్ టెండూల్కర్ (740), మహేంద్ర సింగ్ ధోనీ(684), శిఖర్ ధావన్(517) ఉన్నారు. కాగా రోహిత్ ఇప్పటి వరకు 275 వన్డేల్లో 11,184లి పరుగులు చేశాడు. ఇందులో 32 సెంచరీలతో పాటు 59 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అత్యధిక స్కోర్ 264. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు ఆశించిన ఆరంభం దక్కలేదు. ఒకే ఓవర్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్(9)తో పాటు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ(0) వెనుదిరిగాడు. బౌలింగ్‌కు అనుకూలంగా ఉన్న కండిషన్స్‌పై ఓపెనర్లు రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ తడబడ్డారు. ఆచితూచి ఆసీస్ బౌలర్లను ఎదుర్కొన్నారు. 7వ ఓవర్ తొలి బంతికి శుభ్‌మన్ గిల్(9)ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చిన గ్జేవియర్ బార్ట్‌లెట్.. ఐదో బంతికి విరాట్ కోహ్లీని వికెట్ల ముందు బోల్తా కొట్టించాడు. దాంతో 17 పరుగులకే టీమిండియా రెండు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. క్రీజులోకి వచ్చిన శ్రేయస్ అయ్యర్‌తో కలిసి రోహిత్ శర్మ(73) జట్టును ఆదుకున్నాడు. 74 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న రోహిత్ శర్మ.. స్టార్క్ బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. దాంతో మూడో వికెట్‌కు నమోదైన 118 పరుగులు భాగస్వామ్యానికి తెరపడింది. ఇక తన 17 ఏళ్ల వన్డే క్రికెట్‌లోనే విరాట్ కోహ్లీ వరుసగా రెండు మ్యాచ్‌ల్లో డకౌటవ్వడం ఇదే తొలిసారి. సుదీర్ఘ విరామం తర్వాత బరిలోకి దిగిన విరాట్ కోహ్లీ వరుసగా రెండు మ్యాచ్‌ల్లో డకౌటవ్వడం అభిమానులను తీవ్రంగా నిరాశపర్చింది. పెర్త్ వేదికగా జరిగిన తొలి వన్డేలోనూ కోహ్లీ డకౌట్ అయిన సంగతి తెలిసిందే. ఆ మ్యాచ్‌లో క్యాచ్ ఔట్ అయిన కోహ్లీ.. తాజా మ్యాచ్‌లో ఎల్బీగా వెనుదిరిగాడు.

# కీలక క్యాచ్‌లు వదిలేయడంతోనే ఓటమి




టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఆస్ట్రేలియా పర్యటనలో టీమిండియా వైఫల్యం కొనసాగుతోంది. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ టీమిండియా ఓటమిపాలైంది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా అడిలైడ్ వేదికగా గురువారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన ఆసీస్ 2 వికెట్ల తేడాతో భారత్‌ను ఓడించింది. ఈ గెలుపుతో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0తో సిరీస్ కైవసం చేసుకుంది. అయితే కీలక క్యాచ్‌లు వదిలేయడంతోనే ఓటమిపాలయ్యామని టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తెలిపాడు. మ్యాచ్ అనంతరం అధికార బ్రాడ్‌కాస్టర్‌తో మాట్లాడిన శుభ్‌మన్ గిల్.. టాస్ ఓడిపోవడం పెద్దగా ప్రభావం చూపలేదన్నాడు.మేం పోరాడే లక్ష్యాన్నే నమోదు చేశాం. కానీ కీలక క్యాచ్‌లు వదిలేస్తే ఎంత పెద్ద లక్ష్యం ఉన్నా కాపాడుకోలేం. తొలి మ్యాచ్‌లో టాస్ గెలవడం కీలకం. కానీ ఈ మ్యాచ్‌లో టాస్ అంత కీలకం కాదు. ఎందుకంటే ఇరు జట్లు 50 ఓవర్లు ఆడాయి. 15-20 ఓవర్ల తర్వాత వికెట్ సెటిల్ అయ్యింది. రోహిత్ శర్మ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. సుదీర్ఘ విరామం తర్వాత వచ్చి ఇలాంటి ఇన్నింగ్స్ ఆడటం అంత సులువు కాదు. మ్యాచ్ ఆరంభంలో పిచ్ బ్యాటింగ్‌కు సవాలుగా ఉంది. కానీ రోహిత్ అద్భుతంగా ఆడాడు. నా అభిప్రాయం ప్రకారం అతను పెద్ద ఇన్నింగ్స్‌ను చేజార్చుకున్నాడు.'అని శుభ్‌మన్ గిల్ చెప్పుకొచ్చాడు.ఈ మ్యాచ్‌లో టీమిండియా మూడు కీలక క్యాచ్‌లు నేలపాలు చేసింది. నితీష్ కుమార్ రెడ్డి బౌలింగ్‌లో 24 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద మాథ్యూ షార్ట్ ఇచ్చిన క్యాచ్‌ను అక్షర్ పటేల్ నేలపాలు చేశాడు. 55 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద వాషింగ్టన్ సుందర్ బౌలింగ్‌లో సిరాజ్ క్యాచ్ నేలపాలు చేశాడు. అర్షదీప్ సింగ్ బౌలింగ్‌లో 7 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద ట్రావిస్ హెడ్ ఇచ్చిన క్యాచ్‌ను నితీష్ కుమార్ రెడ్డి వదిలేసాడు. ఈ మూడు క్యాచ్‌లు పట్టి ఉంటే ఫలితం మరోలా ఉండేది. రెండు అవకాశాలతో మాథ్యూ షార్ట్ చెలరేగాడు. 74 పరుగులతో భారత్ పతనాన్ని శాసించాడు.



## ఫేస్ ప్యాక్ లు, హెయిర్ ఆయిల్స్ ఏమీ అక్కర్లేదు..జస్ట్ ఇది తింటే దట్టమైన జుట్టు, మెరిసే చర్మం

ఆరోగ్యవంతమైన జుట్టు, అందమైన చర్మం ప్రతీ ఒక్కరి కల. ఈ కలను నిజం చేయడానికి కొందరు అయితే చేయని ప్రయత్నం ఉండదు. రకరకాల క్రీమ్స్, ఆయిల్స్, షాంపూలు, సీరమ్స్,మార్కెట్లో ఏది కొత్తగా వచ్చినా వెంటనే కొనేసి ప్రయత్నించేస్తుంటారు. కొన్నిసార్లు ఫలితం ఉంటుంది, మరికొన్నిసార్లు నిరాశే మిగులుతుంది. అయితే మీ అందాన్ని రెట్టింపు చేసే అద్భుతమైన పరిష్కారం మీ వంటగదిలోనే దాగి ఉందని మీకు తెలుసా? ఎలాంటి దుష్ప్రభావాలు, రసాయనాల బెడద లేని ఒక సహజసిద్ధమైన ఫుడ్ మీ చర్మాన్ని, జుట్టును లోపలి నుండి పోషించి, ఆరోగ్యంగా మారుస్తుంది. పోషకాహార నిపుణురాలు సిమ్రాన్ చోప్రా తన ఇన్ స్టాగ్రామ్ అకౌంట్ లో షేర్ చేసిన ఓ వీడియోలో..జుట్టు, చర్మ ఆరోగ్యానికి సామయపడే ఆరోగ్యకరమైన స్నాక్ గురించి తెలియజేశారు. అదే పైనాఫిల్ రైతా. పెరుగు, పైనాపిల్ కలయికతో చేసే పైనాపిల్ రైతా.. మన చర్మ, కేశ సౌందర్యానికి అవసరమైన పోషకాలను అందించి, వాటిని ఆరోగ్యంగా, కాంతివంతంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇది కేవలం ఆరోగ్యకరమైనదే కాదు, తినడానికి కూడా ఎంతో రుచిగా ఉంటుంది. పైనాపిల్ రైతా స్కిన్, హెయిర్ కి ఎలా మేలు చేస్తుంది? పైనాఫిల్ ఇలా పైనాపిల్‌లో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఈ విటమిన్ సి మన శరీరంలో 'కొల్లాజెన్' అనే ప్రొటీన్ ఉత్పత్తికి అత్యంత అవసరం. కొల్లాజెన్ అంటే మన చర్మానికి ఒక ఆధారం లాంటిది. ఇది చర్మాన్ని బిగుతుగా, మృదువుగా ఉంచుతుంది, ముడతలు రాకుండా కాపాడుతుంది. వయసు పెరిగే కొద్దీ తగ్గే కొల్లాజెన్ ఉత్పత్తిని పైనాపిల్ ప్రేరేపిస్తుంది. అంతేకాకుండా కొల్లాజెన్ జుట్టు కుదుళ్లను బలపరిచి, జుట్టు రాలడాన్ని తగ్గించి ఒత్తుగా పెరిగేలా చేస్తుంది. జుట్టుకు మెరుపునిస్తుంది. పైనాపిల్ లో ఉండే బ్రోమెలైన్ అనే ఎంజైమ్ ఒక శక్తివంతమైన యాంటీ ఇన్ ఫ్లమేటరీ (వాపును తగ్గించే) ఏజెంట్ గా పనిచేస్తుంది. ఇది చర్మంపై మంట, ఎరుపుదనం, మొటిమల వల్ల కలిగే వాపును తగ్గిస్తుంది. చనిపోయిన చర్మ కణాలను తొలగించి చర్మాన్ని శుభ్రంగా, మచ్చలు లేకుండా, కాంతివంతంగా మార్చడంలో సహాయపడుతుంది. పెరుగు అలా ఇంట్లో తయారుచేసిన పులియని పెరుగు ఒక అద్భుతమైన ప్రోబయోటిక్. మన జీర్ణవ్యవస్థకు మేలు చేసే మంచి బ్యాక్టీరియా ఇందులో ఉంటుంది. చాలా చర్మ, జుట్టు సమస్యలకు మూలం మన కడుపులోని అసమతుల్యతే. జీర్ణవ్యవస్థ సరిగ్గా లేకపోతే పోషకాలు సరిగా అందవు, వ్యర్థాలు పేరుకుపోతాయి. ఇది మొటిమలు, చర్మం నిర్జీవంగా మారడం, జుట్టు రాలడం వంటి సమస్యలకు దారితీస్తుంది. పెరుగులోని ప్రోబయోటిక్స్ జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచి ఈ సమస్యల నుండి మనల్ని కాపాడతాయి. కడుపు చల్లగా ఉంటే చర్మం కూడా ప్రశాంతంగా, ఆరోగ్యంగా ఉంటుంది. పెరుగులో ప్రోటీన్, విటమిన్ బి కాంప్లెక్స్ సమృద్ధిగా ఉంటాయి. ప్రోటీన్ చర్మ కణాల మరమ్మత్తుకు, కొత్త కణాల ఉత్పత్తికి అవసరం. ఇది జుట్టు కుదుళ్లను బలపరిచి, జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. విటమిన్లు చర్మానికి తేమను అందించి, ఆరోగ్యంగా ఉంచుతాయి. జుట్టుకు మెరుపునిచ్చి, చిట్లడాన్ని తగ్గిస్తాయి.

# బొప్పాయి గింజలతో ఇన్ని లాభాలా..?



బొప్పాయి పండు తీసుకుంటే ఆరోగ్యానికి ఎంతో మంచిది. శరీరానికి శక్తిని కూడా ఇస్తుంది. అయితే, బొప్పాయి పండు విత్తనాలను మనం చెత్తగా భావించి పడేస్తాము. కానీ, ఈ విత్తనాల ద్వారా ఎన్నో లాభాలు ఉన్నాయి. ఈ నల్లటి బొప్పాయి గింజలు బరువు తగ్గడంలో ఎంతో సహాయపడతాయి. పోషకాలతో సమృద్ధిగా ఉన్న ఈ విత్తనాలు అనేక తీవ్రమైన వ్యాధులతో పోరాడే శక్తిని కలిగి ఉంటాయి. కాగా, బొప్పాయి గింజలు ఎలాంటి సమస్యలలో పని చేస్తాయో మనం ఇప్పుడు తెలుసుకుందాం. తరచుగా అజీర్ణం, మలబద్ధకం వంటి సమస్యలు ఉంటే బొప్పాయి గింజలు ఒక వరంలా పనిచేస్తాయి. ఇందులో 'పపైన్' అనే ఎంజైమ్ ఉంటుంది. కావున ఈ పండు విత్తనాలు ప్రోటీన్లను విచ్ఛిన్నం చేయడంలో, ఆహారాన్ని బాగా జీర్ణం చేయడంలో ఎంతో సహాయపడుతుంది. దీనిని క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా జీర్ణవ్యవస్థను బలపరుస్తుంది. అంతేకాకుండా కడుపు సంబంధిత సమస్యలను దూరం చేస్తుంది. నేటి కాలంలో మనం తీసుకునే ఆహారం, జీవనశైలి కాలేయంపై చెడు ప్రభావాన్ని చూపుతాయి. అయితే బొప్పాయి గింజలు కాలేయాన్ని క్లీన్ చేసి ఆరోగ్యంగా ఉంచడంలో ఎంతో సహాయపడతాయి. ఈ పండు గింజలు కాలేయాన్ని దెబ్బతీసే ఫ్రీ రాడికల్స్ నుండి కాపాడుతాయి. అంతేకాకుండా కాలేయ సిర్రోసిస్ వంటి తీవ్రమైన సమస్యలలో కూడా ఈ పండి విత్తనాలు సహాయపడతాయి. మన మూత్రపిండాలు మన శరీరం నుండి వ్యర్థ పదార్థాలను తొలగించడానికి పనిచేస్తాయి. బొప్పాయి గింజలు మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కూడా సహాయపడతాయి. ఈ బొప్పాయి పండు గింజలు మూత్రపిండాలను క్లీన్ చేయడంలో, దాని పనితీరును మెరుగుపరచడంలో ఎంతో సహాయపడతాయి.

### బొప్పాయి గింజలను ఆహారంలో ఎలా చేర్చుకోవాలి?

బొప్పాయి గింజలు కొద్దిగా చేదుగా ఉంటాయి. కావున వాటిని ఎండబెట్టి పొడిగా చేసి సలాడ్లు లేదా గంజిలో కలిపి తీసుకోవచ్చు. ప్రారంభం దశలో ఈ పొడిని తక్కువ పరిమాణంలో తీసుకోవడం మంచిది. తర్వాత నెమ్మదిగా పెంచుతూ పోతే సరిపోతుంది.

# పిగ్మెంటేషన్‌కు చెక్!



యువతులను ఎక్కువగా వేధించే సమస్య.. పిగ్మెంటేషన్. బుగ్గలు, నుదురుపై ఏర్పడే ఈ నల్లటి మచ్చలు.. అమ్మాయిల ముఖ వర్చస్సును దెబ్బతీస్తాయి. వీటిని పోగొట్టుకునేందుకు రకరకాల క్రీములు వాడుతుంటారు. అయితే, ఇంట్లో దొరికే పదార్థాలతోనే.. ఈ సమస్యకు చెక్ పెట్టొచ్చని సౌందర్య నిపుణులు చెబుతున్నారు. ఒక గిన్నెలో రెండు టేబుల్‌స్పూన్ల ఓట్‌మీల్, ఒక టేబుల్‌స్పూన్ పెరుగు, అర టేబుల్‌స్పూన్ టమాటా రసం వేసి.. బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని నల్లని మచ్చలపై రాసి.. 15–20 నిమిషాల తర్వాత కడిగేసుకోవాలి. టమాటాలో ఉండే సహజసిద్ధమైన బ్లీచింగ్ గుణాలు.. చర్మాన్ని శుభ్రపరుస్తాయి. ఓట్‌మీల్.. ఎక్స్‌ఫోలియేటింగ్ ఏజెంట్‌గా పనిచేస్తుంది. పిగ్మెంటేషన్‌ను తగ్గిస్తుంది. ఇక పెరుగు.. ముఖాన్ని మృదువుగా చేస్తుంది. కలబంద గుజ్జు, తేనె.. ఒక్కో టేబుల్‌స్పూన్ తీసుకోవాలి. ఇందులో రెండు టేబుల్‌స్పూన్ల బొప్పడి గుజ్జు వేసి.. ప్యాక్‌లాగా చేసుకోవాలి. దీన్ని పిగ్మెంటేషన్ ఉన్న చోట రాసి అరగంటపాటు ఆరనివ్వాలి. ఆ తర్వాత కడిగేసుకోవాలి. కలబందలోని సుగుణాలు.. చర్మంలో కొలాజెన్ స్థాయిలను పెంచుతాయి. ముఖాన్ని మెరిపిస్తాయి. ఇక ముఖంపై మచ్చలను తొలగించడంలో తేనె సమర్థంగా పనిచేస్తుంది. బొప్పడిలో ఉండే పపైన్ అనే ఎంజైమ్.. చర్మంపైన నల్లని మచ్చలు, మొటిమలను తగ్గిస్తుంది. గుప్పెడు పుదీనా ఆకులను మెత్తటి పేస్ట్‌లా చేసుకోవాలి. దీన్ని పిగ్మెంటేషన్ ఉన్న ప్రాంతాల్లో అప్లయి చేసి.. 10–15 నిమిషాల తర్వాత కడిగేసుకోవాలి. చర్మానికి రక్త ప్రసరణను మెరుగుపరచడంలో పుదీనా సాయపడుతుంది. సోయాపాలు, నిమ్మరసం, టమాటా గుజ్జు ఒక టేబుల్‌స్పూన్ చొప్పున తీసుకొని.. మెత్తటి పేస్ట్‌గా చేసుకోవాలి. నల్లని మచ్చలమీద ఈ మిశ్రమాన్ని అప్లయి చేసి.. పది నిమిషాలపాటు సున్నితంగా మసాజ్ చేసుకోవాలి. ఆ తర్వాత 10–15 నిమిషాలు బాగా ఆరనిచ్చి.. చల్లటి నీళ్లతో కడిగేసుకుంటే సరి. టమాటాలో ఉండే లైకోపీన్ వంటి యాంటి ఆక్సిడెంట్లు.. చర్మాన్ని యూవీ కిరణాల నుంచి రక్షిస్తాయి. చర్మ ఆరోగ్యానికి భరోసా ఇస్తాయి.ఆరెంజ్ తొక్కలను ఎండబెట్టి.. పొడిగా చేసుకోవాలి. అందులో కొద్దిగా పచ్చిపాలు కలిపి మెత్తని పేస్ట్‌గా తయారు చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని పిగ్మెంటేషన్ ఉన్నచోట అప్లయి చేసుకొని.. ఇరవై నిమిషాల తర్వాత చల్లటి నీటితో కడిగేసుకోవాలి. ఆరెంజ్‌లో ఉండే విటమిన్ సి, యాంటి ఆక్సిడెంట్లు.. చర్మాన్ని కాంతిమంతంగా మారుస్తాయి.

# మార్కెట్

## టాటా హారియర్ ఈవీ వచ్చేసిందోచ్

### ప్రారంభ ధర రూ.21.49 లక్షలు
### సింగిల్ చార్జింగ్‌తో 627 కిలోమీటర్లు

న్యూఢిల్లీ : దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటర్స్ సరికొత్త ఈవీ మాడల్‌ను మార్కెట్‌కు పరిచయం చేసింది. ఎస్‌యూవీ విభాగాన్ని మరింత బలోపేతం చేయడంలో భాగంగా సంస్థ నూతన హారియర్ ఈవీను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ఏడాది మొదట్లో న్యూఢిల్లీలో జరిగిన ఆటో ఎక్స్‌పోలో ప్రదర్శించిన ఈ మాడల్ ఆరు నెలల తర్వాత ప్రవేశపెట్టింది. ఈ కారు ప్రారంభ ధర రూ.21.49 లక్షలు. 75 కిలోవాట్ల బ్యాటరీ, 65 కిలోవాట్ల బ్యాటరీతో తయారైన ఈ మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 627 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. కేవలం 6.3 సెకండ్లలోనే 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు గంటకు 200 కిలోమీటర్లకు పైగా వేగంతో దూసుకుపోనున్నది. పనోరమిక్ సన్‌రూఫ్, 14.5 ఇంచుల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, డ్యూయల్–జోన్ ట్క్లైమెట్ కంట్రోల్ సిస్టమ్, 360 డిగ్రీల కెమెరా, 12.25 ఇంచుల పూర్తిస్థాయిలో కలర్ టచ్‌స్క్రీన్, లెవల్ 2 అడాస్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు వంటి ఫీచర్స్ ఉన్నా యి. ఈ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ బుకింగ్‌ను ఇప్పటికే ప్రారంభించింది. బ్యాటరీ ప్యాక్‌పై జీవితకాలం వ్యారెంటీ కల్పిస్తున్నట్లు సంస్థ ప్రకటించింది. ప్రస్తుతం నెలకు 25 వేల యూనిట్లు అమ్ముడవుతున్న ప్రీమియం ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో ఈ వాహనంతో మరింత పెరిగే అవకాశం ఉన్నదని టాటా మోటర్స్ ప్యాసింజర్ వాహన ఎండీ శైలేష్ చంద్ర తెలిపారు.



# స్టీల్, అల్యూమినియంపై 50 శాతం సుంకాలు..




### ఉత్తర్వులపై సంతకాలు చేసిన ట్రంప్

రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య యుద్ధానికి తెరతీసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే స్టీల్, అల్యూమినియంపై దిగుమతి సుంకాన్ని 25 శాతం నుంచి 50 శాతానికి పెంచుతున్నట్లు ఇటీవలే ప్రకటించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులపై ట్రంప్ తాజాగా సంతకాలు చేశారు. టారిఫ్‌లు అమెరికా కాలమానం ప్రకారం.. బుధవారం తెల్లవారుజామున 12:01 గంటల నుంచి అమల్లోకి వచ్చాయి. యూకేతో వాణిజ్య ఒప్పందం అమలులో ఉన్న నేపథ్యంలో వారికి మాత్రం టారిఫ్‌లు 25 శాతంగానే ఉండనున్నాయి. కాగా, స్టీల్, అల్యూమినియంపై దిగుమతి సుంకాన్ని 25 శాతం నుంచి 50 శాతానికి పెంచుతున్నట్లు ట్రంప్ గత వారం ప్రకటించిన విషయం తెలిసిందే. స్వదేశీ స్టీల్ పరిశ్రమను బలోపేతం చేయాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. తమ ప్రభుత్వం నిర్ణయం వల్ల స్థానిక స్టీల్ పరిశ్రమకు ఊతం వస్తుందని, జాతీయ సరఫరా పెరుగుతుందని, దీంతో చైనాపై ఆధారపడే సందర్భాలు తగ్గుతాయని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా స్టీల్ పరిశ్రమ అభివృద్ధి కోసం 14 బిలియన్ల డాలర్లు పెట్టుబడి పెట్టనున్నట్లు చెప్పారు. జపాన్‌కు చెందిన నిప్పాన్ స్టీల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ట్రంప్ వెల్లడించారు. అయితే ఆ డీల్‌కు చెందిన తుది నిర్ణయం ఇంకా తీసుకోవాల్సి ఉందన్నారు. స్టీల్ పరిశ్రమలో ఇక నుంచి ఉద్యోగులు తీసివేత ఉండదని, ఔట్ సోర్సింగ్ కూడా ఉండదన్నారు. ప్రతి స్టీల్ పరిశ్రమ కార్మికుడికి 5 వేల డాలర్ల బోనస్ అదనంగా వస్తుందని పెన్సిల్వేనియాలోని పిట్స్‌బర్గ్‌లో జరిగిన ర్యాలీలో ట్రంప్ చెప్పుకొచ్చారు.

## విద్యా రుణాలపై వడ్డీరేటు తగ్గించిన పీఎన్‌బీ

న్యూఢిల్లీ : పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ).. విద్యాలక్ష్మి స్కీం కింద విద్యా రుణాలు తీసుకునేవారికి వడ్డీరేటును 20 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్టు మంగళవారం ప్రకటించింది. విద్యా రుణాలు తీసుకునేవారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో బ్యాంక్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలనే ఉద్దేశంతో బ్యాంక్ ఈ ప్రత్యేక స్కీంను తీసుకొచ్చింది. దేశవ్యాప్తంగా 860కి పైగా ఉన్నత ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్‌లో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు రుణాలు ఇవ్వనున్నట్లు బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి. 7.5 శాతం వార్షిక వడ్డీతో విద్యా రుణాలు మంజూరు చేస్తున్నది.



# వైకాపాపై విమర్శలు చేసి.. ఇప్పుడు చేస్తున్నదేమిటి

## అధికార టిడిపిలో మద్యం సిండికేట్ వ్యవహారం రచ్చ



రాజమండ్రి : వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉండగా నకిలీ మద్యం విచ్చలవిడిగా విక్రయిచారని ఎండగట్టిన టిడిపి, ఇతర కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన తర్వాత తామేమీ తీసిపోమన్నట్టు వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలో ఇప్పటికే నకిలీ మద్యం గుట్టురట్టు అవడంతో అధికార పార్టీ పరిస్థితి పరనింద, ఆత్మస్తుతిలా మారింది. అధికార టిడిపిలో మద్యం సిండికేట్ వ్యవహారం కలకలం రేపింది. ఈ వ్యాపారంలో కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా చేస్తున్న అక్రమ వ్యవహారాలు తాజాగా మరోసారి వెలుగులోకి వచ్చాయి. సిటీ ఎంఎల్ఎకు అత్యంత సన్నిహితులలో ఒకరైన ఆ పార్టీ సిటీ ఇన్‌ఛార్జి మజ్జి రాంబాబు సిండికేట్ సభ్యునితో మాట్లాడిన ఫోన్ సంభాషణ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సంభాషణలో నగరం, రూరల్‌లో మద్యం సరఫరా, అక్రమ అమ్మకాలు, పర్మిట్‌లపై సిండికేట్ నిర్ణయాలు, మద్యం బాటిల్‌పై ధరలు ఎలా పెంచాలి, బెల్ట్ షాపులు ఎలా నిర్వహించాలి, ఎక్సైజ్ అధికారులకు లంచాలు ఎలా ఇవ్వాలి, ఎవరికి ఎంత శాతం ఇవ్వాలి, ఎలా అడ్డగోలుగా అధిక ధరలకు అమ్మకాలు కొనసాగించాలి అనే అంశాలతో పాటు ఎక్సైజ్ శాఖ పోలీసులు కేసులు పెడితే సామూహికంగా ఎలా ఎదుర్కోవాలి వంటి అంశాలపై ఏకంగా బైలా రాసుకుంటామని సెలవిచ్చారు. రాజమహేంద్రవరం అర్బన్, రూరల్‌కు సంబంధించి 39 షాపు నిర్వాహకులు, యజమానులు సమావేశానికి హాజరు కావాలని ఆ సంభాషణ సారాంశం. జిల్లావ్యాప్తంగా 125 వైన్‌షాపులకు, మరో 25 బార్ అండ్ రెస్టారెంట్‌లకు దశలవారీగా ప్రభుత్వం అనుమతులు ఇచ్చిన విషయం విదితమే. గడిచిన ఏడాది కాలంగా ఈ షాపులకు అనుబంధంగా బెల్ట్‌షాపులు నిర్వహించి వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారనేది సుస్పష్టం. ఈ అక్రమాలకు భరోసా ఇచ్చేలా అధికార పార్టీ నేత తెలపడం చర్చనీయాంశంగా మారింది. పాలక పెద్దల కనుసన్నలలోనే పాలక పెద్దల కనుసన్నల్లోనే మద్యం సిండికేట్ అక్రమాలకు తెరలేపుతోందనేది సుస్పష్టం. తాజా ఘటనతో పార్టీ ప్రతిష్ట దెబ్బతినడం ఖాయమని తేటతెల్లమవుతోంది. ఈ నేపథ్యంలో మజ్జి రాంబాబు ఫోన్ సంభాషణ తనదు కాదంటూ సమాధానం ఇచ్చారా.. అనే ప్రశ్న కూడా తలెత్తుతోంది. అదే నిజమైతే ఎవరనేది వెల్ల డించాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వంపై ఉంది. టిడిపి సిటీ అధ్యక్షునిగా ప్రకటించినప్పటికీ మజ్జి రాంబాబు ఇంకా ప్రమాణస్వీకారం చేయలేదు. నగర ఎంఎ ల్ఎకు అత్యంత సన్ని హితుడు కావడంతో ఆయనపై రాజకీయ దురుద్దేశంతో ఇటువంటి కుట్ర చేశారని టిడిపి నేతలు ఆరోపిస్తున్నారు. మద్యం మాఫియాతో లింకులు కలిగి ఉంటే ప్రభుత్వం నిష్పక్షపాతంగా వ్యవహరిస్తుందా లేదా అని ప్రశ్న తలెత్తుతోంది. మద్యం సిండికేట్ ఇష్టారాజ్యం రాజకీయ పెద్దల కనుసన్నలలోనే మద్యం సిండికేట్ అక్రమాలకు తెరలేపుతోందని సుస్పష్టం. ఈ ఉదంతంపై తొలుత మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ ఈ ఆడియోను బహిర్గతం చేయడంతో పాటు మరుసటి రోజు పోలీసు ఉన్నతాధికారులను కలిసి సిండికేట్ అక్రమాలపై ఫిర్యాదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మజ్జి రాంబాబు సైతం మీడియా ముందుకు వచ్చి తాను మాట్లాడలేదని ఎఐ టెక్నాలజీని వినియోగించుకుని తనపై దుష్ప్రచారం చేస్తున్నారంటూ వాపోయారు. తన రాజకీయ భవిష్యత్తుపై దురుద్దేశంతోనే మార్గాని భరత్ రామ్ ఇటువంటి చర్యలకు పాల్పడ్డారంటూ ఆరోపించారు. ఈ సమావేశం నిర్వహించిన హోటల్లోనే మద్యం సిండికేట్ సైతం సమావేశం అయింది. సమావేశం అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో తాము ప్రభుత్వ నిబంధనల మేరకే వ్యాపారం చేస్తు న్నామని తమను రాజకీయాల్లోకి లాగొద్దంటూ సెల విచ్చారు. ఈ ఆడియో వెనుక ఎవరు ఉన్నారనే దానిపై ప్రభుత్వం, లేదా పోలీసుల నుంచి ఇప్పటివరకు ఎటువంటి. అధికార ప్రకటన రాలేదు. ఈ విషయమై మజ్జి రాంబాబును వివరణ కోరగా మద్యం షాపులు నష్టాల్లో కూరుకుపోతున్న నేపథ్యంలో వ్యాపార లావాదేవీలు క్షీణించాయని, ఈ నేపథ్యంలో రాజమండ్రి అర్బన్ రూరల్ ప్రాంతాల్లోని 33 షాపు యజమానులతో స్థానిక హోటల్లో సమావేశం నిర్వహిస్తున్నామని, ఆ సమావేశంలో చర్చించే అంశాలన్నీ ఫోన్‌లో వివరించామన్నారు. మద్యం వ్యాపారంలో ఇలాంటి సమావేశాలు నిర్వహించడం సర్వసాధారణం అని రాంబాబు తెలిపారు.

# వర్ష ప్రభావిత జిల్లాల పరిస్థితులపై ప్రభుత్వం అప్రమత్తం

### సమీక్షించిన ముఖ్యమంత్రి, మంత్రులు, జిల్లా కలెక్టర్లు

అమరావతి, అక్టోబరు 23: బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ నుండి అతిభారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం అయింది. రాష్ట్రంలో ఎటు వంటి ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేయడం జరిగింది. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించడం జరిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుతో పాటు పలువురు మంత్రులు వర్ష ప్రభావిత నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కడప, తిరుపతి జిల్లాల పరిస్థితిపై సంబందిత జిల్లా కలెక్టర్లు, అధికారులతో సమీక్షలు నిర్వహించి అప్రమత్తం చేయడం జరిగింది. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దుబాయ్ నుంచి అధికారులతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. వర్ష ప్రభావిత నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కడప, తిరుపతి జిల్లాల పరిస్థితిపై సీఎస్ మరియు ఆర్టీజీ అధికారుల నుంచి సమాచారం సేకరించి, యంత్రాంగం అప్రమత్తంగా ఉండి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభావిత ప్రాంతాలకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డిఆర్ఎఫ్ బృందాలను పంపించాలని సూచిస్తూ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా రెవెన్యూ, డిజాస్టర్, పోలీస్, ఇరిగేషన్, మున్సిపల్, ఆర్ అండ్ బి, విద్యుత్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీఎం సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, కాలువలు మరియు చెరువుల గట్లు బలహీనంగా ఉన్న చోట్ల పటిష్ట పరచాలని ఆదేశించారు. అంతేకాక, అంటువ్యాధులు వ్యాపించకుండా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కూడా ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్ర హోం మరియు విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి శ్రీమతి వంగలపూడి అనిత విజయవాడలో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైందని తెలిపారు. లోతట్టు ప్రాంతాలు మునిగే అవకాశం ఉండటంతో అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టణాల్లో డ్రైనేజీలను క్లియర్ చేసి వర్షపు నీరు సకాలంలో వెళ్లేలా చూడాలని, ఇరిగేషన్ అధికారులు కట్టల వెంబడి ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. వచ్చే వారం మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నందున మొత్తం యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. పిడుగులతో కూడిన వర్షాలు పడేటప్పుడు రైతులు పంట పొలాల్లో ఉండరాదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. ప్రకాశం జిల్లాలో భారీ వర్షాల పరిస్థితిపై రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా బాల వీరాంజనేయ స్వామి కలెక్టరేట్ నుండి మండల స్థాయి స్పెషల్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక పరిస్థితులు, సన్నద్ధతపై వివరాలు పరిశీలించి, మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టమైన సూచనలు ఇచ్చారు. అవాంఛనీయ పరిస్థితులు జరగకుండా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు వర్ష ప్రభావిత మండలాల్లో పాఠశాలలకు సెలవులు ప్రకటించామని, వాగులు పొంగుతున్న ప్రాంతాల్లో పోలీసు, రెవెన్యూ అధికారులతో గస్తీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నెల్లూరు జిల్లాలో ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా అక్టోబర్ 22 నుంచి 25 వరకు భారీ పిడుగులు, గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ హిమాన్ను శుక్ల ప్రజలకు హెచ్చరించారు. లోతట్టు, తీరప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండి, మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లరాదు, ఇప్పటికే ఉన్నవారు త్వరగా తీరానికి చేరుకోవాలి అని సూచించారు. జిల్లా యంత్రాంగం అంతా ఎంతో అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత కేంద్రాలకు తరలించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించడం జరిగిందని, 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూం (0861-2331261, 7995576699) ఏర్పాటు చేయబడిందన్నారు. వర్షాలు, గాలులు, ఉరుములు, విద్యుత్ ప్రమాదాలు, చెరువులు, కాలువల గండ్ల విషయంలో ప్రజలు ఎంతో అప్రమత్తంగా ఉండాలని తక్షణ సహాయం కోసం వెంటనే జిల్లా కంట్రోల్ రూం ను సంప్రదించాలని జిల్లా ప్రజలను ఆయన కోరారు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో నెల్లూరు నగరంలో మున్సిపల్ అధికారులు సమర్థవంతంగా సేవలు అందించారని, మురుగునీరు, డ్రైనేజ్ సిస్టంను సరిచేయడం, ప్రధాన కాలువల్లో సిల్ట్ తొలగించడం, నీరు నిలకడగా పారే విధంగా డైవర్షన్ చర్యలు తీసుకోవడం ద్వారా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టారని కలెక్టర్ ప్రశంసించారు. బాపట్ల జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ వి. వినోద్ కుమార్ మండల, గ్రామ స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి భారీ వర్షాల నేపథ్యంలో ఎటు వంటి ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా తగు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చెరువు గట్లను పటిష్టపర్చాలని లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మైనర్ ఇరిగేషన్ చెరువుల వద్ద అధికారులు నియమించి, సముద్రంలో వేటకు వెళ్లిన 42 మంది జాలర్లను సురక్షితంగా తిరిగి ఇంటికి చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించాలని, ఎరువుల నిల్వలను యాప్‌లో అప్డేట్ చేయించాలని, ఇ. పంటల నమోదు పూర్తిచేయాలని ఆదేశించారు. అలాగే, గృహ నిర్మాణ శాఖ ద్వారా నిర్మించిన గృహాలను త్వరలో ప్రారంభించడానికి సిద్ధం చేసుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పంచాయతీ, వ్యవసాయ, సాంఘిక సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు జిల్లాలోని పరిస్థితులను సమీక్షిస్తూ భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలోని సింగరాయకొండ, టంగుటూరు, కొత్తపట్నం, ఒంగోలు, నాగులుప్పలపాడు మండలాల పాఠశాలలు మరియు అంగన్వాడీ కేంద్రాలకు నేడు సెలవు ప్రకటించబడం జరిగిందన్నారు. పామూరు మరియు సి.ఎస్. పురం మండలాల్లో ఎక్కువ వర్షపాతం నమోదైన కారణంగా ఆయా ప్రాంతాల్లోని విద్యా సంస్థలకు కూడా సెలవు ప్రకటించడం జరిగిందన్నారు. ఏ ప్రాంతంలో వాగులు పొంగిపొర్లునంటే, సంబంధిత మండల అధికారులు స్థానికంగా విద్యా సంస్థలకు సెలవు ప్రకటించవచ్చని ఆయన సూచించారు. ప్రజలు భారీ వర్షాల సమయంలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హెచ్చరించారు.

కర్నూలు జిల్లాలో వాయుగుండం ప్రభావంతో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి, ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# వర్ష ప్రభావ పరిస్థితులపై చంద్రబాబునాయుడు ఆరా

### దుబాయయ్ నుంచి మరోమారు సీఎం టెలికాన్ఫరెన్స్

### జిల్లాలకు రూ.1 కోటి చొప్పున అత్యవసర నిధుల మంజూరు

అమరావతి,అక్టోబర్23 : దుబాయ్ పర్యటనలో బిజీబిజీగా ఉన్నప్పటికీ రాష్ట్రంలో వర్ష ప్రభావ పరిస్థితులపై ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆరా తీస్తున్నారు తాజాగా రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై దుబాయ్ నుంచి అధికారులతో మరోమారు సీఎం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. తీసుకోవాల్సిన చర్యలపై మంత్రులు, సీఎస్, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో మాట్లాడారు. వర్ష ప్రభావిత నెల్లూరు, ప్రకాశం, కడప, తిరుపతి, అన్నమయ్య జిల్లాల పరిస్థితిపై ఆయా జిల్లాల కలెక్టర్లు, ఆర్టీజీఎస్ అధికారులతో ముఖ్యమంత్రి చర్చించారు. నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాలకు రూ.2 కోట్ల చొప్పున, మిగతా వర్ష ప్రభావిత జిల్లాలకు రూ.1 కోటి చొప్పున అత్యవసర నిధుల మంజూరుకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను పంపాలని సూచనలు చేశారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. రెవెన్యూ, డిజాస్టర్, పోలీస్, ఇరిగేషన్, మున్సిపల్, ఆర్ అండ్ బి విద్యుత్ శాఖలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు సీఎం. లోతట్టు ప్రాంతాల్లోని వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. రిలీఫ్ కేంద్రాల్లో బాధితులకు నాణ్యమైన ఆహారం, పిల్లలకు పాలు అందించాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో ఇప్పటికే కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్టు సీఎంకు కలెక్టర్లు వివరించారు. కాలువ, చెరువు గట్లకు గండ్లు పడకుండా బలహీనంగా ఉన్న చోట్ల పటిష్ట పరచాలని.. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా చూడాలని సీఎం ఆదేశించారు. పంట నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు.

# బిజీబిజీగా చందబ్రాబు రెండోరోజు పర్యటన

### అబుదాబిలో పలువురు పారిశాపారిశ్రామికవేత్తలతో భేటీ



అమరావతి,అక్టోబర్23 : రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడులే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విదేశీ పర్యటనను కొనసాగిస్తున్నారు. రెండో రోజు పర్యటనలో భాగంగా గురువారం అబుదాబీలో పర్యటించారు. అబుదాబీలోని పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ విభాగాల ప్రతినిధులతో సీఎం నారా చంద్రబాబు నాయుడు భేటీ అయ్యారు. మొత్తం తొమ్మిది కీలక మీటింగ్‌లు, విజిట్‌లలో సీఎం చంద్రబాబు బృందం పాల్గొనుంది. ముఖ్యంగా పెట్టుబడులపై స్థానిక పారిశ్రామికవేత్తలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు. అబుదాబీ నేషనల్ ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, అబుదాబీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఛైర్మన్ అహ్మద్ జైసిమ్ అల్ జాబీ, జీ 42 సీఈఓ మన్సూర్ అల్ మన్సూరీ, అబుదాబీ ఇన్వెస్ట్‌మెంట్ విభాగం ఛైర్మన్ ఖలీఫా ఖౌరీతో చంద్రబాబు భేటీ కానున్నారు. ఈ సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు, పారిశ్రామిక భాగస్వామ్యాలు, టెక్నాలజీ సహకారం వంటి అంశాలపై చర్చలు జరగనున్నాయి. అదే విధంగా లులూ గ్రూప్ సీఎండీ యూసఫ్ అలీ, అగితా గ్రూప్ సీఈఓ సల్మీన్ అల్ మెరీ, మస్దార్ సిటీ సీఈఓ మహ్మద్ జమీల్ అల్ రమాహిలతో సీఎం చంద్రబాబు ప్రత్యేక సమావేశాలు జరపనున్నారు. ఈ సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్‌లో రిటైల్, ఇంధనం, పర్యావరణ అనుకూల ప్రాజెక్టులలో పెట్టుబడులపై చర్చ జరగనుంది. అబుదాబీలోని యాస్ ఐల్యాండ్ పర్యాటక ప్రాజెక్టులను సందర్శించి, ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగ అభివృద్ధి దిశగా ఆలోచనలు పంచుకోనున్నారు. చివరిగా, భారత కౌన్సిల్ జనరల్ నివాసంలో ముఖ్యమంత్రి గౌరవార్థం ఏర్పాటు చేసిన విందుకు చంద్రబాబు హాజరుకానున్నారు.

# టిడిపిలో లోపించిన అంతర్గత కమ్రశిక్షణ

### కేశినేని, కొలికిపూడి వివాదంతో బట్టబయలు

విజయవాడ,అక్టోబర్23: తెలుగుదేశం పార్టీ నేతల మధ్య అంతర్గత క్రమశిక్షణ, టీడీపీ లో కట్టుబాట్లు ఎక్కువ అని నేతలు చెబుతూ ఉంటారు.. కానీ, వాస్తవ పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉంది.. గతంలో టీడీపీ నేతలు కొంత క్రమశిక్షణ తోనే ఉన్న పరిస్థితి.. కానీ, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత టీడీపీ నేతలు బాగా రోడ్డెక్కిన పరిస్థితి కనిపిస్తోంది× ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేస్కోవడం.. పాలనా పరంగా.. రాజకీయంగా విమర్శలు చేసుకుంటున్న పరిస్థితి వచ్చింది. తాజాగా తిరువూరు ఎమ్మెల్యే కొలికలపూడి శ్రీనివాసరావు, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నారు. ఎంపీ కార్యాలయం అవినీతికి అడ్డాగా మారిందన్నారు కొలికలపూడి.. పదవులు అమ్ముకుంటున్నారు అన్నారు.. దీనిపై ఎంపీ కూడా ఘాటుగా స్పందించారు.. తను నిఖార్సయిన టీడీపీ కార్యకర్తను అంటున్నారు కేశినేని చిన్ని.. తనపై చేస్తున్న విమర్శలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు..ఒక గిరిజన మహిళ వివాదంతో మొదలైన ఘటన వీరి మధ్య వివాదానికి కారణం అయింది. టీడీపీలో ఉన్న అంతర్గత విభేదాల కారణంగా రచ్చ స్టార్ట్ అయింది.. ఇంకా కొన్ని జిల్లాలో ఎంపీ.. ఎమ్మెల్యే ల మధ్య వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి.. ఎంపీ బైరెడ్డి శబరి.. ఎమ్మెల్యే రాజ్ శేఖర్ రెడ్డి అంశం. కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి డైరెక్ట్ గా కౌన్సిల్ సమావేశంలో టీడీపీ నేతలపై విమర్శలు చేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.. టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పదే పదే చెబుతున్నా కూడా నేతలు ఇదే తరహా వైఖరి కొనసాగించడం.. తీవ్ర చర్చనీయాంశంగా మారుతోంది. పార్టీ లైన్ దాటి పోవద్దు అని చెప్తున్నా కూడా ఇదే లైన్ లో నేతలు ఉన్నారు.. దీంతో టీడీపీ అధిష్టానం.. తిరువూరుతో పాటు మరికొన్ని నియోజకవర్గాల నేతలను రేపు పార్టీ కార్యాలయానికి రమ్మని పిలిచినట్టుగా తెలుస్తోంది.. దీంతో అధిష్ఠానం ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుంది అనేది హాట్ టాపిక్ అయింది.. అయితే, నాకు అధిష్టానం నుంచి ఎటువంటి పిలుపు లేదు.. నన్ను ఎవరు రేపు పార్టీ ఆఫీసుకి రమ్మని చెప్పలేదు అన్నారు ఎంపీ కేశినేని చిన్ని నాపై ఎవరు ఆగ్రహం వ్యక్తం చేయలేదన్న ఆయన.. ఎమ్మెల్యే కొలికపూడిని రేపు అధిష్టానం రమ్మని చెప్పారేమో నాకు సమాచారం లేదన్నారు కేశినేని చిన్ని.. మరి ఎవరెవరిని టీడీపీ అధిష్టానం పిలిచింది.. ఎవరిపై చర్యలు తీసుకోనున్నారు అనేది రేపు తెలిసే అవకాశం ఉంది.

# శ్రీకాకుళం జిల్లాల్లో డీఐజీ ఆకస్మిక తనిఖీలు

### వార్షిక తనిఖీల్లోనే భాగమేనని వెల్లడి

అమరావతి, అక్టోబర్23 : వార్షిక తనిఖీల్లో భాగంగా శ్రీకాకుళం జిల్లాలో పలు పోలీస్ స్టేషన్లను విశాఖ డీఐజీ గోపీనాథ్ జెట్టి తనిఖీలు చేశారు. పీఎస్ లలో కేసుల పురోగతి, సిబ్బంది పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్ లో ఇన్స్పెక్షన్ చేసామని చెప్పారు. ప్రాపర్టీ అఫెన్సస్ ఎక్కువగా ఉన్నాయని.. వాటిలో పురోగతి ఆశించిన మేర లేదని చెప్పారు. పోక్సో చట్టాలపై విద్యా సంస్థల్లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మిగతా శాఖలతో కలిసి మరింత అవగాహన కల్పిస్తామని చెప్పారు. సైబర్ క్రైం పై ప్రత్యేక దృష్టి సారిస్తామన్న ఆయన.. సోషల్ మీడియా పోస్టులపై నిఘా పెడతామని చెప్పారు. ఫేక్ ఐడీలతో ఇతరులకు ఇబ్బంది కలిగించే పోస్టులు పెడితే చర్యలు తప్పవన్నారు. గంజాయి రవాణాపై గట్టి నిఘా పెట్టామని.. వినియోగం పైనా దృష్టి సారిస్తున్నామని చెప్పారు. అధిక వడ్డీలకు ఆశపడి ఫేక్ వాట్సాప్ మెసేజ్ లు, మెయిల్స్ నమ్మవద్దన్నారు. ఉత్తరాంధ్రలో మావోయిస్టు ప్రాబల్యం లేదని తెలిపారు. ఈ ప్రాంతానికి చెందిన వారు మావోయిస్టు ఉద్యమంలో ఉంటే బేషరతుగా లొంగిపోవాలని ఇప్పటికే పిలుపునిచ్చామని వివరించారు.

# హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబుకు సంబంధమే లేదు

### ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి

అమరావతి, అక్టోబర్23 : హైదరాబాద్‌ను అభివృద్ధి చేసింది ఏపీ సీఎం చంద్రబాబు కాదని, అది ఆయన భ్రమేనని ఏపీ మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి అన్నారు. 20 ఏళ్లపాటు హైదరాబాద్‌తో చంద్రబాబుకు సంబంధమే లేదని విమర్శించారు. హైటెక్ సిటీకి నాటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్ శంకుస్థాపన చేయగా హైటెక్ సిటీ అభివృద్ధి తన వల్లేనంటూ బీరాలు పలుకుతున్నారని పేర్కొన్నారు. తాడేపల్లి నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కూటమి పాలన, చంద్రబాబు వ్యవహారశైలీపై విరుచుకుపడ్డారు. 2003-04లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాం నుంచే హైదరాబాద్‌లో నిజమైన అభివృద్ధి మొదలైందని పేర్కొన్నారు. కేసీఆర్ రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేయడంతో హైదరాబాద్ నగరం శరవేగంగా అభివృద్ధి చెందిందని ప్రశంసించారు. కానీ చంద్రబాబు నిజాలను ఎప్పుడు అంగీకరించరని తెలిపారు. ఏపీ ఉద్యోగులకు బాబు అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికలయ్యాక, ఉద్యోగులకు మెరుగైన పీఆర్సీ, ఐఆర్ గురించి, అనేక వాగ్దానాలు చేశారని గుర్తు చేశారు. ఉద్యోగులకు జీపీఎస్ లేదు. ఓపీఎస్ లేదని, ఉద్యోగులను మోసం చేసి వికృత ఆనందం పొందుతున్నారని ఆరోపించారు. ప్రతినెలా ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు రావడం లేదని పేర్కొన్నారు. వైసీపీ హయాంలో ఉద్యోగులకు 11 డీఏలు ఇచ్చిన ఘనత తమదేనని అన్నారు.

# శ్రీవారికి దర్శనానికి 18 గంటలు

తిరుమల, అక్టోబర్23 : భక్తగ్రేసరుడు వేంకటేశ్వరస్వామి కొలువుదీరిన తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి దర్శనానికి 21 కంపార్టుమెంట్లలో వేచియున్నారు. టోకెన్లు లేని భక్తులకు 18 గంటల్లో సర్వదర్శనం అవుతుందని టీటీడీ అధదికారులు వివరించారు. నిన్న స్వామివారిని 73,853 మంది భక్తులు దర్శించుకోగా 22,551 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల వల్ల హుండీకి రూ. 3.47 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు.

# స్థానిక సంస్థలను బలోపేతం

### డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.

అమరావతి,అక్టోబర్23 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్థానిక సంస్థలను బలోపేతం చేస్తూ పాలనాపరమైన సంస్కరణలు తీసుకువచ్చామని, వాటి ఫలాలు ప్రజలకు సక్రమంగా అందించే బాధ్యత ఉద్యోగులపై ఉందని స్పష్టం చేశారు డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్.. నవంబర్ 1వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రాంతీయ అభివృద్ధి అధికారులు.. డీడీవో కార్యాలయాలు ప్రారంభించాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ ఉన్నతాధికారులతో పవన్ కల్యాణ్ సమావేశమయ్యారు. క్లస్టర్ విధానం రద్దు చేసి 13,351 గ్రామ పంచాయతీలను స్వతంత్ర యూనిట్లు చేయడం ద్వారా గ్రామీణులకు మెరుగైన సేవలు అందించే వెసులుబాటు తీసుకువచ్చామని డిప్యూటీ సీఎం చెప్పారు. పల్లెల్లో కనీస మౌలిక వసతుల కల్పనకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పంచాయతీలు, గ్రామీణాభివృద్ధికి నిధులు సమకూరుస్తున్నామని తెలిపారు. ఇక, 15వ ఆర్థిక సంఘం నిధులతోపాటు పంచాయతీలు ఆర్థిక స్వయం ప్రతిపత్తి సాధించే విధంగా సరికొత్త ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు పవన్ కల్యాణ్ నిధులు సమకూర్చడంలోను, పాలనాపరమైన సంస్కరణల్లోనూ కూటమి ప్రభుత్వం ఎంతో సానుకూల దృక్పథంతో ఉందనీ× ఆ ఫలితాలు ప్రజలకు చేర్చి పల్లెల అభివృద్ధిలో ఉద్యోగులు క్రియాశీలక బాధ్యత తీసుకోవాలన్నారు. నిధుల వినియోగం, పాలన సంస్కరణల అమలుపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు సమీక్షలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. పల్లె పండగ 2.0 ద్వారా గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలపై పూర్తి ప్రణాళిక అందించాలని ఆదేశించారు.



## బీచ్‌లో మడొన్నా సెబాస్టియన్
# అందాల ఆరబోత

ప్రస్తుతం సోషల్ మీడియాలో ఓ వయ్యారి షేర్ చేసిన ఫోటోస్ తెగ వైరలవుతున్నాయి. పైన ఫోటోలో బీచ్ లో బ్లాక్ డ్రెస్ లో అందాల బీభత్సం సృష్టిస్తున్న హీరోయిన్ ఎవరో గుర్తుపట్టారా.. ? తెలుగు, తమిళం, మలయాళం భాషలలో వరుస సినిమాల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక ఇమేజ్ క్రియేట్ చేసుకుంది. తక్కువ సమయంలోనే తనదైన ముద్ర వేసింది. ఆమె మరెవరో కాదండి. హీరోయిన్ మడొన్నా సెబాస్టియన్. నటనతోనే కాదు.. గ్లామర్ తో కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. తాజాగా బీజ్ ఒడ్డున సేద తీరుతూ అందుకు సంబంధించిన ఫోటోలను షేర్ చేసింది. బ్లాక్ కలర్ అవుట్ ఫిట్ లో అందాలు ఆరబోస్తూ సముద్రుడికే చెమటలు పట్టించేలా అందాలతో హీటెక్కించేసింది ఈ ముద్దుగుమ్మ. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోస్ సోషల్ మీడియాలో తెగ వైరలయ్యాయి. దీంతో ఈ బ్యూటీ అందం రోజు రోజుకీ పెరుగుతుందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. అంతేకాదు.. ఈ బ్యూటీకి రోజు రోజుకీ ఫాలోవర్స్ సైతం పెరిగిపోతున్నారు. ప్రేమమ్ సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన ఈ అమ్మడు మొదటి సినిమాతోనే అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ తర్వాత శ్యామ్ సింగరాయ్ సినిమాతో తెలుగు ప్రేక్షకులను ఫిదా చేసింది. ప్రస్తుతం తెలుగు, తమిళం, మలయాళం భాషలలో నటిస్తుంది. బెంగళూరులోని క్రైస్ట్ యూనివర్సిటీ నుండి బ్యాచిలర్ ఆఫ్ కామర్స్ లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. ఆ తర్వాత సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది. ప్రేమమ్ సినిమాతో తొలిసారిగా వెండితెరకు పరిచయమైన ఈ అమ్మడు.. ఆ తర్వాత వరుస అవకాశాలు అందుకుంది. ఎక్కువగా తమిళం, మలయాళం భాషలలో నటించింది. ప్రస్తుతం ప్రభాస్, సందీప్ రెడ్డి కాంబోలో రాబోతున్న స్పిరిట్ చిత్రంలోనూ కీలకపాత్ర పోషిస్తున్నట్లు సమాచారం.





# రాజాసాబ్‌కు గ్రాండ్ వెల్‌కల్

టాలీవుడ్ దర్శకుడు మారుతి–గ్లోబల్ స్టార్ ప్రభాస్ కాంబోలో వస్తోన్న మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్ట్ రాజాసాబ్. హార్రర్ కామెడీ జోనర్‌లో పాన్ ఇండియా బ్యాక్‌డ్రాప్‌లో వస్తోన్న ఈ చిత్రంలో మాళవిక మోహనన్, ఇస్మార్ట్ భామ నిధి అగర్వాల్, రిద్దికుమార్ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ప్రభాస్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ రాజాసాబ్ స్పెషల్ పోస్టర్ విడుదల చేశారు. కారు రూఫ్‌టాప్‌పై స్టైలిష్‌గా కూర్చున్న రాజాసాబ్‌కు గ్రాండ్ వెల్ కమ్ చెబుతున్న స్టిల్ ఇప్పుడు అభిమానుల్లో జోష్ నింపుతోంది. ఇప్పటికే రాజాసాబ్ ట్రైలర్‌ను లాంచ్ చేయగా.. కామెడీ, లవ్, రొమాన్స్, హార్రర్ లాంటి ఎలిమెంట్స్‌తో మారుతి మార్క్ కామెడీ టచ్‌తో సినిమా ఉండబోతున్నట్టు క్లారిటీ ఇచ్చేస్తుంది. ఈ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా 2026 జనవరి 9న విడుదల చేయనున్నారు. మేకర్స్ చాలా రోజుల క్రితం రాజాసాబ్ గ్లింప్స్ లాంచ్ చేశారని తెలిసిందే. గ్లింప్స్‌లో ప్రభాస్ సూపర్ స్టైలిష్‌గా చేతిలో పూలబొకే పట్టుకొని అద్దంలో తనను తాను చూసుకుంటూ.. పూలు చల్లుతూ నయా లుక్‌లో కనిపిస్తూ అభిమానులకు విజువల్ ట్రీట్ ఇస్తున్నాడు. ఈ మూవీని పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిబొట్ల సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. రాజాసాబ్‌లో సంజయ్ దత్ సంజూబాబా పాత్రలో కనిపించబోతున్నాడు.



## రాశీకన్నా భర్త ఏడాదికి ఎంత సంపాదిస్తున్నాడో ఎలుసా..?

తెలుగు సినీప్రియులకు ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేని పేరు రాశీ ఖన్నా. తెలుగులో ఊహలు గుసగుసలాడే సినిమాతో ఎంట్రీ ఇచ్చిన రాశీ.. తొలి చిత్రంతోనే నటిగా ప్రశంసలు అందుకుంది. తక్కువ సమయంలోనే ఇండస్ట్రీలో తనదైన ముద్ర వేసింది. ఢిల్లీకి చెందిన ఈ అమ్మడు.. చిన్నప్పటి నుంచి ఆఫీసర్ కావాలనుకుంది. అందుకే చదువుల్లో ముందుండేది. అయితే అనుకోకుండా సినీరంగం వైపు అడుగులు వేసింది. మొదట్లో చిన్న చిన్న ప్రకటనలు చేసిన రాశీ ఖన్నా.. ఆ తర్వాత హిందీలో పలు సినిమాల్లో నటించింది. 2013లో మద్రాస్ కేఫ్ సినిమాతో బాలీవుడ్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత ఊహలు గుసగుసలాడే సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. తెలుగుతోపాటు తమిళంలో వరుస అవకాశాలు అందుకుంటూ బిజీ హీరోయిన్ మారిపోయింది. దీపావళి పండగ సందర్భంగా అడియన్స్ ముందుకు వచ్చిన ఈ సినిమాకు పాజిటివ్ రివ్యూస్ వచ్చాయి. ఈ క్రమంలోనే తాజాగా బుల్లితెరపై ఓ షోలో పాల్గొన్న రాశీ ఖన్నా.. తనకు కాబోయే భర్త గురించి ఆసక్తికర విషయాలు పంచుకుంది. తెలుసు కదా సినిమా ప్రమోషన్లలో భాగంగా ఓ షోలో శ్రీనిధి శెట్టితో కలిసి పాల్గొంది రాశీ ఖన్నా. ఈ క్రమంలోనే మీకు కాబోయే భర్త ఎలా ఉండాలి ? ఎలాంటి క్వాలిటీస్ ఉండాలి అని అడగ్గా.. ఇద్దరు హీరోయిన్స్ బోర్డు పై రాసి చూపించారు. ఇందులో రాశీ తన కాబోయే భర్త గురించి రాసిన కామెంట్స్ వైరలవుతున్నాయి. తన కాబోయే భర్త వయసు 35 నుంచి 38 ఏళ్ల మధ్య ఉండాలని.. హైట్ 5 అడుగుల 9 అంగుళాల నుంచి 6 అడుగుల 3 అంగుళాల మధ్య ఉండాలని రాసింది. అలాగే బరువు 85 కేజీలు ఉండాలని..ఆస్తులు పెద్దగా ఉండాల్సిన అవసరం లేదని తెలిపింది. యాక్టర్ కానీ, డాక్టర్ గానీ అయితే ఓకే అని.. ముఖ్యంగా ఏడాదికి కోటి రూపాయల శాలరీ ఉండాలని చెప్పడంతో అందరూ షాకయ్యారు. ప్రస్తుతం రాశీ రాసిన కామెంట్స్ చక్కర్లు కొడుతున్నాయి.

## రెడ్‌కలర్ డ్రెస్‌లో మెరిసిన శ్రీలీల

ఈ మధ్య అందాల ముద్దుగుమ్మ శ్రీలీల గ్లామర్ డోస్ పెంచుతూ, యూత్‌కు నిద్రలేకుండా చేస్తుంది. రోజు రోజుకు తన అంద చందాలతో అందరినీ మాయ చేస్తుంది. తాజాగా ఈ బ్యూటీ రెడ్ కలర్ ట్రెండీ వేర్‌లో తన అందంతో అందరినీ మాయ చేస్తుంది. పెళ్లి సందడి మూవీతో తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టిన చిన్నది శ్రీలీల. ఈ ముద్దుగుమ్మ గురించి ఎంత చెప్పినా తక్కువే. మొదటి సినిమా హిట్ అవ్వకపోయినా, ఈ అమ్మడు మాత్రం అందరి మనసు దోచేసుకుంది. తన డ్యాన్స్, నటన, అందంతో అందరినీ ఆకట్టుకుంది. పెళ్లి సంద%ని% తర్వాత ఈ ముద్దుగుమ్మకు వరసగా అవకాశాలు తలపు తట్టాయి. వచ్చిన ప్రతి ఛాన్స్ మిస్ చేసుకోకుండా, వరసగా సినిమాలు చేస్తూ తన అభిమానులను అలరిస్తుంది. తర్వాత మళ్లీ పుష్ప2 సినిమాలో కిసక్కీ డ్యాన్స్‌తో విపరీతమైన క్రేజ్ సంపాదించుకుంది. ఈ సాంగ్‌లో ఈ అమ్మడు నటన, గ్లామర్‌కు ప్రతి ఒక్కరూ ఫిదా అయిపోయారు. దీని తర్వాత ఈ చిన్నదానికి వరసగా ఆఫర్స్ క్యూ కడుతున్నట్లు తెలుస్తోంది. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ చిన్నది, తాజాగా రెడ్ కలర్ ట్రెండీ వేర్‌లో తన అంద చందాలతో అందరినీ మాయ చేస్తుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.



## కేథార్‌నాధ్ ఆలయాన్ని సందర్శించిన సారాఅలీఖాన్

బాలీవుడ్ నటి సారా అలీ ఖాన్ మరోసారి ఉత్తరాఖండ్‌లోని పవిత్ర కేదార్‌నాథ్ ఆలయాన్ని దర్శించుకున్నారు. తాజాగా దర్శనం చేసుకున్న తర్వాత, ఆ దేవాలయంతో తనకున్న బలమైన, లోతైన అనుబంధం గురించి ఆమె సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. నేను మొదటిసారిగా కెమెరా ముందు నిలబడింది ఈ పవిత్ర భూమిలోనే. నా మొదటి సినిమా జ్ఞాపకాలు, అపారమైన భక్తి ఈ ప్రదేశంతో ముడిపడి ఉన్నాయి. అందుకే ప్రతిసారీ ఇక్కడికి రావడం నాకు చాలా ప్రత్యేకమైన అనుభూతిని ఇస్తుంది అని సారా తెలిపారు. సారా అలీ ఖాన్ తరచుగా కేదార్‌నాథ్‌ను సందర్శిస్తూ, ఆ అనుభూతులను అభిమానులతో పంచుకుంటూ ఉంటారు. హిందూ దేవాలయాలను సందర్శించడం, సంప్రదాయాలను గౌరవించడం పట్ల ఆమె చూపించే ఆసక్తిని నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. సినిమాల విషయానికి వస్తే.. ఈ ఏడాది స్కై ఫోర్స్, మెట్రో ఇన్ డీనో సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన సారా ప్రస్తుతం పతి పత్ని ఔర్ దో వో అనే చిత్రంలో నటిస్తుంది.



## గ్రీన్ శారీలో
# మెహరీన్ మెరుపులు

టాలీవుడ్ యంగ్ బ్యూటీ మెహ్రీన్ ఫిర్జాదా గురించి ఎంత చెప్పినా తక్కువే. ఈ అమ్మడు టాలీవుడ్‌లో చాలా సినిమాలే చేసింది కానీ స్టార్ హీరోయిన్‌గా మాత్రం గుర్తింపు సంపాదించుకోలేకపోయింది. ప్రస్తుతం ఈ చిన్నది అడపాదడపా సినిమాలు చేస్తూ కెరీర్ కొనసాగిస్తుంది. ముఖ్యంగా ఈ ముద్దుగుమ్మ ఇప్పుడు బాలీవుడ్ పై ఫోకస్ పెట్టి అక్కడ ఫుల్ బిజీ అయిపోతుంది. మెహ్రీన్ ఫిర్జాదా, 2016లో వచ్చిన కృష్ణగాడి వీర ప్రేమగాథ సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది, తన ఫస్ట్ సినిమాతోనే అందం, అభినయంతో అందరినీ ఆకట్టుకుంది. తన క్యూట్ క్యూట్ ఎక్స్ప్రెషన్స్‌తో అందరినీ తనవైపు లాక్కుంది. ఆ తర్వాత ఫిల్లౌరీ అనే హిందీ సినిమాతో బాలీవుడ్‌లోకి అడుగు పెట్టింది. ఇక ఈ సినిమా తర్వాత మెహ్రీన్‌కు వరసగా ఆఫర్స్ క్యూ కట్టాయి. దీంతో వరస సినిమాలతో ఫుల్ బిజీ అవుతుంది, స్టార్ హీరోయిన్‌గా సత్తా చాటుతుందని అందరూ అనుకున్నారు. కానీ ఎవరూ ఊహించని విధంగా ఈ ముద్దుగుమ్మ కెరీర్ డౌన్ ఫాలోఅయ్యింది. మొదటి సినిమా సూపర్ హిట్ అందుకుంది. తర్వాత చేసిన సినిమాల్లో చాలా వరకు ఫ్లాప్ అయ్యాయి. మహానుభావుడు, ఎఫ్2, ఎఫ్3 వంటివి మాత్రమే ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఇక ఈ ముద్దుగుమ్మ నటించిన సినిమాలు ఫ్లాప్ కావడంతో ఈ ముద్దుగుమ్మకు కూడా ఆపర్స్ రావడమే కరువైపోయింది. దీంతో ఈ బ్యూటీ బాలీవుడ్ పై ఫోకస్ పెట్టి అక్కడ సినిమాలు చేయడానికి రెడీ అవుతున్నట్లు ఇండస్ట్రీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ చిన్నది, తాజాగా గ్రీన్ కలర్ శారీలో అందంగా ముస్తాబై, తన అంద చందాలతో అందరి మనసు దోచేస్తుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.



Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com